

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ





: fb.com/vaartha Digital



Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-8-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 204 పేజీలు: 10+4 వెల: 8.00


## పారిశుద్ధ్య కార్మికుల జీవితాలకు భద్రత



శనివారం పారిశుద్ధ్య కార్మికులకు యాక్సిస్ బ్యాంక్ శాలరీ అకౌంట్లను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

### వారికోసం ప్రమాద, ఆరోగ్య బీమాను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

### యాక్సిస్ బ్యాంక్ శాలరీ అకౌంట్లు, బీమాకు తక్కువ ప్రీమియం

### పెద్దాపురం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సిఎం

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో ఆగస్టు 23 (ప్రభాతవార్త):** మున్సిపల్ కార్మికులు, వారి కుటుంబాలకు సంక్షేమం, భద్రత అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దాపురంలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రమాద, ఆరోగ్య బీమా స్కీంను లాంఛనంగా ప్రారంభించారు. పట్టణాభివృద్ధి శాఖ ఆక్సిస్ బ్యాంక్ సంయుక్తంగా ఈ స్కీంను అమలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఇప్పటికే మున్సిపల్ కార్మికుల శాలరీ ప్యాకేజ్ ఖాతాలు ప్రారంభించారని, ఈ కొత్త ఆర్థికసదుపాయం ద్వారా మున్సిపల్ కార్మికులకు గణనీయమైన భరోసా లభించనుందని చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 123 అర్బన్ లోకల్ బాడీస్‌లో మొత్తం 55,686 మంది కార్మికులు సేవలందిస్తున్నారని, ఇప్పుడు ఈ స్కీం ద్వారా వీరందరికీ ఈ బీమా సదుపాయం లభించనుందన్నారు
వీరిలో 39,170 మంది పబ్లిక్ హెల్త్ విభాగంలో ఉండగా, 16,516మంది ఇతరవిభాగాల్లో పనిచేస్తున్నా రని, వీరిలో శాశ్వత, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న వారందరికీ ఈ పథకం వర్తించనుందని ఇప్పటి వరకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరణించిన సందర్భాల్లో కుటుంబీకులకు ఎక్స్‌గ్రేషియా రూపంలో ప్రభుత్వం సహాయం అందిస్తోంది. ప్రమాద మరణానికి రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ. 2 లక్షలు ఇచ్చే విధానం అమలులోఉంది. ఇప్పుడు ఆక్సిస్‌బ్యాంక్‌తో కుదుర్చు కున్న అవగాహన ఒప్పందం ద్వారా ఈ ప్రయోజనాలు మరింత విస్తరించాయని తెలిపారు. శాశ్వత ఉద్యోగులకు ఒక రూ. 1 కోటి వరకు ప్రమాద బీమా, పది లక్షల లైఫ్ కవర్ లభించనుంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇరవై లక్షల ప్రమాద బీమా, రెండులక్షల లైఫ్‌కవర్ సదుపాయం ఉంటుందని, అంతేకాకుండా ప్రమాద మరణం జరిగితే పిల్లల చదువు కోసం గరిష్టంగా రూ. 8 లక్షల వరకు విద్యా సహాయం అందించనుందని దీంతో పాటు తక్కువ ప్రీమియం ద్వారా ఆరోగ్య బీమా అందుబాటులో ఉందని. కుటుంబ సభ్యులతోకలిపి మొత్తంగా రూ.33 లక్షల >>2



ఫస్ట్.. నిమ్మల



సెకండ్.. లోకేష్

## ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంకులు

### చివరి స్థానాల్లో పయ్యావుల, అచ్చెన్నాయుడు

### మంత్రుల పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్తప్రతినిధి:** మంత్రులు తమకు కేటాయించిన శాఖలపై పూర్తి అవగాహనతో, స్పష్టతతో ఉండాలని సిఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.కీలకమైన మంత్రిత్వశాఖలు నిర్వహిస్తున్న వారు తమ శాఖలో ఏమీ జరుగుతుందని, ఏ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామనే విషయంపై శ్రద్ధ పెట్టాలన్నారు. రాష్ట్రంలో మంత్రుల తీరుపై వారితో సిఎం చంద్రబాబు వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు.వారి పనితీరు ఆధారంగా ర్యాంకులు వెల్లడించారు. మొదటి స్థానంలో మంత్రి రామానాయుడు, చివరి స్థానాల్లో కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్ జాబితాలో జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన తర్వాత ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ రెండో స్థానంలో, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మూడో స్థానంలో ఉన్నారు. వీరి తర్వాత నాలుగో స్థానంలో హోం మంత్రి అనిత, ఐదో స్థానంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చోటు దక్కించుకున్నారు. చివరి స్థానాల్లో కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్ ఉన్నారు. ఫైల్స్ క్లియరెన్స్ ఆధారంగా ఈ ర్యాంకులు ఇచ్చానన్నారు.తమ మంత్రిత్వ శాఖల్లో పని క్లియరెన్స్ లేకుండా ఎలా అభివృద్ధి జరుగుతుందన్నారు.శాఖల వారిగా మంత్రుల తీరును ఆయన పరిశీలించి, మెరిట్స్,డీ మెరిట్స్‌ను వివరించారు. ఇవి సరి చేసుకోవాలన్నారు. కీలక మంత్రులు తమ, తమ నియోజకవర్గాల అభ్యున్నతిపాటు శాఖాపరమైన ప్రగతిపై దృష్టి >>2




**గమనిక**

ఆదివారం అనుబంధం బదులుగా నేటి సంచికతో 'వినాయక వ్రతకల్పం' ఉచితంగా అందుకోండి
– సర్క్యులేషన్ మేనేజర్

## అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి నిర్మాణం

### అభివృద్ధికి సంస్కరణలే గట్టి పునాదులు

### ఆర్థిక వ్యవస్థలో భారత్ పోటీ అమెరికా, చైనాతోనే

### జనవరిలో క్వాంటం వ్యాలీ ఆరంభం: సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిని ఆర్థికంగా నిలబెట్టేదిశలో ఒక విజన్ తాము అమలు చేస్తున్న సంస్కరణలు అభివృద్ధికి గట్టిపునాదులుగా నిలిచాయని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. ఒకప్పుడు ఒక విజన్‌తో చేసిన ప్రతిపాదనలను చూసి వెక్కిరించిన వారు ఇప్పుడు ఆశ్చర్యపోతున్నారన్నారు. తెలంగాణా అభివృద్ధికి ఐటి కారణమన్నారు. ఈ వ్యవస్థ బలపడటానికి తాము తీసుకున్న చర్యలు ఆ నగరాన్ని ప్రపంచంలో దిగ్గజంగా నిలిపిందన్నారు. ఇప్పుడు అమరావతి నగరాభివృద్ధి క్వాంటం కంప్యూటింగ్ కీలకం కానున్నదన్నారు. అతి కొద్ది కాలంలోనే అమరావతి విశ్వవిఖ్యాతమవుతుందన్నారు. ఇక్కడ క్వాంటం కంప్యూటర్ వ్యాలీ మహాఅద్భుతం కానున్నదన్నారు. చంద్రబాబు అంతర్జాతీయ జీవన ప్రమాణాలతో అమరావతి నిర్మిస్తున్నామని చెప్పారు. ఒక ప్రముఖ దినపత్రిక ఢిల్లీలో నిన్న నిర్వహించిన వరల్డ్ లీడర్స్ ఫోరంసదస్సులో చంద్రబాబు కీలక ప్రసంగం చేసారు. ఆ అంశాలతో పాటు సిఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.
ప్రధాని మోడీ తదుపరి తరం సంస్కరణల వైపు వెళ్తున్నారన్న చంద్రబాబు దీంతో మరో ఏడాదిలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని చెప్పారు. ఆ తర్వాత మనకంటే 4.5 రెట్లు, 7.5 రెట్ల పెద్దగా ఉన్న చైనా, అమెరికా ఆర్థిక వ్యవస్థలతో పోటీపడాలన్నారు. కాబట్టి మనం గేర్ మార్చాలని తెలిపారు. ఇందుకు ప్రపంచస్థాయి నాణ్యతతో కూడిన వస్తువుల భారీ ఉత్పత్తి దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాలని తెలియజేశారు. దేశంలో తొలిసారి జనవరి నుంచి అమరావతిలో ఎఐతో కూడిన క్వాంటమ్ వ్యాలీ ప్రారంభిస్తున్నామని వివరించారు. దీంతో పెద్ద ముందడుగు పడుతుందని పేర్కొన్నారు. ట్రంప్ టారిఫ్ ఇబ్బందులు తాత్కాలికమేనని ప్రధాని వాటిని సమర్థంగా పరిష్కరిస్తారని సిఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ప్రతి సవాల్ వెనుక ఓ అవకాశం ఉంటుందనే విషయాన్ని గమనించాలన్నారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌ల వల్ల వచ్చిన సమస్యలను పరిష్కరించాలని అదే సమయంలో రాజీపడకూడదని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రస్తుత ఇబ్బందులను ప్రధాని మోదీ చాలా సమర్థంగా పరిష్కరిస్తారని ధీమా వ్యక్తం చేశారు సంపద సృష్టికర్తలకే సంక్షేమ పథకాలిచ్చే హక్కు ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు.
ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే అభ్యర్థికి మద్దతు విషయంలో మీడియాకు సందేహం ఎందుకని చంద్రబాబు ప్రశ్నించారు. ఒకఅనుమానం సృష్టించి వ్యక్తులు, పార్టీల విశ్వసనీయతతో ఆడుకోవడం సరికాదన్నారు. ఓటర్ల జాబితా సవరణ అన్నది నిరంతర ప్రక్రియని చెప్పారు.
రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నికల సంఘాలు స్వయంప్రతిపత్తితో పనిచేస్తున్నాయని తెలిపారు. తప్పొప్పుల పరిశీల నకు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు కూడా ఓటర్ల >>2

## భూపేష్ భగేల్ కుమారునికి 14 రోజుల రిమాండ్

### లిక్కర్ కుంభకోణం కేసు

**రాయ్‌పూర్, ఆగస్టు 23:** లిక్కర్ కుంభకోణం కేసులో అరెస్టయిన చైతన్య బఘేల్‌కు రాయ్‌పూర్ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఐదు రోజుల ఇడి కస్టడీ శనివారంతో ముగియడంతో అతడిని కోర్టులో హాజరుపర్చారు. మరో 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్‌కు ఇవ్వాలని ఇడి తరఫు న్యాయవాది కోర్టును కోరారు. దాంతో కోర్టు అందుకు అనుమతించింది. వచ్చే నెల 6వ తేదీ వరకు చైతన్య బఘేల్‌కు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కేసు తదుపరి విచారణ వచ్చే నెల 6న జరగనుంది.
ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కుమారుడైన చైతన్య బఘేల్‌కు లిక్కర్ కుంభకోణంలో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దాంతో ఇడి అతడిని అరెస్టు చేసింది. శనివారంతో అతడి ఐదురోజుల ఇడి కస్టడీ ముగియడంతో అధికారులు రాయ్‌పూర్ కోర్టులో హాజరుపర్చారు. నిందితుడిని రెండు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి ఇవ్వాలని కోరారు. దాంతో కోర్టు అందుకు అనుమతి ఇచ్చింది.

## 12 మంది సిఎంలపై క్రిమినల్ కేసులు!

### తెలంగాణ సిఎం రేవంత్‌పై 89, తమిళనాడు సిఎం స్టాలిన్‌పై 47, చంద్రబాబుపై 19, సిద్దరామయ్యపై 13 కేసులు: -ఎడిఆర్ నివేదిక

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** దేశ రాజకీయాల్లో ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. దేశ వ్యాప్తంగా వున్న 30 మంది ముఖ్యమంత్రుల్లో 12 మందిపై క్రిమినల్ కేసులున్నట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిపోర్ట్స్ (ఎడిఆర్) అనే సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇందులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధికంగా 89 కేసులుండగా తమిళనాడు సిఎం స్టాలిన్‌పై 47 కేసులున్నాయి. వీరి తరువాత ఎపిసిఎం చంద్రబాబు నాయుడుపై 19 కేసులు, కర్నాటక సిఎం సిద్దరామయ్యపై 13 కేసులు, ఝార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్‌పై ఐదు, మహారాష్ట్ర సిఎం దేవేంద్ర పడ్నవిస్, హిమాచల్ ప్రదేశ్ సిఎం సుఖ్వీందర్ సింగ్‌లపై నాలుగేసి కేసులున్నాయి. కేరళసిఎం పినరాయి విజయన్‌పైరెండు, పంజాబ్ సిఎం భగ >>2

## కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ అరెస్టు

### బాలు నాయక్ వద్ద రూ. 100 కోట్లు పైనే అక్రమాస్తులు గుర్తించిన ఎసిబి

**తిరుపతి,ఆగస్టు23ప్రభాతవార్తప్రతినిధి:** మూడు పదుల ఏళ్లలో తన ప్రభుత్వ సర్వీస్‌లో వందల కోట్లరూపాయలుపైమాటగానే అక్రమాస్తులు కూడబెట్టాడనే ఫిర్యాదులపై కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలునాయక్‌ను అవినీతి నిరోధకశాఖ (ఎసిబి) అధికారులు అరెస్ట్‌చేశారు. రెండు రోజులు నిరవధికంగా ఆయన ఇళ్లలో, బంధువుల ఇళ్లలో సోదాలు చేసిన ఎసిబి అధికారుల బృందం శనివారం సాయంత్రానికి భారీగానే అక్రమాస్తులు ఉన్నట్లు తేల్చింది. తిరుపతిలో, అన్నమయ్యజిల్లా సంబేపల్లి, రాయచోటి, మదనపల్లిలో ఆయన పేరున, కుటుంబ సభ్యుల పేరున ఆస్తులు ఉన్నాయి. భారీగా అక్రమాస్తులు సంపాదించాడని లెక్కతేల్చారు. 11చోట్ల ఇళ్లస్థలాలు, ఇండ్లు, డూప్లెక్స్ ఇళ్లు, భూములు కలిగివున్నట్లు ఎసిబి తేల్చింది. ఆయన పేరున రెండు నాలుగుచక్రవాహనాలు, ఐదు ద్విచక్రవాహనాలు, 5కోట్ల రూపాయలు బ్యాంకు ఖాతాల్లో బ్యాలెన్స్‌లు, 25 లక్షలరూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, >>2



అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఐకానిక్ భవనం ఆకృతి (ఉవాజనీత చిత్రం)

## క్వాంటం వ్యాలీలో ఐకానిక్ భవనం ఇదే


### డిజైన్‌ను ఖరారు చేసిన ప్రభుత్వం

**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి క్వాంటమ్ వ్యాలీలో నిర్మించే ఐకానిక్ భవనం ఆకృతిని ప్రభుత్వం ఖరారుచేసింది. ప్రపంచంలో ఎక్కడా లేని ప్రత్యేకత ఉండేలా ఆకృతి ఎంపికలో జాగ్రత్తలుతీసుకుంది. ఐకానిక్ భవనానికి సెప్టెంబర్ మొదటివారంలో శంకుస్థాపన చేయాలని భావిస్తున్న సర్కార్ ఆ తర్వాతేఎంపికచేసిన బిల్డింగ్ డిజైన్‌ను విడుదల చేయనుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానించాలని భావిస్తోంది.ఐకానిక్‌భవనాన్ని 3డీప్రింటింగ్ >>2

## సౌర విద్యుత్‌కు పెద్దపీట

### 2.93 లక్షల వ్యవసాయ పంపుసెట్లు, 1,156 వ్యవసాయ ఫీడర్లకు సోలార్ విద్యుత్ కల్పిస్తాం

### -ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్



**విజయవాడ, ఆగస్టు 23 :** పిఎం కుసుమ్ పథకంలో భాగంగా ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ కు సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2.93 లక్షల వ్యవసాయ పంపుసెట్లను, 1156 వ్యవసాయ ఫీడర్లను సోలరైజ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ఇందుకు సంబందించిన ప్రాజెక్ట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలనీ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ రాష్ట్ర విద్యుత్ పంపిణి సంస్థలను ఆదేశించారు.
శనివారం చీఫ్ సెక్రటరీ క్యాంపు కార్యాలయం నుండి ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ గురించి ఎపి డిస్కాములతో సిఎస్ వర్చువల్ సమావేశం నిర్వహించారు. దేవలపర్ల కూడా ఈ సమీక్షలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ కె విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2.93 లక్షల వ్యవసాయ పంపుసెట్లు, 1,156 ఫీడర్లు సోలరైజేషన్ చేయడం ద్వారా 1,162.8 మెగావాట్ల సామర్థం గల సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటవుతాయని, ఇందుకోసం ప్రభుత్వం 5,842 ఎకరాల భూమిని గుర్తించడం జరిగిందని సిఎస్ తెలిపారు. జిల్లాల కలెక్టర్లుతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్నదాదాపు 1,700 ఎకరాల భూములను త్వరితగతిన నెడ్క్యాప్‌కు అందజేసేలా డిస్కాములు చర్యలు తీసుకోవాలని, ఎంపికైన దేవలపర్లతో పవర్ పర్చేజ్ ఒప్పందాలు (పిపిఎ), ల్యాండ్ లీజ్ ఒప్పందాలు వెంటనే కుదుర్చుకోవాలని సంబంధిత అధికారులకు సిఎస్ ఆదేశించారు. సెంట్రల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ సిఎఫ్ఎ విడుదల సాఫీగా జరిగేలా నెడ్క్యాప్ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రాజెక్టులు ఏడాదిలోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.
వ్యవసాయ ఫీడర్లసోలరైజేషన్ ద్వారా ప్రభుత్వంపై సబ్సిడీ భారాన్ని తగ్గించుకోవచ్చని, రైతులకు నాణ్యమైన పగటి పూట విద్యుత్ అందించేందుకు దోహద పడుతుందని, పునరుత్పాదక విద్యుత్ వినియోగం మరింత పెరుగుతుం >>2



కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర

## బెట్టింగ్ యాప్స్ కేసు: కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కెసి వీరేంద్ర అరెస్టు

**బెంగళూరు, ఆగస్టు 23:** కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కెసి వీరేంద్రనుశనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) అరెస్టు చేసింది. మనీలాండరింగ్ కేసులో ఎమ్మెల్యే వీరేంద్రను అరెస్టు చేశారు. ఎమ్మెల్యేకు చెందిన అనే ప్రదేశాలపై శుక్రవారం ఏకకాలంలో ఇడి దాడులు చేసింది. ఈ సందర్భంగా రూ. 12 కోట్లకుపైగా నగదు, బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు ఒక కోటికంటే ఎక్కువ విలువైన విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. >>2

## 29 నుంచి ప్రధాని మోడీ జపాన్, చైనా పర్యటన

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** ప్రధాని మోడీ ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 1 వరకు జపాన్, చైనాల్లో పర్యటించనున్నారు. మోడీ తనపర్యటనలో ముందుగా రెండురోజులపాటు (29, 30వ తేదీలు) జపాన్‌ను సందర్శిస్తారు.
ఆ తర్వాత చైనాకు చేరుకుని తియాన్‌జిన్‌లో నిర్వహించనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్రత సదస్సులో పాల్గొంటారని విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది. ఈ నెల 31, వచ్చే నెల 1తేదీల్లో నిర్వహించనున్న శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ తదితరులు హాజరుకానున్నారు.




శనివారం 'నేషనల్ స్పేస్‌డే' సందర్భంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో భారతీయ అంతరిక్ష కేంద్రం నమూనాను ఆవిష్కరించిన శుభాంశు శుక్లా

# ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంక్‌లు

>> పెట్టాలన్నారు.ర్యాంకింగ్‌లు గమనించి మంత్రులు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు.తమ,తమ మంత్రిత్వశాఖల్లో బ్యూరోక్రాట్స్‌పై దృష్టి పెట్టాలన్నారు.ప్రభుత్వం నిర్దేశించిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజలందరికి చేరాల్సి ఉందన్నారు.

**13మంది ఎంఎల్‌ఏలకు సీఎం చంద్రబాబు క్లాస్**

టిడిపిలో ఇటీవల వివాదాల్లో చిక్కుకున్న 13మంది ఎంఎల్ఎలను సిఎం చంద్రబాబు తన కార్యాలయానికి పిలిపించారు.వారు ప్రవర్తనావళిని మార్చుకోవాలని హెచ్చరించారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం, నేరపూరిత స్వాభావం ఉన్న నాయకులతో సాన్నిహిత్యంగా ఉండటం, తాను ఏ మాత్రం సహింవచని విషయాలన్నారు. లా అండ్ ఆర్డర్‌కు ఇబ్బంది కలిగించే విషయంలో కొందరు ఎంఎల్ఎల ప్రవర్తన ఉంటుందన్నారు.తప్పు చేసి,దాన్ని తప్పించుకోవడానికి ప్రయత్నించవద్దని,సరిదిద్దుకోవాలన్నారు.పార్టీకి నష్టం కలిగించే చర్యలను మానుకోవాలని లేకుంటే చాలా తీవ్రంగా వ్యహరించాల్సి వస్తుందన్నారు.క్రిమినల్ నేరాల్లో తలదూర్చిన ఎంఎల్ఎలకు పార్టీపరంగా ఎటువంటి సహకారం ఉండదన్నారు.వారిపై నేరం రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తామన్నారు.ఎంఎల్ఎలు పార్టీ కేడర్ మనోభావాలకు గౌరవం ఇవ్వాలన్నారు.ఈ విషయంలో తేడాలుండ కూడదన్నారు.ఎన్డీఏ కూటమి పక్షాలతో స్నేహ సంబంధాలుండాలే గాని శత్రుత్వం ప్రదర్శించకూడదన్నారు.క్షేత్రస్థాయిలో అభివృద్ధికి అందరు కలిసి సంఘటితంగా పనిచేయాలని సిఎం ఆదేశించారు.



లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ 'ఓటర్ అధికార యాత్ర'లో భాగంగా శనివారం బీహార్‌లోని కతియార్ జిల్లాలోకి ప్రవేశించిన చిత్రం

# జీవితాలకు భద్రత

>> వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుందన్నారు. ఇదే కాకుండా మున్సిపల్ కార్మికుల కుటుంబ సభ్యులు మరో జీరో బ్యాలెన్స్ అకౌంట్ తెరిస్తే వారికి రూ. 15 లక్షల మేర ప్రమాద బీమా కూడా అందుబాటులోకి వస్తుందని వివరించారు.ఈ పథకం తమకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మున్సిపల్ కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**మెజిక్ డ్రైన్ ను పరిశీలించిన సీఎం చంద్రబాబు**

హెలిప్యాడ్ నుంచి బయలుదేరిన చంద్రబాబు స్వర్ణ ఆంధ్రాస్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో పెద్దాపురం 10వ వార్డు దొరయ్యపేటలో ఏర్పాటు చేసిన మెజిక్ డ్రైన్‌ను పరిశీలించారు. శానిటేషన్ సెక్రెటరీ ఎం.దుర్గాప్రసాద్ ఈ సందర్భంగా మెజిక్ డ్రైన్ ఉపయోగాలు, ఖర్చు వంటి వివరాలను సిఎం చంద్రబాబు నాయుడుకి వివరించారు.

పారిశుధ్య కార్మికులు వర్రె భవాని, వర్రె దుర్గాప్రసాద్, తాతపూడి నాగేశ్వరరావు, శివకోటి నాగేశ్వరరావులతో సిఎం చంద్రబాబు ముచ్చటించారు. చెత్తకు బదులుగా నిత్యావసరాల సరుకులు, కిరాణా సరుకులు అందించే స్వచ్ఛా రథాలను పరిశీలించారు. అక్కడ నుంచి కుమ్మరి పేట నుంచి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛా ర్యాలిని ఆయన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. సిఎం చంద్రబాబు అక్కడ నుంచి ప్రజా వేదిక వద్దకు చేరుకున్నారు. అంతకు ముందు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికిన వారిలో కాకినాడ జిల్లా ఇంచార్జ్ మంత్రి, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, కార్మిక శాఖ మంత్రి వి.సుభాష్, స్థానిక శాసన సభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, కాకినాడ లోక్‌సభ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా స్పెషల్ ఆఫీసర్ జి. వీరపాండ్యాన్, జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జి.బిందు మాధవ్, ప్రభుత్వ విప్ లు తుని ఎమ్మెల్యేలు యనమల దివ్య, ముమ్మిడివరం ఎమ్మెల్యే డి.సుబ్బరాజు, శాసనమండలి సభ్యులు పెరాబత్తుల రాజశేఖర్, కర్రీ పద్మశ్రీ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), ప్రత్తిపాడు ఎమ్మెల్యే వి.సత్యా ప్రభ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అనపర్తి ఎమ్మెల్యే ఎన్. రామకృష్ణ రెడ్డి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ టి. సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), మాజీ మంత్రి చిక్కల రామచంద్రరావు, మాజీ జడ్పీ చైర్మన్ జ్యోతుల నవీన్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు తదితరులు ఉన్నారు.

# కమిషనర్ అరెస్టు

>> అరకిలో బంగారు ఆభరణాలు, కిలో వెండి వస్తువులు ఇలా భారీగానే అక్రమాస్తులు ఉన్నాయి. ఇంకా కీలకపత్రాలను ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లిమండలం పెద్దబిడిగికి చెందిన ఎం.బాలునాయక్ 1995లో కార్మికశాఖలో చేరాడు. అప్పటినుండి అంచలంచలుగా ఎదుగుతూ ప్రస్తుతం కర్నూలులోని సంయుక్త కమిషనర్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్నాడు. గతంలో ఆయన తిరుపతిలో, మదనపల్లిలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా పనిచేశాడు. ఆసమయంలో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టాడనేది ప్రధాన ఆరోపణ. శనివారం సాయంత్రం అతనిని అరెస్ట్‌చేసి నెల్లూరు ఎసిబి కోర్టుకు తరలించినట్లు తిరుపతి ఎసిబి అదనపు ఎస్పీ విమలకుమారి తెలిపారు.

# క్రిమినల్ కేసులు!

>> వంత్ మాన్‌పై ఒక కేసు నమోదయ్యింది. కాగా కేసుల సంఖ్యతో పాటు కొన్నింటిలో వాటి తీవ్రత కూడా ఎక్కువగా వుందని ఎడిఆర్ సంస్థ తెలిపింది. ఇందులో పది మంది సిఎంలపై హత్యాయత్నం, కిడ్నాపింగ్, అవినీతి ఆరోపణలు వున్నాయని ఆ సంస్థ వెల్లడించింది. ప్రస్తు త పరిస్థితుల్లో ఈ నివేదికకు రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది. ఐదేళ్ల కంటే ఎక్కువ శిక్ష పడే కేసుల్లో అరెస్టయి 30 రోజుల పాటు జైల్లో వుంటే ప్రధానితో పాటు ముఖ్యమంత్రులు, మంత్రులను పదవుల నుంచి తొలగించేలా కేంద్రం ఒక బిల్లును తీసుకు వస్తున్న తరుణంలో ఈ వివరాలు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. కాగా ఆయా ముఖ్యమంత్రులు తమ ఎన్నికల అఫిడవిట్లలో పొందుపరిచిన సమాచారం ఆధారంగానే తాము ఈ నివేదికను రూపొందించినట్లు ఎడిఆర్ వెల్లడించింది.

# ఆంధ్రకేసరికి సిఎం చంద్రబాబు నివాళి



ఆంధ్రకేసరి చిత్రపటానికి నివాళిని అర్పిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్తప్రతినిధి:** స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, నివాళులర్పించారు. తన కార్యాలయంలోని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళిని అర్పించారు.

తెలుగువారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన ధీరోదాత్తుడు, త్యాగధనుడు, తెలుగుజాతి సాహసానికి ప్రతీక టంగుటూరి అని సిఎం చంద్రబాబు కొనియాడారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన సీఎం చంద్రబాబు.. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రగతికి బాటలు పరిచిన ప్రకాశం పంతులు ప్రజాసేవను, దేశభక్తిని ఈ సందర్భంగా స్మరించుకుందామన్నారు.

భారతదేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను పణంగా పెట్టి బ్రిటీష్ పాలకులతో పోరాడిన యోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి,అని అన్నారు. తుది శ్వాస వరకు ప్రజల కోసం జీవించిన ఆ మహనీయుడి జయంతి సందర్భంగా మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నానని పేర్కొన్నారు.

# నేడు, రేపు ఢిల్లీలో స్పీకర్ల సదస్సు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు23:** ఆది, సోమవారాల్లో ఢిల్లీ అసెంబ్లీ భవనంలో రెండు రోజుల పాటు ఆల్ ఇండియా స్పీకర్స్ సదస్సు జరుగనుంది. ఈ రెండు రోజుల సదస్సును కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. సోమవారం ముగింపు కార్యక్రమానికి లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా హాజరు కానున్నారు. ఈ కాన్ఫరెన్స్ కు 32 మంది స్పీకర్లు, పలువురు డిప్యూటీ స్పీకర్లు, కౌన్సిల్ చైర్మన్ లు డిప్యూటీ చైర్మన్ లు హాజరుకానున్నారు.

ఈ మేరకు శనివారం తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ఆధ్వర్యంలోని తెలంగాణ శాసనమండలి బృందం ఢిల్లీకి చేరుకుంది. బృందంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వి.నరసింహాచార్యులు, అసెంబ్లీ అదనపు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, మండలి చైర్మన్ ఓఎస్‌డి గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

1925లో భారతదేశ సెంట్రల్ లేజిస్లేటివ్ అసెంబ్లీకి స్పీకర్‌గా ఎన్నికైన మొదటి భారతీయుడు కీ.శే విఠల్ బాయి పటేల్ బాధ్యతలు స్వీకరించిన వందేళ్ల సందర్భాన్ని పురస్కరించుకుని ఆది,సోమవారాల్లో (24,25 తేదిలలో) జరుగుతున్న ఈ ప్రత్యేక సమావేశంలో పాల్గొనడానికి తెలంగాణ శాసనసభ, శాసనపరిషత్ బృందం ఢిల్లీ వెళ్ళింది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు కంటి శస్త్రచికిత్స జరిగినందువల్ల ఈ సమావేశాలకు హాజరు కావడం లేదు.

# సురవరం మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది

## - సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్త ప్రతినిధి:** కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి మృతిపై సిఎం చంద్రబాబు స్పందించారు. ఆయన మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. అనునిత్యం ప్రజల గురించి ఆలోచించే సుధాకర్‌రెడ్డి లేరంటే నమ్మలేకపోతున్నట్లు చెప్పారు. 'సమకాలీన రాజకీయ నాయకుడిగా ఆయనతో పనిచేసిన రోజులు గుర్తొస్తున్నాయి. కమ్యూనిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి సిపిఐ జాతీయ కార్యదర్శి స్థాయికి చేరారు. ఏ పదవిలో ఉన్నా విలువలతో రాజీపడకుండా పని చేశారు. సురవరం సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నా' అని చ ంద్రబాబు పోస్టు చేశారు.

# సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంలో విఆర్‌ఓలపై అధికారుల వత్తిడి సరికాదు

**విజయవాడ, ఆగస్టు 23, ప్రభాతవార్త:** సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు లక్షలాదిగా విఆర్ఓ లాగిన్‌లోకి సరైన వివరాలు లేకుండానే తండ్రిపేరు లేకుండా, డోర్ నెంబర్ లేకుండా , కేవలం పేర్లు మాత్రమే పంపి వారి వివరాలు సేకరించి ఆధారాలు సేకరించి, సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు జారీ చేయాలని గత ప్రభుత్వం 2024 ముందు చేసిన రీతిలో ప్రస్తుత ప్రభుత్వం కూడా తమపై ఒత్తిడి తేవడం సరికాదని ఏపి విఆర్ఓ అసోషియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు , ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడులు అన్నారు. ఎవరికైనా క్యాస్ట్ సర్టిఫికెట్లుకావాలంటే నేరుగా అప్లై చేసుకుంటే వెంటనే ఇవ్వడం జరుగుతుందని, కానీ విఆర్ఓలకు తప్పుడు సమాచారం పంపి వెంటనే పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి తేవడాన్ని ఆయన ఖండించారు. కొన్ని లక్షల సర్టిఫికెట్లు వెంటనే పూర్తి చేయాలని తగిన ఆధారాలు ఇవ్వకుండా ఒత్తిడి చేయడం సరికాదని దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, పొరబాట్లు దొర్లితే జిల్లా ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పునరాలోచించాలన్నారు.

# అమరావతి నిర్మాణం

>> జాబితా ఇస్తాయన్న చంద్రబాబు అందువల్ల ఓటర్ల జాబితా తయారీపై అనుమానాలు అక్కర్లేదని స్పష్టం చేశారు. ప్రపంచంలో ఏ దేశమైనా, రాష్ట్రమైనా సంక్షేమం లేకుండా మనుగడ సాగించలేవని చెప్పారు. సంస్కరణల కారణంగా దేశంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్లు, టెలి కమ్యూనికేషన్లు, విద్యుత్ ప్రాజెక్టులు, కళాశాలల్లాంటి ఆస్తులు వచ్చాయని చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలో సంపద సృష్టి జరిగి, ప్రభుత్వాలకు రాబడి పెరిగిందన్నారు. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో భాగంగానే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. సంపద సృష్టించే వారికే వీటిని అమలు చేసే హక్కు ఉంటుందని తెలిపారు. కేవలం అప్పులు తెచ్చి సంక్షేమ పథకాలు అమలు చేయలేమని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రానికి సంపద సృష్టించి, ప్రజలను పేదరికంలో ఉంచడం కూడా మేలు చేయదని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

1991లో ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాయని చంద్రబాబు తెలిపారు. 1995లో ముఖ్యమంత్రిగా తాను బాధ్యతలు చేపట్టాక ఎపిలో రెండోతరం సంస్కరణలు ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ప్రతి సంస్కరణా తమ దగ్గర మొదలై ప్రయోజనాలు అందించిందన్నారు. రాష్ట్ర విభజన ఇబ్బందులు, 2019 -2024 మధ్యలో గాడితప్పిన పాలన ఇప్పుడు తమ ముందున్న పెద్ద సవాళ్లని చెప్పారు. దశాబ్దాల క్రితం వ్యాపారవేత్తలు ఇచ్చిన సిఇఒ బిరుదు తనకు నష్టం చేసిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని నడిపించడం తెలియదని తనను నిందించారని చంద్రబాబు వివరించారు. పాతికేళ్ల క్రితమే ఎపిలో ఐటీ విధానాన్ని తీసుకొచ్చామని చంద్రబాబు గుర్తుచేశారు. ఐటీకి భవిష్యత్ లేదని అప్పట్లో ఎన్నో విమర్శలొచ్చినా పట్టు విడవలేదన్నారు. ఫలితంగానే మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌కు వచ్చిందని అక్కడ పనిచేసిన ఉద్యోగే ఆ సంస్థకు సిఇఒ కాగలిగారని చెప్పారు. ప్రభుత్వ విధానాల ఫలితాలను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎలా ఒడిసిపట్టుకుంటారో చెప్పడానికి ఇదో ఉదాహరణ అన్నారు. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా భారతీయులు, అందులోనూ 30 నుంచి 35 శాతం మంది తెలుగువారు ఉంటున్నారని తెలియజేశారు. సర్కార్ విధానాల ద్వారా తాము తెలుగువారికి ఇచ్చిన కంట్రిబ్యూషన్ ఇది అని చంద్రబాబు తెలిపారు.

దేవుడు నాకు సైబరాబాద్, అమరావతి నగరాలు నిర్మించే వరమిచ్చాడు. అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత జీవనయోగ్యమైన నగరంగా అమరావతిని నిర్మిస్తున్నాం. వ్యక్తిగత ఏసీల అవసరం లేకుండా డిస్టింక్ట్ కూలింగ్ వ్యవస్థను ప్రవేశపెడుతున్నాం. సంతోషంగా జీవించాలనుకున్న వారు అమరావతికి వచ్చి స్థిరపడొచ్చు. భవిష్యత్‌లో హైదరాబాద్, అమరావతిల మధ్యే ఉత్తమ నగరాల పోటీ ఉంటుందనిఖి చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

గతేడాది కాలంలో ఎపికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని సిఎం పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మళ్లడం వల్ల పెద్ద కంపెనీలు వస్తున్నాయన్నారు. లక్ష్మీ మిత్తల్ లక్ష కోట్లతో స్టీల్ సిటీ నిర్మించబోతున్నారని చెప్పారు. బిపిసిఎల్ రిఫైనరీ ద్వారా మరో లక్ష కోట్ల పెట్టుబడి వస్తుందని తెలిపారు. టిసిఎస్, గూగుల్ లాంటి దిగ్గజ కంపెనీలు కూడా ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నట్లు తెలిపారు. ఒక్క గ్రీన్ ఎనర్జీలోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నామని చంద్రబాబు అన్నారు.

## వారం - వర్జ్యం

24-08-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
శు.పాడ్యమి ఉ.11.51
పూర్వఫల్గుణి రా.2.07
వర్జ్యం : ఉ.9.50-11.33
దు.సా.4.43-5.53
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** కొత్త పెట్టుబడులకు తగిన లాభం పొందుతారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**వృషభం:** వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు.

**మిథునం:** తనఖాలో ఉన్న వస్తువులను విడిపించుకుంటారు. ఇంటాబయటా ప్రోత్సాహం.

**కర్కాటకం :** శ్రమకు తగిన ప్రతిఫలాలు అందుకుంటారు. ఆర్థికంగా ఎటువంటి ఒడిదుడుకులు ఉండవు.

**సింహం:** కుటుంబ పురోభివృద్ధి బాగుంటుంది. విదేశీయాన వ్యవహారాలు సానుకూలమవుతాయి.

**కన్య :** సంఘంలో పేరుప్రఖ్యాతులు ఇనుమడిస్తాయి. ఆహారపు అలవాట్లలో కొద్దిపాటి మార్పుచేస్తాయి.

**తుల :** అహంభావ ధోరణి విడనాడడం వలన లాభపడతారు. కొనుగోలు వ్యవహారాలలో లాభపడతారు.

**వృశ్చికం:** కీలక నిర్ణయంలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. వస్తు లాభం.

**ధనుస్సు:** బంధువు నుండి వస్తులాభం పొందుతారు. కోర్టు కేసుల నుండి బయటపడతారు.

**మకరం:** దీర్ఘకాలిక ఋణాలు తీరుస్తారు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**కుంభం:** భూముల విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. వాహనయోగం.

**మీనం :** కళారంగాలవారికి సన్మాన, సత్కారాలు పొందుతారు. ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

# ఐకానిక్ భవనం ఇదే

>> సాంకేతికతతో నిర్మించనున్నట్లు తెలిసింది. ప్లాస్టిక్, టైటానియం మెటీరియల్ వినియోగించి 3డీ ప్రింటింగ్‌లో బ్లాక్‌లు రూపొందిస్తారు. భవనం ఎలివేషన్లు డిజైన్ చేసి 3డీ ప్రొజెక్షన్‌లో ఎక్కువ ఆకర్షణ ఉండేలా భవనాన్ని తీర్చిదిద్దనున్నారు. నిర్మాణంలో మామూలు ఇటుకలకు బదులు బయోమాస్ట్ విధానంలో కంప్రెస్డ్ హీటింగ్ ద్వారా తయారైన దృఢమైన ఇటుకలు వాడనున్నారు. కొంత భాగాన్ని సాధారణ విధానంలో నిర్మిస్తారు.

దీంతో నిర్దేశిత వ్యవధిలో నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంటుంది. క్వాంటమ్ వ్యాలీ ప్రకటించిన తర్వాత నుంచి డిజైన్ ఎంపికకు రెండు నెలలు పట్టింది. పదికి పైగా ఆకృతులను పరిశీలించి, అధికారులతో 8 సార్లు సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు డిజైన్‌లో మార్పులు సూచించారు. అత్యుత్తమమైన డిజైన్‌కి రెండు రోజుల క్రితం సిఎం ఆమోదం తెలిపారు. ఇప్పటికే అమరావతి క్వాంటమ్ వ్యాలీలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి, నిర్వహణలో భాగస్వామ్యం వహించనున్నట్లు ఎల్అండ్ టీ పేర్కొన్న విషయం తెలిసిందే. గ్లోబల్ టెక్నాలజీ కన్సల్టింగ్, డిజిటల్ సొల్యూషన్స్ కార్యకలాపాలు నిర్వహించే తమ అనుబంధ సంస్థ ఎల్‌టిఐ మైండ్‌ట్రీ ద్వారా సహకరించనున్నట్లు తెలిపింది సంస్థ అనుభవాన్ని క్వాంటమ్ వ్యాలీ నిర్మాణంలో వినియోగిస్తామని చెప్పింది.

క్వాంటమ్ కంప్యూటింగ్‌కు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా మారుతుందని సంస్థ తెలిపింది. ఎపి ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా అతిపెద్ద క్వాంటమ్ కంప్యూటర్ క్వాంటమ్ సిస్టం 2ను ఐబీఎం సంస్థ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ సర్కార్, ఐబిఎంతో కలిసి ఇందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పింది. ఇందుకోసం అవసరమైన భవనాలు నిర్మిస్తామని చెప్పింది. ఐకానిక్ భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయని వివరించింది. ఈ పార్కులో సాంకేతిక పరిశోధనలకు భాగస్వామ్య సంస్థలతో కలిసి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సిఓఇ) నిర్వహణలో ఎల్‌టిఐ మైండ్‌ట్రీ కీలక పాత్ర పోషిస్తుందని సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో నిర్మించే ఐకానిక్ భవన నిర్మాణానికి సంబంధించి నిర్మాణ సంస్థ పలు నమూనాల్లో 40,000ల చదరపు అడుగుల విస్తీర్ణంతో భవనాన్ని నిర్మించాలని ప్రతిపాదించింది. మొత్తం వ్యాలీలో దశలవారీగా 90 లక్షల చదరపు అడుగుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. క్వాంటమ్ వ్యాలీని వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో శంకుస్థాపన చేసినప్పటి నుంచి భవన నిర్మాణానికి 110 నుంచి 120 రోజులే ఉంటుంది.

# కెసి వీరేంద్ర అరెస్టు

>> బెంగళూరులోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఈ నెల 22, 23 తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఒక పెద్ద ఆపరేషన్‌లో అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ రాకెట్‌ను ఛేదించింది. ఈ కేసు కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా ఎమ్మెల్యే కెసి వీరేంద్ర, అతని సన్నిహితులకు సంబంధించినది.

**12 కోట్లకుపైగా నగదు స్వాధీనం**

గ్యాంగ్‌టక్, చిత్రదుర్గ, బెంగళూరు, హుబ్లి, జోధ్‌పూర్, ముంబై, గోవాసహా 31 ప్రదేశాల్లో ఇడి బృందాలు ఏకకాలంలో దాడులు నిర్వహించాయని ఆ వర్గాలు తెలిపాయి. గోవాలో కూడా పప్పీస్ క్యాసినో గోల్డ్, ఓషన్ రివర్స్ క్యాసినో, పప్పీస్ క్యాసినో ప్రైడ్, ఓషన్ 7 క్యాసినో, బిగ్ డాడీ క్యాసినో అనే ఐదు పెద్ద క్యాసినోల్లో ఇడి సోదాలు నిర్వహించింది. ఈ దాడిలో ఇడి దాదాపు రూ. 12 కోట్ల నగదును స్వాధీన చేసుకుంది. అందులో రూ. కోటి విదేశీ కరెన్సీ ఉంది. అంతేకాదు రూ. 6 కోట్ల విలువైన బంగారం, 10 కిలోల వెండి, నాలుగు లగ్జరీ కార్లు ఉన్నాయి. వీటితోపాటు 17 బ్యాంకు ఖాతాలు, 2 లాకర్లను కూడా స్తంభింపజేసింది.

**బెట్టింగ్ సైట్ల ద్వారా సంపాదించిన డబ్బు..**

ఎమ్మెల్యే వీరేంద్ర కింగ్ 567, రాజా 567 వంటి అనేక ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్లను నడుపుతున్నాడని దర్యాప్తులో తేలింది. అతని సోదరుడు కె.సి.తిప్పస్వామి దుబాయి నుంచి డైమండ్ సాఫ్టెక్, టిఆర్ఎస్ టెక్నాలజీస్, ప్రైమ్ 9 టెక్నాలజీస్ అనే మూడు కంపెనీల ద్వారా ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. మరో సోదరుడు కె.సి.నాగరాజ్, అతని కుమారుడు పృథ్వీరాజ్ ఎన్.రాజ్ కూడా ఈ పనిలో పాలుపంచుకున్నట్లు చెబుతున్నారు.

**గ్యాంగ్‌టక్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్టు**

ఈ దాడుల సమయంలో ఇడి అధికారులు అనేక ముఖ్యమైన పత్రాలు, ఆధారాలను కూడా కనుగొంది. దీని ప్రకారం అక్రమం ఆదాయాన్ని వేర్వేరు విధాలుగా వైట్‌మనీగా చూపించడానికి ప్రయత్నాలు జరుగతున్నాయని స్పష్టమైంది. సమారారం ప్రకారం ఇటీవల వీరేంద్ర తన సహచరులతో కలిసి గ్యాంగ్‌టక్‌కు వెళ్లాడు. అక్కడ వారు ఒక ల్యాండ్ క్యాసినోను లీజుకు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ సమయంలో ఇడి సిబ్బంది అతన్ని గ్యాంగ్‌టక్‌లో అరెస్టు చేసింది. శనివారం స్థానిక కోర్టులో హాజరుపరిచిన తర్వాత.. ఇడి అధికారులు వీరేంద్రను బెంగళూరు కోర్టుకు తీసుకెళ్లడానికి ట్రాన్సిట్ రిమాండ్‌ను పొందింది.

# సౌర విద్యుత్‌కు పెద్దపీట

>> దని విజయానంద్ అన్నారు. ఈ పనులకు సంబంధించి నెలవారీగా సమీక్షలు జరిపి అవసరమైన అనుమతులు పొందేలా చర్యలుతీసుకోవాలని, ఈ ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను సిఎస్ ఆదేశించారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలో 49,533 పంపుసెట్లకు సంబంధించి 220.3 మెగావాట్ల ప్రాజెక్టులకు, ఎపిసిపిడిసిఎల్ పరిధిలో 76,602 పంపుసెట్లకు సంబంధించి 191.5 మెగావాట్ల ప్రాజెక్టులకు, ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో 1,35,346 పంపుసెట్లకు సంబంధించి 610 మెగావాట్ల ప్రాజెక్టులకు, కుప్పం రెస్కో పరిధిలో 32,106 పంపుసెట్లకు సంబంధించి 141 మెగావాట్ల ప్రాజెక్టులకు టెండర్ల ప్రక్రియ పూర్తయి, ఎల్ఓఐలు జారీ చేసినట్లు సిఎండి లు చీఫ్ సెక్రటరీ కి వివరించారు.

# దళితుడిపై తప్పుడు ప్రచారాలు తగదు

## మీడియాతో మాజీ డిప్యూటీ సిఎం నారాయణ స్వామి

**తిరుపతి హెల్త్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** వైఎస్సార్సీ హయాంలో మద్యం అమ్మకాలను నియంత్రించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వమే నిర్వహించిందని, అయితే నాడు లిక్కర్ స్కామ్ పేరుతో తనను ఇబ్బంది పెట్టాలని కూటమి ప్రభుత్వం లక్ష్యం చేసుకుని సిట్ అధికారులు మా ఇంటికి వచ్చి వెళ్లిన తర్వాత ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయించడం బాధాకరమని మాజీ డెప్యూటీ సిఎం నారాయణ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుమార్తె కృపాలక్ష్మితో కలిసి ఆయన మాట్లాడారు. సాధారణంగా మద్యం అమ్మకాలను ప్రభుత్వమే నిర్వహిస్తే స్కాంలు జరుగుతాయా..? ప్రైవేట్ పరం చేస్తే స్కాములు జరుగుతాయా అన్న చిన్న పరిజ్ఞానం కూడా ఈ ప్రభుత్వానికి లేదన్నారు. ఎల్లో మీడియా తన ఇంట్లో రూ.8 కోట్లు దొరికిందని, రికార్డులు స్వాధీనం చేసుకున్నారని వార్తలు రాయడం దారుణమన్నారు. సిట్ అధికారులకు తాను ఎప్పుడూ సమాధానం చెబుతానన్నారు. తప్పుడు ప్రచారాలను ఎల్లో మీడియా ప్రచురించడం మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు.



చిరంజీవి, వెంకటలక్ష్మి (ఫైల్‌ఫొటో)

## అనుమానాస్పదంగా నవ దంపతులు మృతి

**కొత్తవలస (విజయనగరం జిల్లా), ఆగస్టు 23 ప్రభాతవార్త** విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలోని తమ్మన్న మెరక గ్రామంలో శనివారం ఉదయం నవ దంపతుల మృతి కలకలం సృష్టించింది. మండలంలోని జోడిమేరక గ్రామానికి చెందిన జి.వెంకటలక్ష్మి (26) వేపాడ మండలం చిన దుంగాడ గ్రామానికి చెందిన కె.చిరంజీవి (30) ప్రేమించి 8 నెలల క్రితం పెళ్లి చేసుకున్నారు. వెంకట లక్ష్మి కొత్తవలసలోని వెంకటేశ్వర మీటెల్ షాప్‌లో పని చేస్తోంది.

భర్త చిరంజీవి రామవరం వద్ద ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు ఎప్పటి వలె వీరు శుక్రవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు.

ఆ రాత్రి ఏమి జరిగిందో ఏమో గాని ఉదయం భార్య, భర్త ఇద్దరూ విగత జీవులుగా ఇంట్లో పడి ఉన్నారు.

భార్య నేల మీద పడి మృతి చెంది యుండగా భర్త ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వేలాడుతూ మృతి చెందియున్నాడు. కొత్తవలస సిఐ షన్ముఖరావు, ఎస్సై ప్రసాదరావులు సంఘటనా స్థలానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరించారు.

### ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు జగన్ నివాళి

విజయవాడ, ఆగస్టు23, ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని సందర్భంగా .. వైసిపి అధినేత వైఎస్.జగన్ ప్రకాశం పంతులుకు నివాళులు అర్పించారు. " భారతదేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను పణంగా పెట్టి బ్రిటీష్ పాలకులతో పోరాడిన యోధుడు, మన ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు .

తుది శ్వాస వరకు ప్రజల కోసం జీవించిన ఆ మహనీయుడి జయంతి నేడు. ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నాను " అని పోస్టు చేశారు.

## చెత్తే కదాని పారేస్తే విష వలయమే, ప్లాస్టిక్ వినియోగంతో మనుగడకే ముప్పు

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మొక్కను నాటుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్తప్రతినిధి:** ఇష్టానుసారం ప్లాస్టిక్‌ను వినియోగించడంతో పాటు ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే అది తిరిగి తిరిగి మనచుట్టూ విష వలయంగా ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అందుకే ప్రతిఒక్కరూ స్వీయ క్రమశిక్షణతో స్వచ్ఛాంధ్ర సంకల్పంలో భాగస్వాములమవుదామని శనివారం జయంతి గ్రామంలో జిల్లా పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర (ఎస్ఏఎస్ఏ) కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. తొలుత స్థానిక మహాత్మాగాంధీ పార్కులో గ్రామ సర్పంచ్ మారపాక మహాలక్ష్మీ,, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మొక్కలు నాటిన అనంతరం మహిళా, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిశు వికాసంఅంగన్వాడీ కేంద్రాల సేవలు, సీజనల్ వ్యాధులపై అవగాహన, దోమల నియంత్రణ చర్యలు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ద్వారా ఉత్పత్తి చేసిన వర్మీ కంపోస్టు స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒక్కో థీమ్‌తో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఈ నెల సీజనల్ హైజీన్ (వర్షాకాల శుభ్రత) ఇతివృత్తంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వ్యక్తిగత శుభ్రత, ఇంటి శుభ్రత, పరిసరాల శుభ్రతపై ప్రతిఒక్కరూ దృష్టిసారించి సమష్టి భావనతో అడుగులేస్తే ఆరోగ్య ఆంధ్ర, ఆరోగ్య భారత్ సాకారమవుతుందన్నారు. భావితరాలకు ఆరోగ్యకర పర్యావరణాన్ని బహుమతిగా ఇద్దామని పేర్కొన్నారు. చెత్తను సరైన విధంగా వేరుచేసి ఇవ్వడం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ద్వారా ఉత్పత్తి అయ్యే వర్మీ కంపోస్టును వినియోగించడం, డ్రెయిన్లను క్లీన్‌గా ఉంచడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండటం వంటి వాటిలో భాగస్వాములుకావాలన్నారు. వర్షాకాలంలో కలిగే అనారోగ్య సమస్యలు, ఆ సమస్యల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకొని, దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా వంటి విష జ్వరాల బారినపడకుండా మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు

.స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సెల్ఫీ స్టాండ్‌లో కలెక్టర్ ఫొటో దిగారు. తడి చెత్త, పొడి చెత్తను సరైన విధంగా వేరుచేసి ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్న గ్రామానికి చెందిన పది మంది మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి, పూల మొక్కలను బహూకరించారు. అదేవిధంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న సిబ్బందిని, ఆశా కార్యకర్తలను సత్కరించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొదిస్తూ గ్రామంలో చేసిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు.

## యువత ప్రతిభకు గ్లోబల్ వేదిక, ఆంధ్ర యువ సంకల్ప్ 2025

### - మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ, ఆగస్టు, 23.** అంతర్జాతీయ యువ దినోత్సవం పురస్కరించుకొని సందర్భంగా రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో యువత కోసం ఒక అద్భుతమైన వేదిక సిద్ధమైంది. యువత ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేస్తూ యువతను వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా చేసుకొని మన రాష్ట్ర యువతను , కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్ర యువ సంకల్ప్ 2025 పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మీడియాకు తెలిపారు. ఈ సందర్భంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ..మన రాష్ట్ర యువతలోని సృజనాత్మకత, ఆవిష్కరణ, ప్రతిభ ప్రపంచ స్థాయిలో ప్రతిధ్వనించేందుకోసం యువనాయకులు నారా లోకేష్ యూట్యూబ్ అకాడమీతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ఆధారంగా డిజిటల్ మారథాన్‌ను నిర్వ హిస్తున్నామని అని తెలిపారు. ఈ కార్య క్రమంలో పాల్గొనడం చాలా సులభమాని పేర్కొన్నారు. సంబంధిత పోస్టర్లలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి,లేదా లో పేరు నమోదు చేసి, వీడియో లింక్ రూపంలో మీ ప్రతిభను అప్‌లోడ్ చేయాలని చూచించారు. ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 10 వరకు ఈ క్యాంపెయిన్ కొనసాగుతుంది. యువత తమ ప్రతిభను మూడు విభిన్న థీమ్‌లలో ప్రదర్శించవచ్చు. యువత సామాజిక బాధ్యత మరియు కుటుంబ సంబంధాలు మరియు కుటుంబ విలువలు. మైండ్, బాడీ, హెల్త్, పౌష్టిక ఆహారం,(టెక్నాలజీ వినియోగంలో అర్థవంతమైన మార్గాలు). ప్రతి థీమ్ లో టాప్ 3 వీడియోలు ఎంపిక చేయబడతాయి. విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులతో పాటు ప్రతిష్టాత్మక సర్టిఫికేట్ ప్రదానం చేయబడుతుంది. అంతేకాక, ఆంధ్రా అంబాసిడర్ 2025గా ఎంపిక చేయబడతారు,

## జీవితంలో పెరోల్‌కి సిఫార్సు చేయను

### - రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి

నెల్లూరు రూరల్, ఆగస్టు 23, ప్రభాతవార్త నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేయడమేనని, అందుకే ఇకపై ప్రజా సమస్యలపైనే దృష్టి పెట్టబోతానని తెలిపారు. శ్రీకాంత్ పెరోల్ వ్యవహారంలో తాను ఇచ్చిన సిఫార్సు లేఖపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు అప్రజాస్వామికమని ఆయన ధీటుగా స్పందించారు. జూలై 16న అధికారులు నా లేఖనే తిరస్కరించారు. అయినా జూలై 30న పెరోల్ మంజూరు చేశారు. లేఖ ఇవ్వడం తప్పైతే అధికారంలో ఉన్నప్పుడు మీ ఎమ్మెల్యేలు ఇచ్చిన లేఖలతో పెరోల్ ఎలా మంజూరు అయ్యింది? అని ప్రశ్నించారు. ఇకపై ఎవరికి పెరోల్ కేసులో సిఫార్సు లేఖలు ఇవ్వబోనని స్పష్టం చేస్తూ - రాజకీయాల్లో నేనింకా విద్యార్థినే, ప్రతీ అనుభవం నాకు పాఠం నేర్పిస్తుంది అన్నారు. అలాగే గతంలో వైసీపీ ఇంచార్జ్ హయాంలో నెల్లూరు రూరల్లో జరిగిన హత్యలు, ఇసుక-గ్రావెల్ స్మగ్లింగ్ గురించి సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకరిని అయినా వేధించామా? దాడులు చేశామా? కానీ మీరు అధికారంలో ఉండగా మా కుటుంబాన్ని, మా నాయకులను ఎలా వేదించారో గుర్తుంచుకోండి. ప్రతీకారం తీర్చుకోవాలనుకునే వాడిని అయితే చుక్కలు చూపించేవాడిని. అయితే చంద్రబాబు ఆదేశాలతో మేము కట్టుబడి ఉన్నాం. ఆయన గీత దాటితే మేము కూడా మౌనం వహించం, అని హితవు పలికారు. నా వెంట నడిచిన కార్యకర్తల ఆర్థిక ఇబ్బందులు తీర్చడానికి నేను వ్యక్తిగతంగా చేయూతనిచ్చాను.

# తిరుమల సమాచారం

## కోదండరామునికి వేదోక్తంగా సహస్రకలశాభిషేకం



**తిరుపతి,ఆగస్టు23 ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని కోదండరామాలయంలో అమావాస్య సందర్భంగా సహస్రకళశాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం అమావాస్య ఘడియలతో ఉదయం ప్రత్యేక సహస్రకళశాభిషేకం సేవ జరిపించారు. 500 రూపాయలు చెల్లించి పాల్గొన్న గృహస్థభక్తులకు ఉత్తరీయం, ఒక లడ్డూ, ఒక వడ బహుమానంగా అందజేశారు. అనంతరం సాయంత్రం కోదండరామస్వామి ఉత్సవమూర్తి సర్వాలంకారభూషితుడై తనకెంతో ప్రీతిపాత్రమైన హనుమంతవాహనాన్ని అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. రామభక్తుడైన హనుమంత వాహనసేవను భక్తులు తిలకించి గోవింద...రామా...జైశ్రీరామ్ నామస్మరణ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఎఇఒ రవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేశ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీవాణి బ్రేక్ ఆఫ్‌లైన్ కోసం భక్తుల అవస్థలు




**తిరుమల,ఆగస్టు23 ప్రభాతవార్తప్రతినిధి:** రోజువారీగా శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనాలకు ఒక్కో భక్తుడు 10,500 రూపాయలు చెల్లించి అందుకుంటున్న (ప్రోటోకాల్‌తో సమానమైన )దర్శన టిక్కెట్లకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో ఆన్‌లైన్ చేయాలనే ఆలోచనలో టిటిడి పెద్దలు, అధికారులు ఉన్నారు.ఇప్పటికే తిరుమలలో ఆఫ్‌లైన్ విధానంలో ప్రత్యేక కౌంటర్‌లో 800 టిక్కెట్లు, రేణిగుంట విమానాశ్రయంలో 200 టిక్కెట్లు శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లజారీ చేస్తున్నారు. సాధారణరోజుల్లోనే 1,500మంది వరకు భక్తులు ఈ దర్శనానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఇక వారాంతం ,రద్దీ విపరీతంగా పెరిగే సందర్భాల్లో 3వేలమంది వరకు భక్తులు ఇక్కడ బారులుతీరి నిలబడుతున్నారు. సాధారణంగా నిర్ణీసమయం ఉదయం 10గంటలకు జారీచేయాల్సిన ఈ దర్శన టిక్కెట్లను టిటిడి అధికారులు ఇష్టానుసారంగా భక్తుల రద్దీతో సమయం సందర్భం లేకుండా అర్ధరాత్రి 2గంటలకు, వేకువజామున 3,4గంటలకు ఇలా టిక్కెట్లు జారీ చేస్తుండటంతో గందరగోళం పరిస్థితులు ఉన్నాయి.భక్తులు కూడా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇదేగాక ఈ దర్శనాలకు కనీసం గదులు కూడా ఇవ్వకుండా భక్తులు అవస్థలు పడుతున్నారు. ఏరోజుకారోజు శ్రీవాణి దర్శనాలు చేయడంతో భక్తుల నుండి మరింతగా స్పందన కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు కూడా పూర్తిగా ఆన్‌లైన్ చేయడమే మంచిదనే ఆలోచనతో టిటిడి అధికారులు కార్యాచరణ సిద్దంచేసుకొంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 500 టిక్కెట్లు రోజువారీగా మూడునెలల ముందే ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్న విషయం విదితమే.. ఆఫ్‌లైన్‌లో వెయ్యి టిక్కెట్లు ఇస్తున్నా డిమాండ్ పెరగడం, భక్తులకు వసతి కల్పించలేని ఇబ్బందులు ఉండటంతో ఆన్‌లైన్ చేయడంపైనే దృష్టి సారిస్తున్నారు. అయితే రోజురోజుకూ శ్రీవాణి బ్రేక్ దర్శనాలకు డిమాండ్ మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదు. మరీ ఆఫ్‌లైన్‌లోనే టిక్కెట్లు పెంచాలా?ఉన్నవి ఆన్‌లైన్ చేసేస్తారా అనేది త్వరలోనే తేలనుంది. ఈ దర్శన టిక్కెట్లు కలిగిన భక్తులకు సాయంత్రం 4.30గంటలకు ఆలయంలోపల కులశేఖరపడివద్ద మొదటిగడప నుండి శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రశాంతంగా, కళ్లారా మరీ దగ్గరగా దర్శనం చేసుకునే భాగ్యం ఉండటంతో చాలావరకు భక్తులు ఈ దర్శనాలపై ఆధారపడుతున్నారు. మరీ టిటిడి అధికారులు భక్తుల అవసరానికి ఎలా స్పందిస్తారనేది చూడాల్సిందే.

## వారాంతంలో మోస్తరుగా భక్తులు



**తిరుమల,ఆగస్టు23 ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం ఆపై శనివారం రోజు తిరుమలలో భక్తులు మోస్తరుగా ఉన్నారు. గత వారంవరుససెలవులతో కిటకిటలాడిన ఏడుకొండలు శనివారం ఉదయం నుండి భక్తులతో మోస్తరుగా వైకుంఠమ్ కంపార్టు మెంట్లు నిండాయి. ఎలాంటి దర్శన టిక్కెట్లు, టోకెన్లు లేకుండా ఉన్న భక్తులు సర్వ దర్శనం కోసం వైకుంఠమ్ 2 క్యూలైన్ల నుండి ప్రవేశిస్తున్నారు. సాయంత్రానికి ఈ రద్దీ మోస్తరుగా పెరిగింది. సాదారణసర్వదర్శనానికి భక్తులు 10గంటలు నిరీక్షిస్తున్నారు. తిరుమలలో వున్నభక్తులకు వైకుంఠం,నారాయణగిరి ఉద్యానవనాల్లో క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు, టీ,మజ్జిగ ,పాలు ,తాగునీరు శ్రీవారిసేవకులు నిరంతరాయంగా పంపిణీచేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సత్వర దర్శనం అయ్యేలా అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆలయ అధికారులకు సూచనలు చేశారు. సాయంత్రంవరకు 41వేలమంది భక్తులు శ్రీవారిని మహాలఘులో దర్శనం చేసుకున్నారు.

## బసవ ఎక్స్‌ప్రెస్‌కు 24సార్లు యాంత్రిక సమస్యలు

### - ప్రత్యేక ఎస్కార్ట్‌తో మైసూరుకు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 23,ప్రభాతవార్త** రాయలసీమ జిల్లాల మీదుగా మైసూరు-బాగల్‌కోట్-మైసూరు మధ్య తిరిగే బసవ ఎక్స్‌ప్రెస్ యాంత్రిక సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ విజయపుర(బిజాపూర్) నుంచి శుక్రవారం సాయంత్రం రాయలసీమ జిల్లాల మీదుగా మైసూర్‌కు బయలుదేరిన బసవ ఎక్స్‌ప్రెస్‌లో మరోసారి యాంత్రికలోపం ఏర్పడింది. విజయ పుర నుంచి కర్నూలు, ఉమ్మడి అనంతపురం జిల్లాల మీదుగా మైసూరుకు బయలుదేరిన నెంబర్ 17308బసవ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభంలో షోలాపూర్ వరకు నిర్ణీత సమయంలోనే వచ్చింది. సెంట్రల్ రైల్వే, షోలాపూర్ డివిజన్‌లో అకల్కోట్,దుధాని, గంగాపూర్, గుల్బర్గా,షాహ్‌బాద్ అలాగే దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలోని వాడి-ఆదోని సెక్షన్‌లో వాడి-రాయచూరు మధ్య 5సార్లు, రాయచూరు-గుంతకల్లు మధ్య ఒకసారి, గుంతకల్లు-ఖాదర్ పేట్ మధ్య 18సార్లు వెరసి గుంతకల్లు డివిజన్‌లో 24సార్లు బ్రేక్ ప్రెషర్ సమస్యతో మొరాయించింది. మార్గమధ్యలో పలు స్టేషన్‌ల మధ్య బ్రేక్ ప్రెషర్(బిపి) డ్రాపింగ్ సమస్య ఉత్పన్నం కావడంతో ఈ రైలు సగటున 3నుంచి 5గంటల ఆలస్యంతో నడుస్తోన్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. గుంతకల్లుకు తెల్లవారుజామున 1.55గంటలకు రావలసిన బసవ ఎక్స్‌ప్రెస్ బ్రేక్‌ప్రెషర్ డ్రాపింగ్ కారణంగా ముందుగా కదలలేక మొరాయిస్తున్నందున లోకోపైలట్‌లు, రాయచూరు ఎస్ఎస్ఇ అండ్ డబ్ల్యూ, సిబ్బంది గుంతకల్లు వరకు ఎస్కార్ట్‌గా రాగా,నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ హోస్పేట్ సిఅండ్‌డబ్ల్యూ డిపోకు చెందిన ఇద్దరు ఎస్ఎస్ఇలు మరో నలుగురు టెక్నీషియన్‌లు, గుంతకల్లు నుంచి అనంతపురం వరకు, బెంగళూరు సిఅండ్‌డబ్ల్యూ డిపోకు ముగ్గురు సీనియర్ సూపర్‌వైజర్‌లు, మరో 20మంది సిబ్బంది అనంతపురం నుంచి బెంగళూరుకు,మైసూరు సిఅండ్‌డబ్ల్యూ డిపోకు చెందిన సీనియర్ సూపర్‌వైజర్లు,టెక్నీషియన్లు ఎస్కార్ట్ విధులు నిర్వర్తిస్తూ బసవ ఎక్స్‌ప్రెస్‌ను కష్టపడి రైలును మైసూరుకు తీసుకెళ్లారు. ఈ రైలుకు బ్రేక్ ప్రెషర్ డ్రాపింగ్ సమస్య షోలాపూర్-రాయచూరుల మధ్యనే పునరావృతం కావడం గమనార్హం.

## సిఎం చంద్రబాబు చొరవతో కుప్పంలో రాకెట్ తయారీ పరిశ్రమ

### - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పంలో మీడియా సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల, కడ పి.డి.వికాస్ మర్మత్

**కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు చొరవతో కుప్పం ఎయిర్‌పోర్టు ప్రాంతంలో స్పేస్ ఇండ స్ట్రీలో భాగంగా రాకెట్ విడిభాగాలు, తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుందని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర మ్మత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం కుప ్పంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 29,30 తేదీల్లో సిఎం చంద్రబాబు నాయుడు కుప్పంలో పర్యటిస్తారన్నారు. ఈసందర్భంగా మూడు భారీ పరిశ్రమలతో ఒప్పందాలు జరుగుతాయన్నారు. కుప్పం ప్రాంతంలో ఇదివరకే 8 పరిశ్రమలకు సిఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలు జరిగా యని మొత్తం 11 పరిశ్రమల ఏర్పాటుతో 12వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అలాగే కుప్పం ప్రాంతంలో రెండువేల ఎకరాలతో ఇండస్ట్రియల్ కారిడార్‌ను సైతం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈనెల30వతేది సిఎం చంద్రబాబు దంపతులు కుప్పం ప్రజల కలను కృష్ణాజలాలు అంకితం చేసి సాకారం చేయనున్నట్లు తెలిపారు. 2019నాటికే హంద్రీ-నీవా కాలువల పనులు 87శాతం పూర్తయ్యాయన్నారు. ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో పనులు జరగక రైతులు నష్టపోయారన్నారు. కుప్పానికి ఎయిర్‌పోర్టు, పరిశ్రమలు వస్తున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు పి4కార్యక్రమంలో భాగంగా కుప్పంలో 250 కుటుంబాల్ని దత్తత తీసుకున్నారన్నారు. కుప్పానికి కృష్ణాజలాలద్వారా శాశ్వత నీటి పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు. బెంగళూరు, చెన్నై నగరాలకు ధీటుగా కుప్పంలో అభివృద్ధికి సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో వైఎస్ జగన్ కుప్పంలో హంద్రీ-నీవా జలాలంటూ ఎన్నికల స్టంట్ చేశారన్నారు. సిఎం చంద్రబాబు చొరవతో మూడు జిల్లాల్లో నీటి సమస్య తీరుతుందన్నారు. నవంబర్‌లో కుప్పానికి నీరు ఇవ్వాలనుకున్నారని అయితే మూడు నెలలు ముందుగానే ఆగస్టులోనే అందిస్తున్నట్లు తెలిపారు. కుప్పం ప్రాంతంలోని 93పంచాయతీలు 210 గ్రామాల్లో ప్రతి ఇంటినుంచి చెత్తసేకరణకు ఐటిసి సంస్థతో 15 ఏళ్ల పాటు ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు. కుప్పంలో 8వేల ఎస్సీ,ఎస్టీ గృహాలకు త్వరలోనే సోలరైజేషన్ పూర్తి చేస్తున్నట్లు చెప్పారు.మూడు నెలల్లో 30వేల వ్యవసాయ పంప్‌సెట్లకు సోలార్ విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. కుప్పంలో టూరిజ ం అభివృద్ధికి 47కోట్లు మంజూరైనట్లు తెలిపారు. 2024నుంచి మొదలైన అభివృద్ధితో సిఎం చంద్రబాబు కుప్పం చరిత్ర తిరగరాస్తారన్నారు. సమావేశంలో కడ సభ్యులు రాజ్‌కుమార్, సుగుణమ్మ, వెంకటేష్ పాల్గొన్నారు.


## భక్తుల రద్దీ వేళ మూడో అన్నప్రసాదభవనం కోసం వెదుకులాట!



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** "అన్నం పరబ్రహ్మస్వరూపం"గా భావిస్తూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న లక్షలాదిమంది భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా,శుచిగా తిరుమల తిరుపతి దేవస్థానంఅన్నప్రసాదాలు అందిస్తోంది. రోజువారీగా 1.60లక్షలమంది నుండి 2లక్షలమందివరకు భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తుండటం విశేషం. భక్తుల రద్దీ తో ఇప్పుడు తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలోనేగాక పిఎసి 4లో అన్నప్రసాదాలు భక్తులకు వడ్డిస్తున్నారు. ఇప్పటికీ వెంగమాంబ భవనంలో మధ్యాహ్నం వేళ భక్తులు నిరీక్షణ సమయం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా మూడో అన్నప్రసాద భవనం కోసం టిటిడి అధికారులు వెదుకులాట ప్రారంభించారు. ఈ భవనాన్ని భక్తులకు సౌకర్యంగా, రద్దీవుండే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నారు. యాత్రికుల వసతి సముదాయాలు నెలకొన్న ప్రాంతంలో ఏర్పాటుచేస్తే భక్తులకు అందుబాటులో ఉంటుందా అనే ఆలోచన ఉంది. దీనిపై ఇప్పటికే టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులతో సమీక్షించారు. అన్నప్రసాదంలో అదనంగా మసాలవడ అందిస్తుండటం, అన్నప్రసాదాల నాణ్యత వందశాతం మెరుగుపడటంతో ధనవంతులైన భక్తుల నుండి సామాన్యభక్తుల వరకు అన్నప్రసాదాలను దేవుని ప్రసాదంగా భావించి స్వీకరిస్తున్నారు. తిరుమల లో నిరంత రాయంగా ఉదయం 8. 30గంటల నుండి రాత్రి 11గంటల వరకు వెంగ మాంబ అన్నప్రసాద భవ నంలో నాణ్యమైన అన్నంతో బాటు సాంబారు, రసం, మజ్జిగ, చక్కెం పొంగలి,తాళింపు(కర్రీ)ని,మసాలవడ రుచికరంగా వడ్డిస్తున్న విషయం తెలిసిందే. రోజువారీగా తిరుమలకు లక్షమందివరకు భక్తులు చేరుకుంటున్నా 80వేల మంది భక్తులు ఇష్టదైవం వేంకటేశ్వర స్వామిని దర్శించుకుం టున్నారు. అయితే ఒకలక్షనుండి 1.40లక్షలమంది వరకు భక్తులు ప్రతిరోజూ అన్నప్రసాదాలు స్వీకరిస్తు న్నట్లు టిటిడి అధికారుల గణాంకాలు. ఈ నేపథ్యంలో దాతలు కూడా అన్నప్రసాదం ట్రస్ట్‌కు విరివిగా విరాళాలందిస్తున్నారు. ప్రస్తుతం 2వేలకోట్లరూపాయలపైగానే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు నిధులు డిపాజిట్లురూపంలో ఉన్నాయి. దీనిద్వారా వచ్చే వడ్డీతోనే ప్రతిరోజూ తిరుమలలో భక్తులకు నాణ్యమైన రుచికరంగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తుండటం విదితమే. గత ఆరునెలల్లో వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో కూడా వంటసామాగ్రి, పాత్రలు, యంత్రాలను పాతవాటిని తొలగించి కొత్తవి ఏర్పాటుచేయించారు. ఇప్పటికే టిటిడి ఇఒ శ్యామలరావు,

అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రముఖ చెఫ్‌ల సూచనలు తీసుకుని అన్నప్రసాదాలను ఎంతో నాణ్యతగా తయారుచేయించి భక్తులకు అందిస్తున్నారు. తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడు అన్నప్రసాదాలను భక్తివిశ్వాసంతో స్వీకరిసున్నారు. కాగా 17వ శతాబ్దంలోనే నాందిపలికిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో ఇప్పటి అవసరాలకు అనుగుణంగా రోజువారీగా 12 టన్నుల బియ్యం, 8టన్నుల కూరగాయలు వినియోగిస్తున్నారు.

## వినాయకసాగర్‌ను అభివృద్ధి చేయండి : కాంగ్రెస్‌నేతల విజ్ఞప్తి



**తిరుపతి,ఆగస్టు23 ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మికనగరంలో వినాయక సాగర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి మరచిపోయారని, నగరప్రజల ఆహ్లాదంకోసం, పిల్లల ఆటవిడుపుకు ఉద్యానవనం, ఆట వస్తువులు, బొమ్మలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటిని బాగుచేయాలని తిరుపతి నగరకాంగ్రెస్ నాయకులు కోరారు. వినాయకచవితి పండుగ ఘడియలు రెండురోజుల్లో ఉండటంతో వినాయకసాగర్‌లో పూడికతీత తీయాలని, లేకుంటే విగ్రహాల నిమజ్జనం ఇబ్బందిగా మారుతుందని, వెంటనే పనులు చేసి తీర్చిదిద్దాలని కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, కంభంపాటి మురళీకృష్ణ, కళంధర్, ఐరాల లోకేశ్, తలారి గోపీచంద్, కల్యాణ్, చిరంజీవి డిమాండ్ చేశారు., ఈ మేరకు శనివారం తిరుపతి నగరపాలకసంస్థ అదనపుకమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగరఅధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు మాట్లాడుతూ వినాయకసాగర్‌లో సమస్యలు తిష్టవేశాయని, వినాయకచవితికి మాత్రమే సాగర్‌ను అధికారులు సందర్శిస్తారని, మిగిలిన రోజుల్లో దీని బాగోగులు చూడటంలేదని విమర్శించారు. వినాయకనిమజ్జనాలకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. విగ్రహాల నిమజ్జనం కోసం పూడికతీత పనులు చేపట్టాలన్నారు. సాగర్ అపరిశుభ్రంతో దుర్వాసన వస్తోందని, ప్రజలు అక్కడ నిలబడలేకపోతున్నారన్నారు. చెరువును శుభ్రం చేయాలని, వ్యర్థాలను తొలగించాలని కోరారు.

## వ్యర్థాల పునర్వినియోగంతో పర్యావరణానికి మేలు

### కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య

**విజయవాడ, ఆగస్టు23, ప్రభాత వార్తప్రతినిధి:** రాష్ట్రంలోని వివిధ పరిశ్రమలు, వ్యవసాయ, ఉద్యాన, పాడి, మత్స్య పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను విలువైన ఉత్పత్తులుగా మార్చవచ్చని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు ఆ దిశగా అడుగులేస్తే పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.విజయవాడలోని పీసీబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. వ్యర్థాలను వినియోగించుకుని ఉపాధి పెంచుకుంటూ, ఆర్థికంగా ఎదిగేందుకు మంచి అవకాశాలెలా కల్పించాలి..? అన్న అంశాలపై చర్చించారు. ఈ వర్క్‌షాపనకు వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, పీసీబీ సభ్యకార్యదర్శి శరవణన్, ఇతర శాఖల ఉన్నతాధికారులు, పలు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు హాజరయ్యారు. వ్యవసాయం, ఆక్వా, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ తదితర రంగాల్లో ఏ మేరకు వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి? వాటిని ఎలా నిర్వహిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయో ఆ శాఖల అధికారులు వివరించారు. పీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రాజశేఖర్, ఇతర నిపుణులు తమ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను చర్చించారు. పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గ సమావేశంలో ఆమోదించిన రీసైక్లింగ్ పాలసీ ద్వారా పర్యావరణ అనుకూల పరిశ్రమలు రాష్ట్రానికి ఎక్కువగా వస్తాయి.

# ఉచిత బస్సుతో మహిళల సందడి

స్త్రీశక్తి కేవలం జిల్లాల స్థాయిలోనే పథకాన్ని అమలు చేయాలనే ప్రతిపాదనలు వచ్చినా సీఎం చంద్రబాబు మాత్రం రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే వెలుసులుబాటు ఇవ్వాలని ఆదేశించారు. పేద, మధ్య తరగతి, సామాన్య మహిళకు దూర ప్రయాణా ఖర్చులు తగ్గించాలనే ఉద్దేశంతో ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ అమలుకు పచ్చజెండా ఊపారు. పంద్రాగాస్టున ఉండవల్లిలో స్త్రీ శక్తిని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌తో కలిసి ప్రారంభించారు. అక్కడ నుంచి మెట్రో సర్వీసు బస్సులో మహిళలతో కలిసి ప్రయాణిస్తూ వారు విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు



చేరుకున్నారు. ఇక్కడ స్త్రీ శక్తి పథకానికి నిర్దేశించిన బస్సులను ప్రారంభించారు. తొలి రోజున అనుహ్యం మహిళా ప్రయాణికులు ఈ బస్సులో ప్రయాణించారు. మొదటి అయిదు రోజులో 45 లక్షలకు పైగా మహిళలు ఈ బస్సులో ప్రయాణించారు. అదే ఒరవటి ఇప్పటికి కొనసాగుతుంది., భారీగానే మహిళలు ఈ సర్వీస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ప్రారంభ దశలో కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ మొత్తం మీద బస్సులలో ఉచిత ప్రయాణం పట్ల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**విజయకుమార్ ఘంటా**

ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో స్త్రీశక్తి పథకం పేరుతో ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళల కోసం అందుబాటులోకి తీసుకుని వచ్చింది. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే క్రమంలో ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాన్ని అమలులోకి తీసుకుని వచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్త్రీ శక్తి పథకానికి అపూర్వ స్పందన లభిస్తోంది. నిత్యం లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. 'స్త్రీశక్తి' ఉచిత బస్సు పరిధిలో వినియోగపరిధిలో అయిదు కేటగిరిల బస్సులలో మహిళలను ప్రయాణానికి అనుమతిస్తున్నారు. ఈ సర్వీసులు సాధారణంగా ప్రయాణికులు ఆసక్తి చూపేవి కావడం మహిళల నుంచి ఆదరణ లభిస్తోంది, దీంతో అన్ని ఏసీ, ఇతర కేటగిరిలు అందుబాటులో లేకున్నా మహిళలు ఈ విషయంలోసర్దుబాటు చేసుకుంటున్నారు. ఉచిత మహిళా బస్సులు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణాల్లో ఉన్నాయి. నూతనంగా అందుబాటులోకి వచ్చిన బస్సు సర్వీసుల్లో మహిళలు సీట్ల కోసం ఆరంభంలో తోపులాటలు, జగడాలకు దిగినట్లు సమాచారం ఉంది. అయితే అక్కడ ఈ పరిస్థితులు ఇప్పుడులేవు, ముందస్తు అవగాన కల్పించడం, స్త్రీ శక్తి పరిధిలో ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తీసుకుని రావడంతో ఏపీలో అక్కడక్కడ తప్పించి మహిళలకు ఇబ్బంది కలుగలేదు. కేవలం 10రోజుల వ్యవధిలో ఏపీలో 75 లక్షల వరకు మహిళలు ఈ బస్సు సర్వీసులను వినియోగించుకుంటున్నారు. ఈ పథకం వలన ఆర్టీసీకి లాభాలు పెరుగుతాయనేది నిపుణుల అంచనా. ప్రభుత్వం ఈ పథకం పరిధిలో ఏటా ఆర్థికంగా రెండు వేల కోట్ల రూపాయల వరకు వ్యయం అవుతుందని ప్రకటించింది. అయితే ఈ బస్సులో జీరో ఫెయిర్ టిక్కెట్టులపై స్త్రీలను అనుమతించడంతో అనుహ్యంగా ఈ మొత్తాలను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంది. దీని వలనే ఆర్టీసీకి లాభాలు పెరుగుతాయి. ఇది ఆర్టీసీ అభివృద్ధికి సహకరించడంతో పాటు ఇంధన ఖర్చు తగ్గింపులో భాగంగా రమారమీ రెండు వేల ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తీసుకుని వచ్చే అవకాశం ఉందని ఆ సంస్థ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పల్లెవెలుగు సర్వీసులకు కూడా ఏసీ బస్సులనే ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ రాష్ట్రంలో కొత్తగా మరో 1,150 ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేస్తున్నామని సంస్థ ఎండి ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. ఆయా డిపోలో ఎలక్ట్రికల్ బస్సులను సమర్ధవంతంగా నిర్వహించేందుకు కావాల్సిన మౌలిక వసతుల్ని కూడా సిద్ధం చేస్తునట్లు తెలి



పారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి భద్రాచలానికి అంతరాష్ట్ర సర్వీసులుగా నడుస్తున్న మరో తొమ్మిదింటికి స్త్రీ శక్తి పథకం వర్తించేలా ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. రాజమహేంద్రవరం, గోకవరం డిపోల నుంచి మారేడుమిల్లి మీదుగా భద్రాచలం నడిచే ఏడు సర్వీసులను ఎటపాక వరకుపొడిగించారు. రాజమహేంద్రవరం డిపో నుంచి కుక్కునూరు మీదుగా భద్రాచలం వెళ్లే మరో తొమ్మిది ఎక్స్‌ప్రెస్ బస్సులకు ఈ పథకం అమలు చేయనున్నారు. దీంతో ఇక్కడ నుంచి అటు భద్రాచలంతోపాటు ముంపు మండలాలకు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే మహిళా ప్రయాణికులకు ప్రయోజనం చేకూరింది. ప్రస్తుతం భద్రాచలానికి రాజమహేంద్రవరం డిపో నుంచి ప్రతి రోజూ పది,గోకవరం డిపో నుంచి ఆరు చొప్పున సర్వీసులు నడుపుతున్నారు.వీటి అన్నింటికీ స్త్రీశక్తి వర్తిస్తుంది. ఈ పథకం కోసం దాదాపుగా 1942 కోట్ల భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడనుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుంది. స్త్రీ శక్తి పథకాన్ని వినియోగించుకోవాలంటే ప్రయాణికులు రాష్ట్రవాసులై ఉండాలి. ఓటర్ ఐడీ, ఆధార్, రేషన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి గుర్తింపు కార్డులను కండక్టర్లకు చూపి బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం ఉంది. నాన్‌స్టాప్‌లు, సూపర్ లగ్జరీలు, ఏసీ బస్సులు, ఘాట్ రూట్లలో తిరిగే సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు. రాష్ట్రంలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్,మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చు. ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంది. ఆధార్, ఓటరు, రేషన్ కార్డు చూపించి బస్సులో ప్రయాణించొచ్చు. స్త్రీ శక్తి పథకం ద్వారా 2.62 కోట్లమంది మహిళలు లబ్ధి పొందనుండగా, పథకం అమలు వల్ల ప్రభుత్వంపై ఏటా 1,942 కోట్ల భారంపడనుంది. ఉచిత బస్సు ప్రయాణాన్ని ట్రాన్స్ జెండర్లకూ వర్తింపు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ పరిధిలో మొత్తంగా 11,449 బస్సులుంటే అందులో 74 శాతం అంటే 8,458 బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ పథకాన్ని ట్రాన్స్ జెండర్లకు కూడా వర్తింపజేస్తున్నారు. ప్రభుత్వ అంచనా ప్రకారం మహిళలు వివిధ బస్సుల్లో వారానికి 4సార్లు సరాసరిన ప్రయాణిస్తారు. రోజూ కార్యాలయాలకు వెళ్లొచ్చే మహిళా ఉద్యోగులకైతే నెలకు ఒక్కో మహిళకు బస్సుల్లో ప్రయాణానికి దాదాపు వెయ్యి నుంచి 3వేల వరకు ఖర్చవుతుంది. సరాసరిన ఒక్కో కుటుంబానికి 4వేలవరకూ రవాణా ఖర్చులుంటాయి. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయి.

ప్రభుత్వ అంచనా ప్రకారం మహిళలు వివిధ బస్సుల్లో వారానికి నాలుగు సార్లు సరాసరి ప్రయాణిస్తారు. ఇక ఉద్యోగాలు చేసే మహిళలైతే రోజువారీ ప్రయాణిస్తారు. దీని నిమిత్తం నెలకు ఒక్కో మహిళకు సుమారుగా రూ.1000 నుంచి రూ.3000 వరకు ఖర్చు అవుతుంది. ముందుగా కేవలం సిటీ, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో మాత్రమే స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేయాలనే ప్రతిపాదనలు వచ్చినా.. బస్సులో ప్రయాణించే ప్రతి పేద, మధ్య తరగతి, సామాన్య మహిళకు ప్రయాణ ఖర్చు తగ్గించాలి, దూర ప్రయాణాలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకంకోసం సుమారుగా రూ. 1942 కోట్ల భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడనుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసికి చెల్లిస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఈ మొత్తం భరించడం కష్టమే అయినామహిళలకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కల్గించేలా ఉంటుందని ప్రభుత్వం ఈ పథకం అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిద్వారా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన హామీని నెరవేర్చినట్టు అయింది. ప్రయాణికులు రాష్ట్ర వాసులు అయ్యుండాలి. ఓటర్ ఐడీ, ఆధార్, రేషన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ సహా ఇలాంటివి కండక్టర్లకు చూపించి ఉచిత ప్రయాణం చెయ్యవచ్చు. నాన్‌స్టాప్‌లు,సూపర్ లగ్జరీలు, ఏసీ బస్సులు, ఘాట్ రూట్లలో తిరిగే సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు. బస్సుల్లో ప్రయాణించే మహిళలకు జీరో ఫేర్ టిక్కెట్లు ఇవ్వడానికి అవసరమైన సాఫ్ట్ వేర్ కూడా సిద్ధం చేసింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటు మహిళలకు ప్రభుత్వం కల్పించింది. ఉచిత బస్సు ప్రయాణాన్ని రాష్ట్రంలోని సుమారు 2.62 కోట్ల మంది మహిళలు వినియోగించుకోవచ్చు. తిరుపతి, అన్నవరం, శ్రీశైలం, సింహాచలం, ద్వారకాతిరుమల, శ్రీకాళహస్తి. విజయవాడ కనకదుర్గమ్మ వంటి ప్రధాన ఆలయాలకు వెళ్లాలనుకున్నా బస్‌ఛార్జీల భారం కారణంగా వెళ్లలేనివారే అధికం. ఇకపై ఇటువంటి కుటుంబాల్లో మహిళలకు బస్ ఛార్జీల భారం లేకపోవడంతో తక్కువ ఖర్చుతో ఆలయాలకు వెళ్లి వచ్చేందుకు అవకాశం కలగనుంది. •

# కొత్త 'సింగ' మేనా!

తమిళనాడు

కొత్త నీరు వస్తే పాత నీరు పక్కకు పోవడం సహజం. అయితే కొత్త, పాత నీళ్ల కలగలిసి పారుతూంటాయి. అదీ సహజమే. కొంత కాలం తర్వాత కొత్త నీరు కూడా పాతదవుతుంది. రాజకీయాల్లో కనిపించే దృశ్యాలు కూడా అటువంటివే. ప్రముఖ తమిళ నటుడు విజయ్ కొత్త పార్టీని స్థాపించిన తర్వాత రెండో భారీ సమావేశం గత గురువారం ( 21, ఆగస్టు ) మదురై సమీపంలో నిర్వహించారు. తమిళ చలనచిత్ర రంగంలో దూసుకుపోతున్న 'స్టార్'గా విజయ్‌కి ఒక ప్రత్యేక స్థానమే ఉంది. చాలా విజయవంతమైన చిత్రాలే ఆయన ఖాతాలో ఉన్నాయి. 'సూపర్ స్టార్' గా పేరున్న రజనీకాంత్‌కు గట్టి పోటీని ఇచ్చే యువ నటునిగా విజయ్ ఎదుగుతున్నాడనే పేరు కూడా వచ్చింది. రజనీకాంత్ కూడా గతంలో రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం జరిగింది. జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఆమెకు పోటీగారజనీకాంత్ రంగప్రవేశం చేస్తారనే కథనాలు అప్పట్లో వెల్లువెత్తాయి. కానీ ఎందుకో ఆయన ముందుకు దూకలేకపోయారు. అది వేరే విషయం. ఆ తర్వాత మరో ప్రముఖ నటుడు కమల్ హాసన్ మరో కొత్త పార్టీతో ముందుకు దూకారు కానీ రాజకీయాలలో తగిన ప్రభావం చూపలేకపోయారు. ఆ తర్వాత డిఎంకె పంచన చేరి రాజ్యసభలోకి అడుగు పెట్టగలిగారు.కమల్‌కు ముందు, తర్వాత తమిళ రాజకీయాల్లో రాణించిన 'అగ్ర తారలు' చాలామందేఉన్నారు. జాగ్రత్తగా పరిశీలిస్తే తమిళరాజకీయాల్లో'రాజ్యం' చేసిన వారంతా ఏదోవిధంగా చలన చిత్రరంగంతో సంబంధం ఉన్నవారే అనిపిస్తుంది. నాటి అన్నాదురై నుంచి నేటి విజయ్ దాకా సినిమా రంగంలో రాణించి రాజకీయరంగంలో నిలదొక్కుకున్నవారే. వారిలో ముఖ్యమంత్రులైన వారు కూడా చాలామందే ఉన్నారు. డిఎంకె వ్యవస్థాపకుడైన అన్నాదురై,తర్వాత కరుణానిధి, ఎమ్జీఆర్, జయలలిత, ముఖ్యమంత్రి పీఠాన్ని కూడా అధిష్టించారు. శివాజీ గణేశన్, విజయ్ కాంత్ వంటి అగ్రనటులు రాజకీయా ల్లోకి వచ్చి ప్రయత్నించారుకానీ ముఖ్యమంత్రి పీఠం అందుకోలేకపోయారు. అయినా వారిద్దరు కూడా తమిళ రాజకీయాల్లో విశేషమైన ప్రభావాన్నే

**ఎ.వి.వి ప్రసాద్**

చూపారు. ఇక ఎంపీలు, ఎమ్మెల్యేలు అయిన సినీ నటులు పెద్దసంఖ్యలోనే కనిపిస్తారు.తమిళ రంగంలో సినీనటులు రాజకీయాల్లో రాణించడంతో ఆప్రభావం తర్వాత దక్షిణాదిలో తెలుగు, కన్నడ, మలయాళ రంగాలపై కూడా బాగానే పడింది. అయితే తమిళ రాజకీయాల్లో కరుణానిధి, ఎమ్జీఆర్, జయలలిత బలమైన ముద్ర వేశారు. రజనీకాంత్ రాజకీయ ప్రవేశం చేసి ఉంటే మళ్లీ అంతటి బలమైన ముద్రవేయగలరనీ, సిఎం అవుతారనీ గతంలో రాజకీయవిశ్లేషకులు భావించారు కానీ ఆయన మనసు మార్చుకొని దూరంగా ఉండిపోయారు. కొన్ని సందర్భాల్లోడిఎంకె, అన్నాడిఎంకెలకు మద్దతు ఇవ్వడం వరకే ఆయన 'రాజకీయం'ఆగిపోయింది. కమల్ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన అగ్ర నటునిగా విజయ్‌పార్టీని స్థాపించినప్పటి నుంచి ప్రభావంచూపుతున్నారనే చెప్పాలి. 'తమిళగ వెట్రి కజగం ( టివికె) అనే పార్టీని గతసంవత్సరం స్థాపించినప్పుడు' కమల్ కంటె గొప్పవాడా అనే వ్యాఖ్యలు వినిపించాయి. కానీ గత గురువారం నిర్వహించిన రెండో మహాసభ తర్వాత తమిళనాట నిజంగానే 'కొత్త గాలి' వీస్తోందనే మాటలు వినిపిస్తున్నాయి. ఆ సభకు లక్షల్లో అభిమానులు తరలివచ్చినట్లు వార్తలు వచ్చాయి.ఆ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒకరుమరణించినట్లు సమాచారం. అంటే పోలీసులు అదుపుచేయలేనంతగా అభిమానుల వెల్లువ ముంచెత్తింది. ఆ ఉత్సాహంతో విజయ్ కీలకమైన ప్రకటనలే కొన్నిచేశారు. తమ సైద్ధాం తిక శత్రువు బిజెపి, ఏకైక రాజకీయ శత్రువు డిఎంకె అని ప్రకటించారు. వచ్చే సంవత్సరం జరిగే ఎన్నికల్లో తమకు అధికారం



విజయ్

ఖాయమనే ఆశాభావం వ్యక్తం చేశారు. డిఎంకె, బిజెపిని తరిమికొట్టడమే తమ లక్ష్యమన్నారు. తనను ఆయన ' సింగం'తో పోల్చుకున్నారు. 'సింహానికి గుంపులో ఎలా జీవించాలో తెలుసు. ఒంటరిగా ఎలా జీవించాలో కూడా తెలుసు. సింహం వేటాడేందుకే వస్తుంది, వినోదం కోసం కాదు. అది ఎప్పుడూ బతికున్న జంతువునే వేటాడి ఆహారంగా తీసుకుంటుంది. అలాగే నేనూ రాజకీయాల్లోతాడో పేడో తేల్చుకొనేందుకే వచ్చా'నంటూ ప్రకటించారు. ఆయన ఈ మాటలంటుంటే అభిమాన గణం ఉత్సాహంతో చిందులు తొక్కింది. ఆ సభను, జనం ఉర్రూతలను గమనించిన వారికి 'కాబోయే సీఎం విజయ్' అనే అభిప్రాయమే కలిగింది. అయితే ద్రవిడ రాజకీయాలతో పెనవేసుకుపోయిన తమిళనాట విజయ్ ' సింహనాదం' ఎటు వంటి ప్రభావం చూపుతుందనేది వేచి చూడవలసి ఉంది. డిఎంకెను ఢీ కొట్ట గలిగింది గతంలో అన్నాడిఎంకె మాత్రమే. కానీ జయలలిత అనంతరం ఆపార్టీ బాగా బలహీనపడింది.ఆ కారణంగానే డిఎంకె మళ్లీ జూలు దులిపింది.ప్రస్తుతానికి డిఎంకె పరిస్థితి చాలా 'స్ట్రాంగ్' గానే ఉన్నదని పరిశీలకుల అభిప్రాయం. ఇప్పుడు విజయ్ అనే కొత్త 'సింగం' కూడా జూలు విదుల్చుతోంది. బిజెపి, కాంగ్రెస్, అన్నా డిఎంకెలో స్టాలిన్‌కు సరిపోయే ప్రత్యర్థులు లేరనే మాట వాస్తవమే అయినా విజయ్ పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి రావడంతో వచ్చే ఎన్నికలు రసవత్తరంగా ఉంటాయనడంలో సందేహం లేదు. కొన్ని దశాబ్దాలుగా ప్రజలతో మమేకమైన పార్టీ డిఎంకె కాగా,కొత్తగా ఆవిర్భవించిన పార్టీ టివికె. ఈ కొత్తపార్టీప్రజల్లో బలమైన ప్రభావం చూపాలంటే నాయకుడైన విజయ్ కదలికలను బట్టే అంచనా వేయవలసి ఉంటుంది.ఎవరితోనూ పొత్తు ఉండదనీ,సింహం సింగిల్ గానే పోరాడుతుందనీ విజయ్ అంటున్నారు. ఆ ధైర్యం, ఆ సాహసం వల్లే ఆయన బరిలోకి దిగుతున్నా రనిపిస్తుంది. ముందు ముందు ఆయన ధోరణి ఎలా ఉంటుందో, ఎటు వంటి వ్యూహాలు అనుసరిస్తారో చూడాలి. •

# ట్రంపరితనం !

అమెరికా

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలిచిన రోజున భారతీయులు ఎంత సంతోషించారో, ఈనాడు ఆయన భారతదేశం మీద విషం కక్కడం చూస్తే అంతగా వాపోతున్నారు. వివిధ ప్రపంచ దేశాలతో అనుసరిస్తున్న తీరు సుంకాల విధింపు పేరిట ఆయా దేశాలను భయభ్రాంతులను చేయడం చూస్తే, ఆయన లక్ష్యమేమిటో అర్థం కాదు. ఆయన గెలువగానే 'అమెరికాయే ఫస్ట్' అనే లక్ష్యంతో సాగుతున్నారనే ఉద్దేశ్యంతో బాగా మెచ్చుకున్న వారు కూడా ఇప్పుడు పునరాలోచించుకుంటున్నారు. ఏమయితేనేం ట్రంప్ మాట్లాడిన మాటలకు అర్థాలే వేరనే పరిస్థితి ఎదురయ్యింది. తాజాగా తాను ఏడు యుద్ధాలను ఆపగలిగినా రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం విషయం తనకు కొరుకుడు పడటం లేదని ఒప్పుకొన్నారు. ఇలా ఎందుకు జరిగిందో సమీక్ష చేసుకోవడంలో ఆయన విఫలమవుతున్నందున ఇలాంటి వ్యాఖ్యానాలు వెగటు వ్యాఖ్యలు చేస్తున్నారు. పుతిన్ జెలెన్‌స్కీల మధ్య వ్యవహారం తనకందుబాటులో లేనందున ఆయనకు కోపం రావడం సహజం. అందుకే తన వద్ద ఉన్న వ్యవహారం చర్చల పరిశీలనలో ఉండగానే ఆ రెండు దేశాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారంటూ, ఇతర వ్యక్తులను అనరాని మాటలంటున్నారు. పుతిన్, జెలెన్‌స్కీలను ఏకంగా 'స్టుపిడ్ ఫెల్లోస్' అనేశారు. సాటి దేశాధినేతలను ఈ రకంగా వ్యాఖ్యానించడం ఏ సంప్రదాయం కిందవస్తుందో ఎవరికీ తెలియదు. ఇప్పటికే ట్రంప్ వాణిజ్య విధానాలు, సుంకాల పేరిట బెదరింపులను చేస్తున్న వ్యవహారాన్ని ట్రంప్ మాజీ సలహాదారుడు జాన్ బోల్టన్ ఇటీవల దుయ్యబడుతూ చేసిన వ్యాఖ్యల పర్యవసానంగా ఇప్పుడాయనపై ఎఫ్‌బిఐ దాడులు చేసింది. బోల్టన్ విమర్శల్లో తప్పేముంది అనే వారే ఎక్కువ. వైట్‌హౌజ్ ప్రధాన సలహాదారుగా పని చేసిన బోల్టన్‌కు ట్రంప్ సన్నిహితునిగా పేరుందేది.ట్రంప్ గురించి మాట్లాడుతూ 'దారి తప్పిన అధ్యక్షుడు' అని వ్యాఖ్యానించడమే బోల్టన్ చేసిన తప్పిదంలా ఉంది. భారత్‌పై అదే పనిగా సుంకాలు వేయడం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందున అని చెప్పారు. తీరా పుతిన్ తనతో సమావేశమయ్యే సరికి తూచ్ భారత్

**గన్ని మోహన్**

మీద అదనపు సుంకాల గురించి ఆలోచించే పనిలో పడ్డారు. జెలెన్‌స్కీ సమావేశానికి పుతిన్ షరతులు విధించడంతో తన మాట కాదన్న పుతిన్ పేరిట భారత్‌కు మళ్లీ సుంకాలు వడ్డిస్తానని ట్రంప్ చెప్పడం ప్రపంచ ప్రజలందరికీ తెలిసిపోయిన వ్యవహారం.భారత్‌పై సుంకాలు విధించడానికి, బెదరించడానికి ఏమాత్రం బెసగని ట్రంప్ చైనా జోలికి వెళ్లకపోవడంపై కూడా విమర్శలకు గురవుతున్నారు. మరో వాణిజ్య సలహాదారు పీటర్ నవారో రష్యాను 'బట్టలు ఉతికి పెట్టే వాషింగ్ మెషిన్'గా వ్యాఖ్యానించారు. ఇవన్నీ భారత్‌కు అమెరికాకు మధ్య సంబంధాలు బెడిసికొట్టేవే. అవి దీర్ఘకాలానికైనా, స్వల్పకాలానికైనా ఇరుదేశాల మధ్య అవినాభావ సంబంధాలకు మంగళం పాడినట్లే కాగలవు. ఇప్పుడు రష్యాతోభారత్ సంబంధాలు భారత్‌తో అమెరికా సంబంధాలు, అమెరికాతో చైనా సంబంధాలు... వీటన్నిటి గురించి ఎన్ని చెప్పుకున్నా చివరాఖరికి అమెరికా సుంకాల బెదరింపుల ప్రస్తావన వరకే చేరతాయి. అన్ని దేశాలు తమ శత్రుదేశాల కన్నా అమెరికాకే ఎక్కువ భయపడుతున్నాయి. కలవరపడుతున్నాయి. ట్రంప్ ఈ మధ్యనే పుతిన్‌తోనూ, మరో సందర్భంలో జెలెన్‌స్కీతో సమావేశమయ్యాక మరోసారి కలయిక అంటూ జరిగితే త్రైపాక్షిక సమావేశం ద్వారా యుద్ధానికి ముగింపు పలకవచ్చుననే సంకేతాలు బయటపడ్డాయి. కానీ ఆ తర్వాత వారి త్రైపాక్షిక సమావేశానికి తేదీ, వివరాలు, చర్చించదగిన అంశాలు కనపడటంలేదు, వినపడడం లేదు. అసలు రష్యాతో కయ్యానికి దిగడంలో ఉక్రెయిన్‌కు గతంలో యూరప్ దేశాలే సహకరించాయనే అపప్రథ



డొనాల్డ్ ట్రంప్

ఉంది. దాన్ని రూపుమాపుకోవడం జరిగే పని కాదు. ఉక్రెయిన్‌కు 'నాటో' లో చేరకుండా కట్టడి చేయాలని రష్యా కోరడం ఒకటైతే, రష్యా ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాలను మళ్లీ తమకివ్వాలని జెలెన్‌స్కీ పట్టు. ఎవరు ముందు తగ్గినా మరోకరు వెనువెంటనే తగ్గుతారన్నగ్యారంటీ ఏమీలేదు. అందుకే తాజాగా ద్వైపాక్షికమో! త్రైపాక్షికమో? ఎటూ తేలడం లేదు. అలా రష్యా మౌనంపై కూడా భారత్‌ను నిందించే స్థాయికి ట్రంప్ దిగిపోయాడు. తాజాగా రష్యా దారికి రాకుంటే భారత్ మీద మరికొంత సుంకాలు విధిస్తామంటూట్రంప్ నోరుజారారు. అదేదో నోరుజారడం కాదు బెదరింపే! ఇలా భారత్ వంటి ఆప్తమిత్ర దేశాలను ట్రంప్ దూరం చేసుకుంటున్నాడన్న ఆవేదన అమెరికా దౌత్యవేత్త జాన్‌కెర్రీ వంటి వారు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ ట్రంప్ తీరు మారెదెన్నడో! మారేదెప్పుడో! పుతిన్, తాను ట్రంప్‌ల మధ్య జరిగే త్రైపాక్షిక చర్చలతో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆగిపోతుందనుకున్న జెలెన్‌స్కీ గొంతులో వెలక్కాయపడింది. భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే విషయమై తానూ ఉన్నానంటూ పదేపదే చొరబడుతున్న ట్రంప్‌కు ఎక్కడా దారిదొరకడం లేదు. పాక్‌తో ద్వైపాక్షిక చర్చల్లో మూడో దేశం జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఇదే విషయంలో ఢిల్లీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్ 2025 సదస్సులో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ట్రంప్ మధ్యవర్తిత్వంపై కానీ ఏ ఇతర దేశం మధ్యవర్తిత్వంపై కానీ గత యాభై ఏళ్లుగా భారత్ ఏకాభిప్రాయాన్నే కలిగి ఉందని వివరించారు. కొన్ని వివాదాల్లో ట్రంప్ కలుగచేసుకోవాలని చూసినా ఆయన జోక్యాన్ని ఎవరూ నమ్మడం లేదు. భారత్ అయితే అసలు వద్దనే అనుకుంటోంది. 'యుద్ధ విరమణ' అంశాల్లో విజయం సాధించి నోబెల్ శాంతి బహుమతి అందుకోవాలన్న ట్రంప్ ఆకాంక్షలకు ఆయన ట్రంపరితనమే అడ్డుపడ్తోంది. •

# బతుకునిచ్చే ప్రభుత్వాలు కావాలి!

ఒక ప్రక్కన 'బగ్గతాగు ఊగు సావు' అన్నట్టుగా ఉంది పాలకుల విధానాలు చూస్తే మద్యం రూపంలో ఆదాయం. తెలంగాణ రాష్ట్రంలో 2023 అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయింది. ప్రజల అభిలాషలకు అనుగుణంగా పాలన సాగుతుందో లేదో అన్నప్రశ్న ఇప్పటికే తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రాష్ట్ర ఆదాయ వనరుల పేరుతో ప్రభుత్వం చూపుతున్న మద్యం ప్రేమ ఇప్పుడు తీవ్ర విమర్శలకు గురవుతోంది. మద్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ధర్మపోరాటం పేరిట ఉద్యమాలు చేసిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం విక్రయాలను రెట్టింపు చేసింది. ప్రభుత్వానికి ఆదాయం అవసరం.కానీ ఆ ఆదాయాన్ని ప్రజల ఆరోగ్యం,జీవితం, కుటుంబాలపై ముడిపెట్టి సంపాదించాలంటే మాత్రం అది ప్రజా ప్రతినిధులకు తగిన నైతిక వైఖరి కాదన్నది స్పష్టమైన వాదన. మద్యం విక్రయాలు – రెట్టింపు వేగంతో2024 25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 45,000 కోట్ల మద్యం ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించిందన్న వార్తలు అధికారిక వర్గాల నుంచే వెలువడాయి. రాబోయే ఆర్థిక సంవత్సరానికి (2025-26) రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత బడ్జెట్లో 20శాతం (రూ.60 వేల కోట్లు) ఆదాయం మద్యం ద్వారా రాబట్టాలని సర్కార్ నిర్ణయించింది. గతేడాది ఈ రూపంలో రూ.39.500 కోట్ల ఆదాయం సమకూరగా ఈ సారి మరో రూ.20వేలకోట్ల వరకు ఆదనంగా లిక్కర్‌ద్వారా సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవలఅబ్కారీ శాఖపై సమీక్ష నిర్వహించిన ఆ శాఖమంత్రి ఆదాయమార్గాల పెంపుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధరల నిర్ణయ కమిటీ సిఫారసులను పరిగణనలోకి తీసుకున్న ఆ శాఖ మూడు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించింది. ధరల పెంపు, కొత్త కంపెనీలకు అనుమతి, సాధారణ బార్లతో పాటు ఎలైట్ బార్లు, వైన్స్ సంఖ్య పెంచాలని ప్రతిపాదించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 2,620 మద్యం దుకాణాలు, వెయ్యికి పైగా బార్లు, క్లబ్బులు, టూరిజం హోటళ్లు ఉన్నాయి. 12,769 గ్రామ పంచాయతీలుండగా, ఒక్కో గ్రామంలో అనధికారికంగా 5 నుంచి 10వరకు బెల్ట్ షాపులున్నాయి. మొత్తంగా చూస్తే తెలంగాణ వ్యాప్తంగా దాదాపు లక్షకు పైగా బెల్ట్ షాపులుంటాయని గణాంకాలు చెబుతున్నాయి. వీటి ద్వారా ఖజానాకు అన్ని శాఖలకంటే ఎక్కువ మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. గతపదేండ్లలో దాదాపు రూ.2.5లక్షల కోట్లకు పైగా ఆదాయం ఈ విభాగం నుంచే సర్కారుకు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టింది.ఇందుకు సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని అబ్కారీ శాఖ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆదాయం పెంపుపై గత రెండు నెలలుగా కసరత్తు చేసిన అధికారులు ధరలతో పాటు వైన్స్, బార్ల సంఖ్యను పెంచడం, కొత్త కంపెనీలకు అనుమతులివ్వాలనే మూడు ప్రతిపాదనలను సర్కార్ ముందుచ్చారు. ధరల నిర్ణయ కమిటీ సిఫారసులను పరిగణంలోకి తీసుకుని గత నెలలో బీర్లపై 15శాతం ధరలను అబ్కారీశాఖ పెంచింది. 5 శాతం పన్నులతో కలుపుకుని 19 శాతం వరకు బీర్లపై అదనపు ఆదాయం రానుంది. అలాగే లిక్కర్‌పై 20 నుంచి 25 శాతం పెంచాలని ప్రతిపాదించినప్పటికీ సర్కార్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కొత్త కంపెనీల అనుమతికి సంబంధించి ఆచితూచి అడుగేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది అక్టోబర్లో సోమ్ డిస్టలరీకి అనుమతిచ్చినట్టు ప్రచారం జరిగింది. అయితే ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా ఎలా అనుమతిస్తారని ప్రతిపక్షాలతో పాటు స్వపక్షం నుంచి

**మన్నారం నాగరాజు**

విమర్శలు రావడంతో సర్కార్ వెనుకడుగు వేసింది. ఈ క్రమంలో గత నెలలో తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) కొత్త లిక్కర్ బ్రాండ్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో ఉన్న 2,620మద్యం దుకాణాలు, వెయ్యికి పైగా బార్లసంఖ్యను 25 శాతం వరకు పెంచాలని



ప్రతిపాదించారు. అలాగే గుడుంబా, గంజాయి నియంత్రణను పకడ్బందిగా అమలు చేయాలని అధికారులు సర్కారు నివేదించారు. వీటిని అరికడితే గ్రామీణ ప్రాంతాల్లో చీఫ్ లిక్కర్ అమ్మకాలు భారీగా పెరుగుతాయని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి జిల్లాల వారీగా అబ్కారీ శాఖ అధికారులకు ప్రతి నెలా నిర్ణయించిన టార్గెట్లను చేరుకునేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ప్రతిపాదించారు. ఈ ఏడాది ఎలాగైనా మద్యం ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.60 వేల కోట్లు సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. దక్షిణ భారతదేశంలో మద్యం విక్రయాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ (ఎన్ఐపీఎఫ్పీ) ప్రకారం రాష్ట్రంలో గతేడాది ఒక్కోవ్యక్తి సగటున మద్యం కోసం రూ. 1,623 ఖర్చు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ పరిస్థితిని మార్చుతామని ఎన్నికల ముందు ఆ పార్టీ నేతలు అనేక సభల్లో చెప్పారు. 18నెలల పాలనలో రాష్ట్రంలో లిక్కర్ అమ్మకాలు పెరిగాయే తప్ప తగ్గలేదు. పైగా రాష్ట్ర వ్యాప్తంగా బెల్ట్ షాపులసంఖ్య కూడా పెరిగిందని చెబుతున్నారు. ప్రభుత్వం ఆదాయాన్ని ఆశిస్తున్నదే తప్ప ప్రజల ఆరోగ్యాన్ని, వారి ఆర్థిక స్థితిగతులను చూడడం లేదనే విమర్శలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. ఒక వైపు మద్యం తీసుకోవద్దనీ, ఆరోగ్యాలు కాపాడుకోవాలని అడ్వర్టైజ్మెంట్ల ద్వారా ప్రచారం చేస్తూ మరో వైపున దాని వినియోగాన్ని పెంచుతుండటం గమనార్హం. రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ద్వంద విధానం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకూ రాష్ట్రంలో లిక్కర్ షాపులు, బార్‌లు, అబ్కారీ పాలసీ అనుసారంగా విస్తరిస్తున్నాయి.ఓవైపు మద్య నిషేధం గురించి మాట్లాడే నాయకులు, మరోవైపు అధికారంలోకి రాగానే మద్యం ద్వారావేల కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకోవడం ప్రజాస్వామ్య విధానాలపై నమ్మకాన్ని తగ్గించేదిగా మారుతోంది. తెలంగాణ సమాజంలో మైనారిటీలు పెద్ద సంఖ్యలో గ్రామీణ, పట్టణ పేద వర్గాలుగా ఉన్నాయి. వీరి జీవితాల్లో మద్యం ప్రభావం మరింత తీవ్రమవుతోంది. రోజుకూలీలు, ఆటో డ్రైవర్లు, చిన్న ఉద్యోగులు వీరే మద్యం వలయంలో బలయ్యే వర్గాలు. ఆదాయానికి తగిన వృద్ధి లేకపోయినా, మద్యం ఖర్చు మాత్రం పెరిగిపోవడం వల్ల కుటుంబ జీవన విధానం దెబ్బతింటోంది. చివరికి భార్యా,పిల్లలు క్షుద్రంగా బతకాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమైనా తనకు అవసరమైన ఆదాయాన్ని పన్నుల రూపంలో లేదా ఇతర అభివృద్ధి ప్రాధాన్యతల ద్వారా సంపాదించాలి. కానీ, తెలంగాణలో మద్యం ద్వారా అధిక ఆదాయం సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకోవడం చూసినపుడు ఇది సంక్షేమం కాదు, వ్యాధి రూపంలో అభివృద్ధి అని చెప్పక తప్పదు. ప్రభుత్వ ఆదాయం మద్యం మీద ఆధారపడడం అంటే ప్రజల నాశనాన్ని అధికారికంగా అంగీకరించడమే. ఇతర రంగాల్లో ప్రభుత్వం స్పష్టమైన దిశలో పనిచేస్తుందో లేదో అనేది ప్రశ్నార్థకంగా ఉంది. కానీ మద్యం షాపుల నిర్వహణలో మాత్రం స్పష్టత ఉంది.ఉద్యోగ నోటిఫికేషన్లు తారాస్థాయిలో విడుదలకాలేదు. పింఛన్లు, పథకాల అమలు ఆలస్యం అవుతోంది. కానీ మద్యం షాపుల విస్తరణ మాత్రం వేగంగా కొనసాగుతోంది. ఇది బహుజన వర్గాలకు నష్టమే కాకుండా, రాజకీయంగా అనైతిక చర్యగా భావించాల్సిన పరిస్థితి. డ్రగ్స్, గంజాయి, పేకాట వంటి వ్యసనాలు కూడా మద్యం వెంబడి వ్యాపిస్తున్నాయి. ముఖ్యంగా నగర పరిధిలో, విద్యార్థుల మధ్య గంజాయి వినియోగం పెరుగుతున్నదన్న సంగతి అధికారికంగా గుర్తించబడిన అంశం. ఉద్యోగ అవకాశాల లేమి, నిరుద్యోగ భయం, నిరాశ ఇవన్నీ కలగలిపి యువతను మార్గం తప్పేలా చేస్తున్నాయి. మద్యం, గంజాయి, ఇతర వ్యసనాలు ఇవన్నీ జీవితాన్ని జోగులా మారుస్తున్నాయి. మద్యం వల్ల కుటుంబాలు తుడిచిపెట్టిపోతున్నాయి. మహిళలపై హింస, పిల్లలపై నిర్లక్ష్యం, విద్యా మానివేతలు ఇవన్నీ నిత్యకృత్యాలుగా మారిపోయాయి. ఇది ఒక వ్యక్తిగత సమస్య కాదు ఇది సమాజాన్ని వ్యవస్థాపితంగా విచ్ఛిన్నం చేసే ప్రమాదకర పరిస్థితి.ప్రభుత్వానికి ఆదాయం అందించే ప్రధాన వినియోగదారులు ఎవరంటే మధ్య తరగతి పేదవర్గాలే. వీరు బహుజనవర్గాలే. ఆవర్గాలపై మద్యం పేరుతో ఉక్కుపాదం మోపడం అంటే ప్రభుత్వమేవారిని జీవచ్ఛేలా గావించడమే. విద్యావేత్తలు, సమాజ హితసాధకులు ప్రభుత్వ విధానాలను గట్టిగా ప్రశ్నించాలి. ఆదాయానికి మార్గాలెన్నో ఉన్నాయి. •

# ట్రంప్ విధానాలతో యుఎస్ కర్షకుల కన్నీళ్లు!




## అమెరికా టారిఫ్‌లతో ప్రత్యామ్నాయాలు వెదుకుతున్న దేశాలు

### భారత్-చైనా-రష్యా స్నేహబంధం శాపమైందా?

**న్యూయార్క్, ఆగస్టు 23:** అగ్రరాజ్యం అమెరికా అనుసరిస్తున్న సుంకాల విధానం ఇప్పుడు అదే దేశానికి ఆర్థికంగా నష్టాన్ని కలిగిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచ వాణిజ్యంపై తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి అమెరికా విధించిన టారిఫ్‌లు, ఇతర దేశాలను తమకు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవడానికి ప్రేరేపించాయి. ఫలితంగా అమెరికా క్రమంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఒంటరిగా మిగిలిపోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఓవైపు యూరోపియన్ దేశాలు తమ రక్షణ సామర్థ్యాలను పెంచుకోవడానికి ప్రయత్నిస్తుండగా.. మరోవైపు బ్రిక్స్ దేశాలైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలు అమెరికాపై ఆధారపడకుండా పరస్పర వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసుకుంటున్నాయి.

**సోయాబీన్ వ్యాపారం.. అమెరికన్ రైతులు ఆవేదన**

ఈ అంతర్జాతీయ వాణిజ్య మార్పులకు సోయాబీన్ వ్యాపారం ఒక చక్కని ఉదాహరణగా నిలిచింది. అమెరికా ప్రపంచంలో రెండో అతిపెద్ద సోయాబీన్ ఉత్పత్తిదారు కాగా, చైనా అతిపెద్ద కొనుగోలుదారు. గతంలో చైనా అమెరికా నుంచి భారీగా సోయాబీన్ కొనుగోలు చేసేది. కానీ అమెరికా టారిఫ్ యుద్ధం ప్రారంభించిన తర్వాత.. చైనా తన కొనుగోలు విధానాన్ని మార్చుకుంది. ఇటీవల నివేదికల ప్రకారం.. చైనా సెప్టెంబరు-అక్టోబరు నెలల కోసం అమెరికా నుంచి ఒక్క టన్ను సోయాబీన్‌నుకూడా కొనుగోలు చేయడానికి ఒప్పందం చేసుకోలేదు. జులైలో కూడా చైనా దిగుమతులు చాలా తక్కువగా ఉన్నాయి. తమపంట అమ్ముడుపోక అమెరికాలోని సోయాబీన్ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి స్వయంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు లేఖరాసి, చైనా వంటి అతిపెద్ద కొనుగోలుదారుని కోల్పోతే బతకడం కష్టమని హెచ్చరించారు.

**బ్రిక్స్ కూటమి ప్రభావం..**

బ్రిక్స్ దేశాలు ఇప్పుడు ఆర్థిక సహకారాన్ని పెంచుకుటూ అమెరికాపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నాయి. భారత్‌లోని చైనా రాయబారి షూ ఫెయ్‌హాంగ్ మాట్లాడుతూ.. అమెరికా బెదరింపు ధోరణిని అనుసరిస్తోందని, ఇలాంటి పరిస్థితుల్లో చైనా భారత్‌కు అండగా ఉంటుందని అన్నారు. అదేవిధంగా.. రష్యా డిప్యూటీరాయబారి రోమన్ బాబుష్కిన్ మాట్లాడుతూ.. భారతదేశానికి అమెరికా మార్కెట్‌లో సమస్యలు ఎదురైతే.. రష్యా మార్కెట్ సిద్ధంగా ఉందని, భారత ఎగుమతులను స్వాగతిస్తామని తెలిపారు.

**బ్రెజిల్‌కు లాభం..**

చైనా ఇప్పుడు అమెరికాకు బదులుగా బ్రిక్స్ దేశమైన బ్రెజిల్ నుంచి సోయాబీన్ దిగుమతులు భారీగా పెంచుకుంది. గత నెలలో చైనా మొత్తం సోయాబీన్ దిగుమతుల్లో దాదాపు 90 శాతం బ్రెజిల్ నుంచి జరిగింది.

**భారత్-చైనా-రష్యా సంబంధాలు మెరుగుపడుతున్నాయా?**

అమెరికా విధానాల నేపథ్యంలో భారత్ కూడా తన వాణిజ్య సంబంధాలను విస్తరించుకుంటోంది. రష్యా నేతృత్వంలోని 'యూరేషియన్ ఎకనామిక్ యూనియన్'తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా, భారత్-చైనా మధ్య గతంలో ఉన్న సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించుకుని, వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకోవడానికి అడుగులు పడుతున్నాయి.

చైనా అరుదైన ఖనిజాలు, ఎరువులు వంటి వ్యూహాత్మక వస్తువులను సరఫరా చేయానికి ముందుకు వచ్చింది. భారత ప్రభుత్వం కూడా చైనా వ్యాపార నిపుణులకు వీసా ఆంక్షలను సడలించే అవకాశం ఉంది. ఈ పరిణామాలు భారత్, రష్యా, చైనా మధ్య వాణిజ్య కూటమి బలపడుతోందనే సంకేతాలు ఇస్తున్నాయి. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక కొత్త శక్తిగా ఉద్భవిస్తున్నట్లు సూచిస్తుంది.



## భారత్‌లో అమెరికా రాయబారిగా సెర్గియో గోర్?

### ఈయన ట్రంప్‌కు సన్నిహితుడు!

**వాషింగ్టన్, ఆగస్టు 23:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. తన సన్నిహిత సహాయకుడు, విధేయుడు అయిన సెర్గియో గోర్‌ను భారత్‌కు అమెరికా రాయబారిగా నియమిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ముఖ్యంగా భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 50 శాతం సుంకాలను విధించాలన్న అమెరికా నిర్ణయం మరో నాలుగు రోజుల్లో అమల్లోకి రానుండగా.. ఈ ప్రకటన వెలువడంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. సెర్గియో గోర్ ఒక దశాబ్దానికి పైగా డొనాల్డ్ ట్రంప్‌కు విధేయుడిగా పని చేస్తున్నారు. ట్రంప్ 2016 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలోనూ, ఆ తర్వాత ఆయన పరిపాలనలోనూ గోర్ కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం కూడా ఆయన వైట్‌హౌస్‌లో ప్రెసిడెన్షియల్ పర్సనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ పదవిలో భాగంగానే దేశ వ్యాప్తంగా ప్రభుత్వ విభాగాల్లో ట్రంప్ ఆలోచనలకు అనుగుణంగా 'అమెరికా ఫస్ట్' సిద్ధాంతాన్ని సమర్థించే దాదాపు 4,000 మందిని రికార్డు సమయంలో నియమించారు. ఫలితంగా ఫెడరల్ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీల్లోని 95 శాతం ఉద్యోగాలను భర్తీ చేశారు. అలాగే ట్రంప్‌నకు సంబంధించిన పుస్తకాలను ప్రచురించడం, ఆయన తరపున ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం వంటి పనులను కూడా గోర్ పర్యవేక్షించారు. గోర్ పట్ల తనకున్న నమ్మకాన్ని ట్రంప్ స్వయంగా ఒక ప్రకటనలో వెల్లడించారు. 'ప్రపంచంలో అత్యధిక జనాభాఉన్న ప్రాంతంలో నా అజెండాను అమలు చేయగల వ్యక్తి నాకు కావాలి.

నేను పూర్తిగా విశ్వసించగలిగే వ్యక్తిగా సెర్గియో గోర్‌ను నియమిస్తున్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇది చూస్తుంటేనే ఆయన ట్రంప్‌నకు ఎంత నమ్మకస్తుడో అర్థం అవుతోంది. అయితే అలాంటి నమ్మకమైన వ్యక్తినే తాజాగా ట్రంప్ భారత్‌కు అమెరికా రాయబారిగా ప్రకటించారు.



## ధర్మస్థల కేసులో తప్పుదోవ పట్టించేవారిపై కఠిన చర్యలు

### కర్ణాటక డి.సిఎం శివకుమార్

**బెంగళూరు, ఆగస్టు 23:** కర్ణాటకలోని పుణ్యక్షేత్రమైన ధర్మస్థలంలో వందలమృతదేహాలను తానే పూడ్చి పెట్టానని ప్రకటించుకున్న పారిశుధ్య కార్మికుడు భీమాను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ స్పందించారు. రెండు దశాబ్దాలుగా 'హత్యలు, అత్యాచారాలు, ఖననాలు' జరిగినట్లు తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ సిఎం వెల్లడించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా ఈ కేసులో తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తిని అరెస్టు చేసిన విషయంపై ప్రశ్నించగా తను మాట్లాడిన తర్వాతే బిజెపి నేతలు ఈవిషయంపై మాట్లాడుతున్నారని అన్నారు. ధర్మస్థల దేవాలయం, సంస్థలకు నాయకత్వం వహిస్తున్న కుటుంబం సిఎం సిద్ధరామయ్యను కలిసి దర్యాప్తును స్వాగతించినట్లు తెలిపిన విషయాన్ని చెప్పారు. ఈ కేసులో తప్పుదోవ పట్టించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సిఎం, హోంమంత్రి తెలిపిన విషయాన్నితెలిపారు. తమ ప్రభుత్వం న్యాయం పక్షాన నిలబడుతుందని వ్యాఖ్యానించారు. మత రాజకీయాలు చేయాలనుకోవడం లేదని శివ కుమార్ అన్నారు. ధర్మస్థల ప్రతిష్టను దెబ్బతీసే కుట్ర జరిగిందని, దర్యాప్తులో నిజానిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.

## మరో 50 రోజుల్లో సుంకాలపై ట్రంప్ కీలక ప్రకటన

**వాషింగ్టన్, ఆగస్టు 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ బెదరింపులకు పాల్పడుతూనేఉన్నారు. ఫర్నిచర్‌దిగుమతులపై సుంకాలు విధిస్తామని తాజాగా హెచ్చరించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా పోస్టుపెట్టారు. 'అమెరికాలోకి వచ్చే ఫర్నిచర్‌పై మే భారీస్థాయిలో టారిఫ్ ఇన్వెస్టిగేషన్ నిర్వహిస్తున్నాం. 50 రోజుల్లో ఆ విచారణ పూర్తవుతుంది'అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. అయితే ఎంతమేరకు సుంకం విధిస్తారనే దానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. నార్త్‌కరోలినా, సౌత్ కరోలినా, మిషిగన్‌కు తిరిగి ఫర్నిచర్ పరిశ్రమను తీసుకురావడానికే ఈ చర్యలని పేర్కొన్నారు. యుఎస్‌లో ఫర్నిచర్, సంబంధిత పరిశ్రమలో జూలై నాటికి 3,40,000 మంది ఉపాధి పొందుతున్నారు. 2000సంవత్సరంలో పోల్చుకుంటే సగం మందే ఇప్పుడు ఆ రంగంలో పనిచేస్తున్నారు. ఇక, అగ్రరాజ్యానికి ఫర్నిచర్ ఎగుమతి చేసే దేశాల్లో చైనా, వియత్నాం ముందువరసలో ఉన్నాయి. 2024లో 25.5 బిలియన్ డాలర్ల విలువైన సామగ్రిని అమెరికా దిగుమతి చేసుకుందని గణాంకాలు వెల్లడించాయి.

ఇప్పటికే స్టీల్, అల్యూమినియం, ఆటో, ఇతర రంగాలపై ట్రంప్ సుంకాలు వేశారు. ఫార్మా, చిప్స్, క్రిటికల్ మినరల్స్ దిగుమతులపై పలు విచారణలు జరుగుతున్నాయి. ఇక భారత్‌పై రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు అదనపు సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఈ నెల 27 నుంచి 50 శాతం సుంకాలు అమల్లోకి రానున్న నేపథ్యంలో.. వీటి గడువును ట్రంప్ పొడిగిస్తారని తాను ఆశించడం లేదని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నరావో ఇప్పటికే పేర్కొన్నారు. గతంలో ట్రంప్ ప్రకటించినట్లుగా వచ్చే వారం కొత్త టారిఫ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

# నచ్చకపోతే మా ఉత్పత్తులు కొనకండి

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలపై జైశంకర్ కౌంటర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలుచేశారు. దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే తమ ప్రభుత్వం నిర్ణయాలు ఉంటాయని స్పష్టం చేశారు. భారత్‌తో ఏదైనా సమస్య ఉంటే ఇక్కడి ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. రష్యా చమురు కొనుగోలు చేయడంవల్ల భారత్‌పై వస్తోన్న విమర్శల అంశాన్ని ప్రస్తావించారు. భారత్, అమెరికా వాణిజ్య చర్చలు ఇంకా కొనసాగుతున్నాయి. అయితే మాకంటూ కొన్ని ప్రయోజనాలున్నాయి. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. మా రైతులు, చిన్న ఉత్పత్తిదారుల ప్రయోజనాలను రక్షించడమే మాకు ప్రధానం. దీనిపై మేం రాజీపడే ప్రసక్తేలేదు. వ్యాపార అజెండాతో సాగుతున్న అమెరికా యంత్రాంగానికి మద్దతిస్తున్న కొన్ని దేశాలు ఇతరులపై నిందలు వేసే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం నిజంగా మీకు భారత్‌తో సమస్య ఉంటే మా చమురును, శుద్ధిచేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయకండి అని జైశంకర్ అన్నారు. అంతేగాక ట్రంప్ అదనపు సుంకాలు ప్రకటించడానికి ముందే రష్యా చమురు అంశం గురించి అమెరికాతో తాము ఎలాంటి చర్చలు జరపలేదని వెల్లడించారు.

దేశ ప్రయోజనాలతో పాటు ప్రపంచ అవసరాలను దృష్టిలో ఉంచుకునే తాము మాస్కో నుంచి చమురును కొనుగోలు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. 2022లో చమురు ధరలు భగ్గుమన్నాయి. దీంతో అంతర్జాతీయంగా ఆందోళన నెలకొంది. అప్పుడు రష్యా చమురును భారత్ కొనాలనుకుంటే అందులో ఎలాంటి అభ్యంతరం లేదని ప్రపంచవ్యాప్తంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎందుకంటే దానివల్లే చమురు ధరలు స్థిరీకరిస్తాయని అందరికీ తెలుసు అని జైశంకర్ వివరించారు. మాస్కోతో తాము వాణిజ్యం పెంచుకోవాలని అనుకుంటున్నట్లు విదేశాంగమంత్రి తెలిపారు. అయితే ఉక్రెయిన్, రష్యా యుద్ధంపై ఇప్పటికే తమ వైఖరి స్పష్టంగా తెలియజేశామని, ఆ దేశాల ఉద్రిక్తతలు త్వరగా చల్లారాలని ఆకాంక్షిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ విదేశాంగ విధానం గురించి జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడిలా విదేశాంగ విధానం విధానాన్ని ఇంత బహిరంగంగా నిర్వహించిన ఏ అధ్యక్షుడిని గతంలో మనం చూడలేదు. ఒక్క భారత్ విషయంలోనే కాదు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలతో ఆయన డీల్ చేస్తున్న విధానం అనాదిగా వస్తున్న సంప్రదాయ పద్ధతులకు చాలా దూరంగా ఉంది. ఇక, వాణిజ్య అంశాలతో పాటు వాణిజ్యేతర వ్యవహారాలకు టారిఫ్‌లను వినియోగించడం కాస్త కొత్తగా అనిపిస్తోంది అని కేంద్రం మంత్రి అన్నారు.

## పార్లమెంట్‌లో 'నంబర్ 1' చెట్టు.. భద్రతకు అడ్డు!



**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** పార్లమెంట్‌లో ఓ చెట్టు వివిఐపిల భద్రతకు సవాల్‌గా మారింది. గజ ద్వారం వద్ద ఉన్న ఆ వృక్షంతో భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఆ చెట్టును మరో చోటుకు మార్చేందుకు భద్రతా సిబ్బంది సన్నాహాలు ప్రారంభించారు. కొత్త పార్లమెంట్ భవనం లోని ఆరు ప్రవేశ మార్గాల్లో గజద్వారంఒకటి. ప్రధాని నరేంద్రమోడీ తరచూ ఈమార్గంనుంచే సభకు వెళుతుం టారు. ఈ గేటువద్ద ఓ పసుపు పూల చెట్టు ఉంది. నంబర్ 1గా పేర్కొనే ఈ చెట్టు విపరీతంగా పెరిగి ఈ ప్రాంతంలో భద్రతకు అడ్డంకిగా మారింది. వివిఐపిలు వెళ్లే మార్గంలో ఈ చెట్టువల్ల భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతుండడంతో దీన్ని ఇక్కడి నుంచి మార్చాలని స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ భావించింది. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌కు వివరించింది. అయితే, ఈ చెట్టును తొలగించాలంటే ఢిల్లీ అటవీ శాఖ నుంచి అనుమతి తప్పనిసరి. దీంతో ఆ భద్రతా సిబ్బంది ఆ ప్రక్రియను ప్రారం భించారు. ఇందుకోసం ఇప్పటికే అటవీశాఖ వద్ద రూ.57వేల సెక్యూరిటీ డిపాజిట్‌ను జమచేశారు. వచ్చేవారం పార్లమెంట్ ప్రాంగణంలోని ప్రేరణ స్థల్ వద్దకు దీన్ని మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చెట్టును తరలిస్తున్నందుకు పరిహారంగా సిపిడబ్ల్యుడి పార్లమెంట్ ప్రాంగణంలోనే మరో 10 మొక్కలు నాటాల్సి ఉంటుందని సంబంధిత అధికారులు వెల్లడించారు. కాగా శుక్రవారం ఉదయం పార్లమెంట్ వద్ద భద్రతా ఉల్లంఘన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. రెడ్‌క్రాస్ రోడ్డులోని ఐజి-2 గేటు వద్ద ఉన్న చెట్టు ఎక్కి ఓ వ్యక్తి పార్లమెంట్ ప్రాంగణంలోకి చొరబడ్డాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అరెస్టుచేశారు. నిందితుడి మానసిక పరిస్థితి సరిగా లేదని ప్రాథమికంగా నిర్ధారించారు.

# యేడాదికి 50 రాకెట్లు ప్రయోగించగలమా?

## శాస్త్రవేత్తలకు ప్రధాని మోడీ ప్రశ్న!



**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** అంతరిక్షరంగంలో వరుస విజయాలు భారత్‌కు అలవాటుగా మారాయని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. రేండేళ్ల క్రితం చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలు మోపిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందన్నారు. 2040లో భారత్ సొంతంగా చేపట్టే అంతరిక్ష యాత్రలో భారత వ్యోమగామి చంద్రుడిపై అడుగుపెట్టి త్రివర్ణ పతకాన్ని ఎగురవేసి వికసిత్ భారత్ ఖ్యాతిని చాటుతారని మోడీ పునరుద్ఘాటించారు. భవిష్యత్‌లో ఏడాదికి 50 రాకెట్లను ప్రయోగించే స్థితికి మనం చేరుకోగలమా అని ఆయన అంతరిక్ష శాస్త్రవేత్తలను ప్రశ్నించారు. భవిష్యత్తులో ఆ విధంగా చర్యలు తీసుకోవడానికి ప్రణాళికలు రచించాలని కోరారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా మోడీ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. మానవాళి భవిష్యత్తును ప్రకాశవంతం చేసే రహస్యాలను చేధించడానికి మరింత లోతైన అంతరిక్ష పరిశోధనలకు సిద్ధం కావాలని భారత శాస్త్రవేత్తలకు ప్రధాని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో భారత్ చేపట్టనున్న అంతరిక్ష పరిశోధనల కోసం, భవిష్యత్ మిషన్ల కోసం మరింతమంది వ్యోమగాములను తయారు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో యువత కూడా భాగం కావాలని పిలుపునిచ్చారు. ఏదీ మనకు చివరి సరిహద్దు కాదనే విషయాన్ని అంతులేని విశ్వం తెలియచేస్తోందని అదేవిధంగా భారత్ ఎటువంటి హద్దులు లేని విధంగా అంతరిక్ష రంగంలో ముందుకు వెళ్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలు చేస్తున్న కృషితో త్వరలో గగన్‌యాన్ మిషన్‌ను ప్రారంభించనున్నామని మరి కొన్నేళ్లలో సొంత స్పేస్‌స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేసుకుంటామని ప్రధాని పేర్కొన్నారు. అంతరిక్ష రంగాన్ని అభివృద్ధి చేయడంలో ప్రైవేట్ రంగం ముందుకు రావాలని కోరారు. 2040 నాటికి చంద్రుడిపై తొలిసారిగా భారత వ్యోమగామిని దించుతామని సంస్థ ఛైర్మన్ ఎస్.సోమనాథన్ ఇటీవల వెల్లడించారు.

రోదసి యాత్రలకోసం నలుగురు వ్యోమగామి అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. వీరంతా భారత వైమానిక దళానికి చెందిన టెస్ట్ పైలట్లు అని వివరించారు. గగన్‌యాన్ ప్రాజెక్టు ద్వారా రోదసి అన్వేషణలో తదుపరి అంకాన్ని ఇస్రో చేపట్టనుందని తెలిపారు. దీనికింద ఇద్దరు లేదా ముగ్గురు భారత వ్యోమగాములను దిగువ భూకక్ష్యలోకి పంపుతామన్నారు. మూడు రోజుల తర్వాత వారు భూమికి తిరిగొస్తారని చెప్పారు. వీరు ప్రస్తుతం బెంగళూరులోని వ్యోమగామి శిక్షణ కేంద్రంలో తర్ఫీదు పొందుతున్నారని తెలిపారు. శుక్రుడి కక్ష్యలోకి ఉపగ్రహాన్ని, అంగారకుడి పైకి ల్యాండర్‌ను ప్రయోగించడానికి చర్యలు తీసుకోవాలని మోడీ సూచించారని పేర్కొన్నారు.

# ఉత్తరాఖండ్‌లో మళ్లీ క్లౌడ్ బరస్ట్‌తో భారీ వర్షాలు




## పలువురు గల్లంతు

**చమోలీ, ఆగస్టు 23:** ఉత్తరాఖండ్‌ను మళ్లీ భారీ వర్షాలు చుట్టుముట్టాయి. తాజాగా చమోలీ జిల్లాలో థరలీలో కురిసిన భారీ వర్షం కారణంగా వరదలు సంభవించాయి. ఫలితంగా అనేక నివాస ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. లెక్కలేనన్ని వాహనాలు బురదలో కూరుకుపోయాయి. విద్యాసంస్థలు మూసివేశారు. వరదల కారణంగా పలువురు గల్లంతైనట్లు సమాచారం. ఈ విపత్తుపై సమాచారం అందుకున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు తక్షణం వరద ప్రభావిత ప్రాంతాలకు చేరుకొని సహాయక చర్యలు మొదలుపెట్టాయి. వరదల్లో చిక్కుకున్నవారిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్‌సింగ్ ధామి ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'చమోలీ జిల్లాలోని థరాలి ప్రాంతంలో క్లౌడ్‌బరస్ట్ సంభవించింది. జిల్లా యంత్రాంగం, ఎస్‌డిఆర్‌ఎఫ్, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపడుతున్నారు. తాను స్థానిక పరిపాలన అధికారులతో నిరంతరం సంప్రదిస్తూ పరిస్థితి పర్యవేక్షిస్తున్నాను. ప్రజలంతా సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నానని' అన్నారు.

ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వర్షాల కారణంగా సంభవించిన విపత్తుకు చాలామంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. అనేక అనుసంధాన రహదారులు మూసుకుపోవడంతో ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంతలో ఈ నెల 22 నుంచి 25 వరకు ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో రెడ్ అలర్ట్, మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. పిథోరగఢ్, బాగేశ్వర్ జిల్లాల్లోని పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. భారత వాతావరణశాఖ తెలిపిన సమా చారం ప్రకారం అతి స్వల్ప సమయంలో భారీ వర్షాలకు దారితీయడాన్నే క్లౌడ్‌బరస్ట్ అని అంటారు.

ఉత్తరాఖండ్‌లో ఇటీవల కూడా వరదలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. ఒక్కసారిగా విరుచుకుపడ్డ ఆకస్మిక వరదలతో ఉత్తర కాశీ అల్లకల్లోలమైంది. గంగోత్రికి వెళ్లే మార్గంలో ఉన్న థరాలీ గ్రామం సగభాగం తుడిచిపెట్టుకుపోయింది. అక్కడి ఇళ్లు, కార్లు, చెట్లు వరదల్లో కొట్టుకుపోయాయి. ఈ నెల మొదటి వారంలో ఖీర్ గంగానది పరీవాహక ప్రాంతంలో మేఘ విస్ఫోటంతో ఒక్కసారిగా విరుచుకుపడిన బురదతో కూడిన వరద.. అతివేగంగా థరాలీ గ్రామంలోకి దూసుకొచ్చింది. దీంతో 3, 4 అంతస్తుల భవనాలు కూడా పేకమేడల్లా కుప్పకూలి వరదలో కొట్టుకుపోయాయి.

# సంక్షిప్తంగా..

## ట్రంప్ దెబ్బతో తగ్గిన వలసలు



**వాషింగ్టన్, ఆగస్టు 23:** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలు.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో బంగారు భవిష్యతును తలుచుకుంటూ ఆ దేశానికి వెళ్లాలనుకునేవారి సంఖ్య తగ్గిపోతోంది. ఇదే విషయాన్ని ప్యూ రీసెర్చ్ సెంటర్ నివేదిక వెల్లడించింది. ఈ యేడాది జనవరి నుంచి జూన్ మధ్య వలస జనాభా 15 లక్షలు తగ్గింది. దాంతో ఇమిగ్రెంట్స్ సంఖ్య 53.3 మిలియన్ల నుంచి 51.9 మిలియన్లకు పడిపోయింది. 1960 తర్వాత ఇలా వలసదారుల సంఖ్య క్షీణించడం ఇదే తొలిసారి కావడం గమనర్హాం. ఇది అనుహ్య మార్పును సూచిస్తోందని ప్యూ రీసెర్చ్ సెంటర్ డెమోగ్రాఫర్ జెఫ్రె పస్సెల్ మీడియాకు వెల్లడించారు. ఈ క్షీణత లేబర్ మార్కెట్‌పై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'అమెరికా జనాభాలో పనిచేసే వయసున్న వ్యక్తుల సంఖ్య పెరగడం లేదు. అలాంటప్పుడు ఆ దేశానికి వలసల నుంచే శ్రామికశక్తి లభిస్తుంది. ఈ శ్రామికశక్తి పెరగపోతే.. ఆర్థిక వ్యవస్థకు కష్టమే' అని జెఫ్రె అభిప్రాయపడ్డారు. సరిహద్దుల నుంచి అక్రమంగా దేశంలోకి ప్రవేశించి వారి సంఖ్యను కట్టడి చేసేందుకు బైడెన్ హయాంలో చర్యలు తీసుకోవడంతో 2024 నుంచే ఈ మార్పు కనిపిస్తున్నప్పటికీ.. ట్రంప్ కఠిన వైఖరితో అది భారీగా పెరిగింది. అనధికారిక వలసల సంఖ్య కూడా తగ్గిందని నివేదిక పేర్కొంది. మాస్ డిపోర్టేషన్లు, బహిష్కరణను తప్పించేందుకు ఉన్న రక్షణలు తొలగించడమూ ఈ సంఖ్య తగ్గడానికి కారణమని వెల్లడించింది.

## అనిల్ అంబానీ కంపెనీల్లో సిబిఐ సోదాలు

**ముంబై, ఆగస్టు 23:** ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీకి మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బ్యాంక్ మోసం కేసులో రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్‌కు సంబంధించిన కంపెనీలు, ఇతర ప్రాంతాల్లో సిబిఐ శనివారం సోదాలు చేపట్టిందని సంబంధిత అధికారులు మీడియాకు వెల్లడించారు. అనిల్ గ్రూప్ కంపెనీలు పలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని అవకతవకలకు పాల్పడ్డాయనే ఆరోపణలపై ఆయనపై కేసు నమోదైంది. దాంతో ఇప్పటికే ఆయన కార్యాలయాల్లో ఇడి సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. రెండు వారాల క్రితం ఆయనను 10 గంటలపాటు ప్రశ్నించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ. 2 వేల కోట్ల మేర మోసం కేసులో తాజాగా సిబిఐ సోదాలు నిర్వహించింది. నష్టాల్లో చిక్కుకున్న టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తీసుకున్న రుణాన్ని కొన్ని నెలల క్రితం మోసపూరిత చర్య అని ఎస్‌బిఐ నిర్ణయించింది. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాల ప్రకారం.. ఏదైనా ఒక బ్యాంకు, ఒక ఖాతాను 'మోసపూరితమైంద'ని వర్గీకరించాక, ఆ విషయాన్ని 21 రోజుల్లోగా ఆర్‌బిఐకి తెలిపాలి. కేసును సిబిఐ లేదా పోలీసులకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే సిబిఐ కేసు నమోదు చేసింది.

## అమెరికాకు తాత్కాలికంగా పోస్టల్ సేవలు నిలిపివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** అమెరికా ప్రభుత్వ కొత్త ఆదేశాల నేపథ్యంలో భారత్ నుంచి అమెరికాకు వెళ్లే పోస్టల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని భారత డాక్ శాఖ నిర్ణయించింది. అమెరికా ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ నంబర్-14324 ప్రకారం, ఈనెల 29వ తేదీ నుంచి 800 డాలర్లవరకు ఉన్న వస్తువులపై ఉన్న డ్యూటీఫ్రీ సదుపాయాన్ని రద్దు చేశారు. దీంతో ఇకపై అమెరికాకుపంపే ప్రతి సరకుపైనా కస్టమ్స్ డ్యూటీ విధించబడుతుంది. అయితే 100 డాలర్ల లోపు గిఫ్ట్‌ఐటమ్స్, లేఖలు, డాక్యుమెంట్లు మాత్రం మునుపటిలాగే ఉంటాయని తెలిపారు. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ఇప్పటికే కొన్నిమార్గదర్శకాలు విడుదలచేసింది. కానీ కస్టమ్స్ డ్యూటీ వసూలు విధానం, టెక్నికల్ ప్రాసెస్ ఇంకా స్పష్టంగా లేవు.

## సహజీవనం చేస్తున్న వ్యక్తిని హత్య చేసిన మహిళ

**జైపూర్, ఆగస్టు 23:** సహజీవనం చేస్తున్న వ్యక్తి మద్యానికి బానిస అయ్యాడు. అతడి తాగుడు అలవాటును ఆమె భరించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తిని తాడుతో కట్టేసింది. గొంతు నొక్కి హత్య చేసింది. రాజస్థాన్‌లోని ఝులావర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. హారక్‌చంద్ లోధా (32) తనభార్య, పిల్లలనువదిలేశాడు. రేఖ (30)తో కలిసి ఆరునెలలుగా సహజీవనం చేస్తున్నాడు. కాగా, హారక్‌చంద్ నిత్యం మద్యం సేవించి వచ్చి రేఖతో గొడవపడేవాడు. అయితే అతడి తాగుడును ఆమె భరించలేకపోయింది. ఈ నెల 21న రాత్రి వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో మద్యంమత్తులో ఉన్న హారక్‌చంద్ చేతులు, కాళ్లను తాడుతో రేఖ కట్టేసింది. ఆ తర్వాత గొంతునొక్కి అతడ్ని హత్య చేసింది.

# డిసిపల్లిలో ముగిసిన పొగాకు వేలం ప్రక్రియ

## - 165 కోట్ల రూపాయల విలువైన పొగాకు కొనుగోలు



**మర్రిపాడు (నెల్లూరు), జూలై 23, ప్రభాతవార్త :** జిల్లాలోని మర్రిపాడు మండల పరిధిలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రంలో వేలం ప్రక్రియ శనివారంతో పూర్తయింది. ఈ వేలం కేంద్రంలో 165,63,02,771రూపాయల విలువైన పొగాకు కొనుగోళ్ళు జరిగినట్లు పొగాకు వేలం కేంద్ర నిర్వహణాధికారి టి.రాజశేఖర్ తెలిపారు. వేలం ముగింపు సందర్భంగా ఆయన విలేకర్లతో మాటాడుతూ మార్చి 9న వేలం కేంద్రం ప్రారంభమై 127రోజులపాటు వేలం ప్రక్రియ సాగిందన్నారు. ఈ ప్రక్రియలో 23కంపెనీలకు చెందిన పొగాకు కొనుగోలు దారులు పాల్గొన్నారన్నారు. వేలానికి 80,681బేళ్ళను అనుమతించగా అందులో 24,700బేళ్ళను వివిధ కారణాల వలన తిరస్కరించామన్నారు. వీటిలో నోసేల్ 4,836, నోబిడ్ 14,463, ఆర్‌ఆర్ 1459,సిఆర్ 2755, బిఆర్ 1188 ఉన్నాయన్నారు. 55,980బేళ్ళను వేలం ప్రక్రియ లో కొనుగోలు దారులు కొనుగోలు చేశారన్నారు. దీంతో 7.3మిలియన్ కిలోల పొగాకును విక్రయించగా 165కోట్ల 63లక్షలా 2వేల, 771రూపాయల కొనుగోళ్ళు జరిగాయన్నారు. వేలంలో గరిష్టధర కేజి కి 291రూపాయలు, కనిష్ట ధర 17రూపాయలు, సగటు ధర 235-29రూపాయలుగా నమోదైందని రాజశేఖర్ తెలిపారు. డిసిపల్లి వేలం కేంద్ర పరిధిలో 1747.50బ్యారన్లకు చెందిన 2081మంది రైతులు తమ ఉత్పత్తులను డిసిపల్లి వేలం కేంద్రం ద్వారా విక్రయించారని ఆయన తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేందుకు పొగాకుబోర్డు అన్నివిధాల చర్యలు తీసుకుందన్నారు.

పొగాకు వేలం కేంద్రంలో పొగాకు సూర,పండుగుళ్ళను విక్రయించామన్నారు. ఈసంవత్సరం ఎలాంటి అడ్డంకులు, ఆటంకాలు లేకుండా రైతులు తాము పండించిన పొగాకును విక్రయించుకున్నారన్నారు. పొగాకుబోర్డు అధికారికంగా నిర్ణయించిన లక్ష్యం మేరకు శనివారంతో కొనుగోలు ప్రక్రియ పూర్తయిందన్నారు. రైతువద్ద మిగిలి ఉన్న అదనపు పొగాకు కొనుగోళ్ళకడు భారత పొగాకుబోర్డు అనుమతించిన వెంటనే పొగాకు కొనుగోళ్ళను తిరిగి ప్రారంభిస్తామని రాజశేఖర్ తెలిపారు.



అన్న క్యాంటీన్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

## రాష్ట్రంలో విజయవంతంగా
# అన్న క్యాంటీన్లు
## - మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అన్న క్యాంటీనులను పేదవాళ్ల ఆకలిని తీరుస్తూ విజయవంతంగా నడుపుతున్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం మచిలీపట్నం నగరంలోని మూడు స్తంభాల సెంటర్ వద్ద గల అన్న క్యాంటీన్లో రాష్ట్ర మంత్రి దాతల సహకారంతో రూ.75 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ ను ప్రారంభించి స్వయంగా ఆ నీటిని త్రాగారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పేదవాళ్ల ఆకలిని తీర్చేందుకు గతంలో తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ప్రారంభించి రూ.5 చొప్పున మూడు పూటలా నాణ్యమైన భోజనం అందించిందన్నారు. గత ప్రభుత్వం అన్న కాంటీన్లను మూసివేసిందన్నారు తిరిగి తమ కూటమి ప్రభుత్వం వచ్చాక అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామన్నారు.

అన్న క్యాంటీన్ల ద్వారా 5 రూపాయలకే స్వచ్ఛమైన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు.

చాలామంది దాతలు ముందుకు వచ్చి అన్న క్యాంటీన్ల నిర్వహణకు తమ వంతు సహాయం అందిస్తున్నారన్నారు.

నగరంలోని వైద్యులు ధన్వంతరి తమ వంతు సహాయంగా

గత సంవత్సరం లక్ష రూపాయలు, ఈ సంవత్సరం కూడా మరొక లక్ష రూపాయలు అందించారన్నారు.

ప్రస్తుతం వారి మనవడు డాక్టర్ బి.వి. వివేక్, డాక్టర్ వైష్ణవిల వివాహ సందర్భంగా ముందుకు వచ్చి అన్న క్యాంటీన్లో 75 వేల రూపాయల వ్యయంతో ఆర్వో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ సహాయ కమిషనర్ గోపాల్ రావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపిచంద్, వైద్యులు ధన్వంతరి, వివేక్, వైష్ణవి తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛత సాధన ద్వారా స్వర్ణాంధ్ర

స్వచ్ఛత సాధన ద్వారా స్వర్ణాంధ్ర సాధించవచ్చని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయమని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం ఉదయం మచిలీపట్నం మండలంలోని పోతేపల్లి గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో పరిశుభ్రత అనే ఇతివృత్తంతో జరిగిన అవగాహన కార్యక్రమంలో మంత్రివర్యులు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తో కలిసి పాల్గొని గ్రామంలోని మురికి కాలవల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేశారు.

అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీ ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఏర్పాటుచేసిన సభా కార్యక్రమంలో

మంత్రి, జిల్లా కలెక్టర్, అధికారులు అందరూ కలిసి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గతంలో 1994 నుండి 2004 వరకు పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యమ స్ఫూర్తితో చేపట్టి పారిశుధ్య కార్యక్రమాలను, పచ్చదనం పెంచే కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేశారన్నారు.

అంతకుమునుపు సరైన మరుగుదొడ్లు లేక రహదారుల పక్కనే బహిరంగ మలవిసర్జన చేసేవారన్నారు. దేశం మొత్తం మీద ఏ గ్రామంలోనూ మరుగుదొడ్లు లేవన్నారు. నేడు మరుగుదొడ్లు లేని ఇల్లు లేదంటే ఆ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు.

ఇదివరకు ఎక్కడ చూసినా సిమెంటు రహదారులే కనపడుతుందేవని, చాలావరకు చెట్లు తగ్గిపోయాయని దాంతో భూగర్భ జలాలు తగ్గిపోయి ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు.

ఆ సమయంలో తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయన్నారు. చెట్లు నాటడం వలన అందరికీ ఆక్సిజన్ లభించడమే కాకుండా ఉష్ణోగ్రతలు తగ్గుతాయన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి గత సంవత్సరం అక్టోబరు 2 వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా నగరంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

నగరంలోని జాతీయ కళాశాల సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ వలన విపరీతమైన దుర్గంధం వస్తు చాలా మంది ప్రజలు అనారోగ్యం పాలయ్యారన్నారు.

తమ ప్రభుత్వం వచ్చాక ఆ డంపింగ్ యార్డ్ లో ఇప్పటివరకు దాదాపు 75 శాతం శుభ్రం చేశామన్నారు. ఇంకా 25

శాతం వచ్చే అక్టోబర్ గాంధీ జయంతి నాటికి శుభ్రం చేసి అక్కడ ఒక పార్కును అభివృద్ధి చేస్తామన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో వినాయక చవితి వేడుకలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 23, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 27నుండి వినాయకచవితి ఉత్సవాలు 29వ తేదీ వరకు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. శ్రీ నటరాజస్వామి వారి ఆలయ ప్రాంగణంలో వున్న శ్రీ గణపతి స్వామి వారి ఆలయం నందు, కొండపైన చిన్న రాజగోపురం వద్ద వేంచేసియున్న శ్రీ మహాగణపతి స్వామివారికి (మృత్తికా గణపతిని ఇక్కడ ఏర్పాటు), చేసి ఉత్సవాలు చేస్తామన్నారు. 27న ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, కలశస్థాపన, శ్రీ గణపతి హోమం, కథా శ్రవణం కార్యక్రమాలను చిన్నరాజగోపురం వద్ద నిర్వహిస్తామని సాయంత్రం 4 గంటలకు ఆవాహన దేవతా హోమాలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయన్నారు. 28 ఉదయం 8 గంటలకు శ్రీ గణపతి హోమం సాయంత్రం 4 గంటలకు ఆవాహన దేవతా హోమాలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయన్నారు. 29 ఉదయం 9.30 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 5 గంటలకు మృత్తికా గణపతి స్వామివార్లను నిమజ్జనం నిర్వహిస్తామని భక్తులు పాల్గొని శ్రీ స్వామివార్ల కృపకు పాత్రులవ్వాలన్నారు.

- అభివృద్ధి పనుల వేగవంతం: దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు రాబోయే దసరా ఉత్సవాల సందర్భంగా వేగవంతం చేయాలని ఇఓ వికె శీనా నాయక్ ఆదేశించారు. శనివారం ఆయన ఆలయంలోని మహామండపంలో జరుగుతున్న అన్నదాన తాత్కాలిక ఏర్పాట్లు పరిశీలించి సూచనలు చేశారు. అదేవిధంగా మహామండపం వద్ద రెండో మొబైల్ డిపాజిట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కనకదుర్గానగర్ వద్ద ఇటీవల స్వాదీనం చేసుకున్న ఆలయ స్థలంలో కొత్తగా క్లోక్‌రూం, చెప్పుల స్టాండ్, సమాచార కేంద్రం ఏర్పాటు చేయడానికి ఇఓ అధికారులతో చర్చించారు. - దుర్గమ్మ సేవలో ఏపి హైకోర్టు జడ్జిలు: దుర్గమ్మవారిని శనివారం ఏపి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జ్యోతిర్మయి, జస్టిస్ గోపాలకృష్ణా రావు, జస్టిస్ కె సురేష్ రెడ్డి లు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



హైకోర్టు జడ్జి జస్టిస్ కె సురేష్‌రెడ్డికి దుర్గమ్మ వారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం



హైకోర్టు జడ్జి జస్టిస్ గోపాల కృష్ణారావు దంపతులకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

- సెప్టెంబర్ 7న చంద్రగహణం సందర్భంగా ఆలయం మూసివేత: సెప్టెంబర్ 7వ తేదీ చంద్రగ్రహణం సందర్భంగా దుర్గమ్మవారి ఆలయంతో పాటు ఉపాలయాల్లోని ఆలయాలను మధ్యాహ్నం 3 గంటలకు కవాటబంధనం చేసి , 8 వ తేదీ ఉదయం స్నపనాభిషేకాలు, అర్చన తదితర కార్యక్రమాల అనంతరం ఉదయం 8.30గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

# వైఎస్సార్సీ ఎప్పటికీ ప్రజల పక్షమే

## - పార్టీ సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి



**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు తమ పార్టీ ప్రచార విభాగం పనిచేస్తుందని వైఎస్సార్‌సీపీది ఎప్పటికీ ప్రజల పక్షమేనని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేసారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, అన్ని జిల్లాల ప్రచార విభాగం అధ్యక్షుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పబ్లిసిటీ వింగ్ ఆకాశమే హద్దుగా పనిచేయగలగాలి ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. ఎప్పటికీ ప్రజలు వైఎస్సార్‌సీపీపక్షమే అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం కీలకమైన విభాగమన్నారు. అన్ని అనుబంధ విభాగాలలో కూడా ఈ విభాగం సభ్యులు చురుగ్గా పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.. ప్రజల్లోకి విస్తృతంగా వెళ్ళడానికి మీకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పబ్లిసిటీ వింగ్‌లో మనకు ఉన్న అవకాశాన్ని వినియోగించుకుని ఎంత ఉత్సాహంగా పనిచేయగలిగితే అంత గుర్తింపు వస్తుంది. ఆకాశమే హద్దుగా మనం పనిచేసే అవకాశం ఈ విభాగంలో ఉంటుంది. ఈ వింగ్‌లో కష్టపడి పనిచేసి తగిన గుర్తింపు తెచ్చుకునే అవకాశాలు కూడా మీకు ఎక్కువగా ఉంటాయి. పార్టీని బలోపేతం చేయడం కోసం ఈ విభాగం ఎంతవరకు ఉపయోగపడుతుందనేది మీరు అంచనాలు వేసుకుని తగిన విధంగా పనిచేయగలిగేలా ఉండాలి. ఇందుకు తగిన విధంగా కమిటీల నియామకం జరగాలి. పార్టీ లైన్‌కి తగ్గట్లుగా ముందుకెళుతూ విస్తృతంగా ప్రచారం చేయాలి. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచడంలో ముందుండి ఉత్సాహంగా పనిచేయాలి. క్రియాశీలకంగా పనిచేసే సైన్యంలో మీరు భాగస్వాములవ్వాలి. చంద్రబాబు తప్పుడు ప్రచారంతో, అబద్దాలను నిజమని నమ్మించడంలో ముందుంటారు. మన పార్టీ ప్రజల పక్షంగా ఉంటుంది కానీ ఎప్పుడూ తప్పుడు ప్రచారాలను నమ్ముకోలేదు. ప్రజల అభిప్రాయలకు అనుగుణంగా మనం ముందుకెళ్ళాలి. రాష్ట్రాన్ని దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత జగన్ గారిది. చంద్రబాబు అబద్దపు మాయా ప్రపంచాన్ని ప్రజల ముందు తేటతెల్లం చేయాలి,

పార్టీ అనుబంధ విభాగాలన్నీ ఒక్క తాటిపైకి వచ్చి పార్టీని, అధినేతను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్ళాలి. నిర్మాణాత్మకంగా కమిటీల నియామకం చేసుకుని ముందుకెళదామని సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ పబ్లిసిటీ వింగ్‌కు దిశానిర్ధేశం చేశారు,రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ పి.హరిప్రసాద్ రెడ్డి, పలువురు నాయకులు.

## స్పేస్ టెక్ అకాడమీ అధ్యక్షునిగా సుబ్బారావు

**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ స్పేస్ టెక్ అకాడమీ అధ్యక్షునిగా సుబ్బారావును నియమించారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లపూడి లోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో టీం సిఈఓ-స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ,డీన్ ప్రమోషన్స్ అండ్ కొలాబరేషన్స్ సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవంలో ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ అకాడమీ (ఏపీఎస్ఏ)ని ఏర్పాటు చేశారు. ఈ అకాడమీకి అధ్యక్షునిగా హైదరాబాద్ లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు పావులూరి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు మొదటి వారంలో అమరావతిలో తొలి ఏపీ స్పేస్ టెక్ సదస్సు నిర్వహిస్తామని వెల్లడించారు. విద్యావేత్తలు,పరిశ్రమల అధిపతులు,పాలసీ రూపకర్తలు,ఆవిష్కర్తలు ఒకే వేదిక పైకి చేరి సాంకేతిక పురోగతిని ప్రదర్శిస్తారని,తదుపరి తరానికి ప్రేరణగా నిలుస్తారని చెప్పారు. ఫలితంగా అమరావతి ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. అంతరిక్ష విప్లవంలో ఏపీని అగ్రగామిగా నిలుపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గౌరవ అతిథిగా హాజరైన శ్రీహరికోట లోని మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వి.శేషగిరిరావు మాట్లాడుతూ...దేశీయ ఉపగ్రహ నామినేషన్ వ్యవస్థ విశ్వసనీయ మార్గదర్శిగా నిలుస్తోందన్నారు. త్వరలోనే మానవ సహిత గగన్‌యాన్ మిషన్ ద్వారా భారత్ జెండా అంతరిక్షంలో ఎగురబోతోందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ లోని జెఎన్టీయూ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐవి మురళీకృష్ణ,ఏఎస్‌టీసీ కార్యదర్శి సిఎల్ నర్సింహారావు,విట్ ప్రొఫెసర్ జె.శ్రీనివాసరెడ్డి,విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ పి.నాగభూషణ్,సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాలను అవమానపరిస్తే కఠిన చర్యలు

### - ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్త ప్రతినిధి:** కైకలూరులో వంగవీటి మోహన్‌రంగా విగ్రహం పట్ల గుర్తుతెలియని దుండగులు దుశ్చర్యకు పాల్పడటాన్ని సీఎం చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో రంగా విగ్రహాన్ని అవమానపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అభిమానుల మనోభావాలు దెబ్బతినేలా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ ఘటనలో నిందితులను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. నేతల విగ్రహాల పట్ల అవమానకర చర్యలకు పాల్పడేవారికి గట్టి గుణపాఠం చెప్పేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు.

# కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

**రాపూరు (నెల్లూరు), జూలై 23, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ,చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చిఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

## కొత్త బార్ పాలసీలో అప్లికేషన్ ఫీజు రీఫండ్ పై ప్రభుత్వం క్లారిటీతో ఉంది: ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్ కుమార్

**విజయవాడ ఆగస్టు 23,ప్రభాతవార్తప్రతినిధి:** కొత్త బార్ పాలసీ 2025-28 కింద ఏదైనా బార్‌కు నాలుగు దరఖాస్తులు రాకపోవడం వల్ల లాటరీ జరగకపోతే, అభ్యర్థులు చెల్లించిన అప్లికేషన్ ఫీజు తిరిగి చెల్లిస్తామని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ , ప్రొహిబిషన్ కమీషనర్ నిషాంత్ కుమార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కచ్చితమైన క్లారిటీతో ఉందన్నారు కొత్త పాలసీ ప్రకారం ఓపెన్ కేటగిరీలో 840 బార్లు, రిజర్వ్ కేటగిరీ (గీతకులాలు)లో 84 బార్లు లాటరీ ద్వారా కేటాయించబడతాయి. ఒక బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు రావాలి అనే నిబంధన ఉంది. ఒకవేళ లేకపోతే నాలుగు దరఖాస్తులు రాకపోతే లాటరీ నిర్వహణ జరగదని, దాని తేదీ పొడిగిస్తారని గతంలో విడుదల చేసిన రూల్స్ పేర్కొన్నాయి. అయితే అప్లికేషన్ ఫీజు (రూ. 5 లక్షలు) రీఫండ్ అవుతుందా లేదా అన్న విషయంలో అభ్యర్థుల్లో అనుమానాలు వచ్చాయి. మరోవైపు ఫీల్డ్ ఆఫీసర్లు కూడా ఈ అంశంపై సూచనలు కోరారు. దీనిపై నిషాంత్ కుమార్ స్పష్టత ఇస్తూ,"నాలుగు దరఖాస్తులు రాకపోవడం వల్ల డ్రా జరగకపోతే అభ్యర్థులకు అప్లికేషన్ ఫీజు తప్పనిసరిగా తిరిగి ఇవ్వబడుతుదన్నారు. ఫీల్డ్ ఆఫీసర్లు ఈ విషయాన్ని అందరికీ తెలియజేసి, మరింత మంది అభ్యర్థులు దరఖాస్తు చేసేలా చూడాలని కమీషనర్ ఆదేశించారు.

## ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు

### -విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. యూరియాను దారి మళ్లించడం, అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడం చట్ట విరుద్ధమే కాకుండా రైతులకు ఇబ్బంది కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యాప్తంగా గోదాములు, హోల్ సేల్ డీలర్లు, రిటైల్ షాపులపై విజిలెన్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిల్వలు, పంపిణీ జరుగుతున్నాయా లేదా అనే దానిపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. యూరియా అక్రమ నిల్వలు లేదా దారి మళ్లింపుకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు సమీపంలోని విజిలెన్స్ కార్యాలయానికి తెలపాలని ఆయన కోరారు.

## సురవరం మృతిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ విచారం

**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్తప్రతినిధి:** సీపీఐ సీనియర్ నేత, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. సుధాకర్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, సుధాకర్ రెడ్డి సేవలను గుర్తుచేసుకున్నారు. విద్యార్థి దశ నుంచే పోరాట పంథాను ఎంచుకున్న ఆయన, చివరి వరకు ప్రజల కోసమే పనిచేశారని కొనియాడారు. ముఖ్యంగా రైతులు, కార్మికుల సమస్యలపై ఆయన బలంగా గళం వినిపించారని వివరించారు. లోక్ సభ సభ్యుడిగా దేశానికి, తన ప్రాంతానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు.

నల్గొండ ప్రాంతంలో ఫ్లోరోసిస్ మహమ్మారి, సాగునీటి కొరత, కరవు పరిస్థితులపై సుధాకర్ రెడ్డి చేసిన పోరాటాలు చిరస్మరణీయమని పవన్ కల్యాణ్ అన్నారు.

మూడు పర్యాయాలు సీపీఐ జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అభిప్రాయపడ్డారు.

ఆయన లేని లోటు పూడ్చలేనిదని, ఆయన కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# డిక్లరేషన్ ఇస్తేనే స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు!

## ఈ యేడాది నుంచి అమలు

## జిల్లాలతోపాటు మండలస్థాయిలోనూ ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 23:** తెలంగాణ రాష్ట్రంలో స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డుకి దరఖాస్తు చేసుకున్న వారు గతంలో తనకి అవార్డు రాలేదని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా డిక్లరేషన్ ఇచ్చిన వారిని మాత్రమే స్టేట్ బెస్ట్ టీచర్‌గా ఎంపిక చేయనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్య శాఖ తయారు చేస్తున్నట్టు తెలిసింది. ఒక్కరికే రెండు సార్లు బెస్ట్ టీచర్ అవార్డు ఇవ్వొద్దనే ఉద్దేశంతోనే ముందుగానే డిక్లరేషన్‌ను కోరుతున్నట్టు పాఠశాల విద్య శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు కోసం ఉపాధ్యాయుల నుంచి మండలస్థాయిలోని పాఠశాలల నుంచి మండల విద్యాధికారి(ఎం ఈవో) దరఖాస్తులను స్వీకరిస్తారు. మండలస్థాయిలోని ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను రాష్ట్రస్థాయి అవార్డు కోసం రూపొందించిన ప్రొఫార్మా ప్రకారం భర్తీ చేసినట్టయితేనే వాటిని జిల్లా విద్యాశాఖాధికారి(డిఈవో)కి పంపిస్తారు. తమకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన డిఈవోలు వాటిల్లో స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డుకి అర్హత ఉన్నవాటిని గుర్తించి వాటిని పాఠశాల విద్య శాఖకి పంపిస్తారు. అలా రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో బెస్ట్ స్టేట్ టీచర్ అవార్డుకి అర్హులైన వారిని బెస్ట్ టీచర్ అవార్డుల ఎంపిక కమిటీ నిర్ణయిస్తుంది. అయితే స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డును ఒక్కరికి ఒక్కసారి మాత్రమే ఇవ్వాలని భావిస్తున్న పాఠశాల విద్య శాఖ అధికారులు.. ఇకపై స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు కోసం వచ్చిన దరఖాస్తుల్లో గతంలో తనకి బెస్ట్ టీచర్ అవార్డు రాలేదని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అలా డిక్లరేషన్ ఇచ్చిన వారికి మాత్రమే ఈ ఏడాది నుంచి స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డుకి ఎంపిక చేయనున్నారు.

**మండలస్థాయిలోనూ ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం.** సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఈఏడాది నుంచి జిల్లా, మండల స్థాయి ల్లోనూ ఘనంగా నిర్వహించాలని పాఠశాల విద్య శాఖ నిర్ణయిం చింది. ఈఏడాది రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహించే రవీంద్రభారతిలో కాకుండా మాదాపూర్‌లోని శిల్పాకళా వేదికలో ఘనంగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.

అలాగే జిల్లా స్థాయిలోనూ.. మండల స్థాయిలో కూడా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో నిర్వహించడానికి రూ. 15000 మండలస్థాయిలో నిర్వ హణకి రూ.5000నిధులను కేటాయించనున్నట్టు తెలుస్తోంది.

# రాజ్యాంగంపై గౌరవం ఉంటే సుదర్శన్ రెడ్డికే ఓటు వేయాలి

## చంద్రబాబు. నితీష్ ఆలోచించుకోవాలి:ఎంపీ మల్లు రవి

**హైదరాబాద్,ఆగస్టు 23,ప్రభాతవార్త:** రాజ్యాంగంపై గౌరవం ఉంటే ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికే ఓటు వేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి పిలుపునిచ్చారు. బిజెపి నిరంకుశ పాలనను కట్టడి చేసే సందర్భం ఇదేనని స్పష్టం చేశారు.

శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి ఎన్నికలు రెగ్యులర్‌గా జరిగేవి కావు. జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరుగుతోంది. బీహార్‌లో ఓట్ల గురించి దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయని మల్లు రవి వ్యాఖ్యానించారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి నక్సలైట్లకు సపోర్ట్ అని హోంమంత్రి అమిత్ షా స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయొచ్చా,

దీని ద్వారా కూడా లబ్ధిపొందాలని చూస్తున్నారు.

చంద్రబాబు, నితీష్ కుమార్ బిజెపికి సపోర్ట్ చేస్తున్నారు కానీ ఏకపక్షంగావ్యవహరించే బిజెపికి గుణపాఠం చెప్పేసమయం ఇదే వారు ఆలోచించుకోవాలన్నారు.

# సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## యుఎస్‌పిసి మహాధర్నాలో వక్తల డిమాండ్



శనివారం ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించి, రాష్ట్ర ప్రభుత్వం విశ్వసనీయత నిలుపుకోవాలని యుఎస్‌పీసీ మహాధర్నాలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ నాగేశ్వర్, ఏ.నర్సిరెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, అరుణోదయ విమలక్క, పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు ఎల్.అరుణమ్మ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగ సమస్యలను నిర్లక్ష్యం చేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఆశించారని, కానీ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచిపోతున్నా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం జాప్యాన్ని ప్రదర్శిస్తోందని ఆరోపించారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను సైతం అమలుపరచటం లేదని విమర్శించారు. విద్యాశాఖలో ఎన్జీవోల జోక్యాన్ని నివారించాలని, నూతన జిల్లాలకు డిఈఓలను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటి ఈఓను, నూతన మండలాలకు యంఈఓ పోస్టులను మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూపొందించి, ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యూపీఎస్పీ స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, సిహెచ్ అనిల్‌కుమార్, ఎం.సోమయ్యలు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా సమస్యలు పరిష్కారం కాలేదని, అందుచేతనే ఉద్యమ కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షం భవిష్యత్తులో ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు.

## సుదర్శన్‌రెడ్డిపై ఆరోపణలు తగదు: మాజీమంత్రి జీవన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** నక్సల్ సానుభూతి పరుడిగా సుదర్శన్ రెడ్డిపై బిజెపి నేతల ఆరోపణలు చేయడం తగదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు.గాంధీ భవన్ మీడియా సమావేశం శనివారం మాట్లాడుతూ ఇండి కూటమి అభ్యర్థికి వస్తున్న ఆదరణ చూసి బీజేపీ నేతలు బెంబేలెత్తి పోతున్నారనిచెప్పారు. రాబోయే ఉప రాష్ట్రపతి ఉప ఎన్నికల్లో ఇండి కూటమి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి రోజురోజుకు పార్టీలకు అతీతంగా ఆదరణ మద్దతు పెరుగుతుండటంతో తట్టుకోలేక బిజెపి నేతల అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. హింసకు హింస సమాధానం కాదని సుదర్శన్‌రెడ్డి భావిస్తారన్నారు. రాజ్యాంగ విలువలు ప్రజాస్వామ్య విధానానికి కట్టుబడి ఉన్న వ్యక్తి సుదర్శన్ రెడ్డి అభ్యర్థితత్వం పట్ల హర్షం వ్యక్తం చేయాల్సింది పోయి ఆరోపణలు చేయడం విచారకరమన్నారు. సుదర్శన్ రెడ్డి సోషలిస్టు భావాలు గల వ్యక్తి అని, ఆయన అభ్యర్థితత్వం పట్ల ఆత్మ ప్రబోధానికి అనుగుణంగా మద్దతుతెలిపి గెలిపించాలనికోరారు.తీవ్రవాదాన్ని వ్యతిరేకించే పార్టీ ల్లో కాంగ్రెస్ ప్రథమస్థానంలో ఉంటుందని చెప్పారు.

### బిసి సంక్షేమంలో పదోన్నతులు

## 13 మంది జిల్లా అధికారులకు ఛాన్స్

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:**రాష్ట్రం లోని బీసీ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వారిలో 13 మంది జిల్లా బీసీ సంక్షేమాధికారులకు ప్రమోషన్లు లభించాయి. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇవన్నీ అడ్ హక్ బేస్డులో ఉంటాయని ప్రకటించారు. కాగా, జూన్ నెలాఖరున 13 మందికి ప్రమోషన్లు ఇచ్చేందు కు జిల్లా పదోన్నతుల కమిటీ (డీపీసీ) ఆమోదం తెలిపింది. అయితే, ప్రమోషన్లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు తాజాగా పదోన్నతుల కల్పిస్తూ కీలక నిర్ణయం తీసున్నారు. ఈ నేపథ్యంలో ఇరువురు జిల్లా అధికారులు పదవీ విరమణ చేసే రోజునే పదోన్నతులు లభించాయి. మిగిలిన 11 మందికి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని మల్టీజోన్ పరిధి 1లో ఆరుగురు, మల్టీ జోన్ పరిధి 2లో ఐదుగురికి ప్రమోషన్లు లభించాయి. ఈ పదోన్నతులు పొందిన జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారుల్లో భూపాలపల్లి జిల్లా అధికారి ఇందిర, సిరిసిల్లా జిల్లా అధికారి సంపూర్ణ, సిద్దిపేట్ జిల్లా అధికారి సయ్యద్ రఫీక్, బిసి కమిషన్‌లో పనిచేస్తున్న అధికారి సునీత, కొత్తగూడెంజిల్లా అధికారి విజయ లక్ష్మి, కామారెడ్డి జిల్లా అధికారి కె.జైరాజు, వనపర్తి జిల్లా అధికారి ముజాహిద్ ఖాన్, సూర్యాపేట్ జిల్లా అధికారి నర్సింహులు, గద్వాల జిల్లా అధికారి అక్బర్ పాషా, వికారాబాద్ జిల్లా అధికారి మాధవ్‌రెడ్డి, జనగామ జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి లక్ష్మి నరసింహారావుకు పోస్టింగులు ఇచ్చారు.

## ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు త్వరగా పూర్తి చేయాలి

### వ్యవసాయ మంత్రి తుమ్మల



**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని నర్మెట్టలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులను త్వరగా పూర్తి చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అలాగే కల్లూరుగూడం, బీచుపల్లిలో జరుగుతున్న ఆయిల్ పామ్ మిల్లుల నిర్మాణ పనులను వచ్చే ఏడాది జూన్ కల్లా పూర్తి చేయాలన్నారు. హైదరాబాద్ సచివాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ అనుకున్న స్థాయిలో జరగకపోవడం పట్ల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలలో పురోగతి కొంతమేర ఉందని, ముఖ్యంగా భువనగిరి, నారాయణపేట, గద్వాల, జనగామ, సిద్దిపేట జిల్లాలలో చాలా తక్కువ స్థాయిలో ప్లాంటేషన్ జరిగిందని వాటిని త్వరితగతిన చేయాలన్నారు. ఈ ఏడాది లోగా అన్ని కంపెనీలు కలిపి ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం 1.25 లక్షల ఎకరాలలో ప్లాంటేషన్ పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే భవిష్యత్తులో ప్రతి జిల్లాలో కనీసం 1 లక్ష ఎకరాలలో ఆయిల్ పామ్ తోటలు సాగులో ఉండేలా ప్రణాళిక చేసుకోవాలని స్పష్టం చేశారు. కూలీల ఖర్చు తగ్గించుకోవడానికి ఫర్టిగేషన్ పద్ధతిలో ఎరువుల యాజమాన్యం చేసుకోవడంపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. నర్సరీ స్థాయిలోనే కల్లింగ్ మొక్కలను నిర్మూలించాలని ఆయిల్ పామ్ మొక్కలకు కొరత లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్ గెలలను కోసేందుకు రైతులకు మలేషియా ఫైబర్ స్టిక్స్‌ను అమ్మకాలకు మరియు కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా గడ్డిని తొలగించే యంత్రాలు (స్లాషర్స్), ఆయిల్ పామ్ కోత అనంతరం వచ్చే ఆకుల వ్యర్థాలను పొడిగా చేసే యంత్రాలు (ష్రెడ్డర్స్) అద్దెకు ఇచ్చేట్టు రైతులకు అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. గత 10సంవత్సరాలుగా జరిగిన ఖర్చులపై ఆడిట్ నిర్వహించి, ఆ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి,హార్టికల్చర్ సంచాలకులు యాస్మిన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## 25 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే..

### రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన

### తెలంగాణా కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ



శనివారం జరిగన సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, పల్లెరవికుమార్‌గౌడ్, ఐలి వెంకన్నగౌడ్, బాలరాజుగౌడ్ తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో గౌడ్‌లకు ఇచ్చిన హామీ లను నెరవేర్చాలని జీవో 93 సవరించి వైన్స్‌లల్లో 15 శాతం ఉన్న రిజర్వేషన్లు 25శాతానికి పెంచాల్సిందేనని లేకుంటే ఈనెల 25నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలంగాణ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ హెచ్చరించింది. ఈమేరకు శనివారం హైదరాబాద్ సోమజిగూడా ప్రెస్ క్లబ్ లో తెలంగాణా గౌడ కల్లుగీత వృత్తి దారుల సంఘం అధ్యక్షుడు ఐలి వెంకన్నగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజు గౌడ్‌తో పాటురాష్ట్రంలోని వివిధ సంఘాల నాయకులు హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఎన్నో హామీలిచ్చారని జీవోల ద్వారా అయ్యే పనులు కూడా రేవంత్ ప్రభుత్వం చేయడం లేదన్నారు. 21 నెలల కాంగ్రెస్ పాలనలో గీత కార్మికులు చాలా మంది ప్రమాదశావత్తు మరణించారని పన్నెండు కోట్ల రూపాయల మేర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాల్సి ఉన్నా చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. ఈసందర్భంగా ఉమ్మడి కార్యాచరను శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. ఈనెల 25న ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి వనతిపత్రం ఇవ్వడం జరుగుతుందని ఆతర్వాత 30న నదనం, ఖిలాషాపూర్‌లకు వందకార్ల ర్యాలీతో వెళ్తామన్నారు. ఆతర్వాత ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం ముట్టడి, జిల్లా ల్లో గౌడ్‌సంఘాల సభలు నిర్వహించి అనంతరం ఇందిరాపార్కు వద్ద గౌడమహా ధర్నా, ఆతర్వాత 5లక్షల మందితో పరేడ్‌గ్రౌండ్‌లో గౌడ ఆత్మ గౌరవ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో కలకలం

# విభేదాలతో పిల్లల మీద ప్రయోగాలు చేస్తే కఠిన చర్యలు

### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

### తాగునీటిలో మోనో కలపడంతోనే విద్యార్థులకు అస్వస్థత

### ఉపాధ్యాయుడు రాజేందర్‌తో పాటు వేణు, సూర్య ప్రకాష్, వంట మనిషి రాజేశ్వరి సస్పెన్షన్

### వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శిస్తున్న అధికారులు తదితరులు

**ప్రభాతవార్త, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:**విభేదాలతో పిల్లల మీద ప్రయోగాలు చేస్తే కఠిన చర్యలతో పాటు పోలీస్ కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో శుక్రవారం కలుషిత మంచినీరు తాగి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే శనివారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఘటనపై విద్యార్థులను అడిగి తెలు సుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో జరుగుతున్న అనేక విషయాలను వెల్లడించారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రాజేందర్ మంచినీటిలో మోనో పురుగుల మందు కలపడంతో విద్యార్థులు ఆ నీటిని తాగి అస్వస్థతకు గురయ్యామని తెలిపారు. ఉపాధ్యాయులు తమను నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇష్టం వచ్చినట్లు కొడుతున్నారని తెలిపారు. అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు మధ్య తరచూ జరుగుతున్న గొడవలే దీనికి కారణమని ఎమ్మెల్యే తెలిపారు. పాఠశాల సైన్స్ టీచర్ రాజేందర్ మంచినీటి ట్యాంకులో మోనో పురుగుల మందు కలిపి అనుమానం రాకుండా చేసేందుకు అనంతరం దాన్ని విద్యార్థుల దుప్పట్లపై చల్లాడని తెలిపారు. చూసిన విద్యార్థులను బెదిరించి ఈ విషయం బయటికి చెప్తే కొడతానని హెచ్చరించాడని తెలిపారు. రాజేందర్ ఎవరికి అనుమానం రాకుండా అస్వస్థత గురైన విద్యార్థులతో పాటు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చేరి వైద్య సేవలు పొందుతున్నాడని తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులను, వంట మనిషిని సస్పెండ్ చేయడంతో పాటు చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని శాసనసభ్యులు సత్యనారాయణ రావు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మంచినీటిలో పురుగుల మందు కలిపిన ఉపాధ్యాయుడు రాజేందర్‌తో పాటు వేణు, సూర్య ప్రకాష్, వంట మనిషి రాజేశ్వరిని తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇలాంటి ఘటనలకు పాల్పడితే ఉద్యోగం నుండి తొలగించడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేసి రిమాండ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. 24 గంటలు నిరంతరాయ వైద్య సేవలు అందించాలని, వైద్యుల పర్యవేక్షణ ఉండాలని ఎమ్మెల్యే వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త లబ్ధిదారులకు సన్నబియ్యం

### 19,7621.368 మె.టన్నుల కేటాయింపు

**హైదరాబాద్,ఆగస్టు 23,ప్రభాతవార్త:** కొత్తగా రేషన్ కార్డులు పొందినవారు, పాత కార్డుల్లో నూతనంగా పేర్లు నమోదైన వారందరికీ సెప్టెంబరు రేషన్ బియ్యం పంపిణీకి రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ యంత్రాంగం సన్నద్ధం అవుతోంది.రాష్ట్రంలోని లబ్ధిదారులందరికి సన్నబియ్యం అందించడానికి 19,7621.368 మె.ట బియ్యం మండల స్టాక్ పాయింట్లకు చేర్చారు.జూన్ నెలలో మూడు నెలల రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు ఒకే సారి పంపిణీ చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 4,92,395 కొత్తగా రేషన్‌కార్డులు జారీ చేశారు.15లక్షలకు పైగా కొత్తగా కుటుంబంలో పెరిగిన లబ్ధిదారులను పాతకార్డులలో చేర్చినారు. రాష్ట్రంలో పెరిగిన ఆహార భద్రత కార్డుల్లోని సభ్యుల సంఖ్యకనుగుణంగా సన్నబియ్యం పంపిణీ చేయాల్సి ఉండటంతో ఆ మేరకు పౌరసరఫరాల శాఖ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రేషన్‌కార్డులకు అనుగుణంగా, మండలస్థాయి గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యానికితోడు అదనంగా కావాల్సిన బియ్యం సరఫరా జరుగుతోంది. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన కోటాకు సంబంధించిన డైనమిక్ కీ రిజిస్టర్లు విడుదల చేశారు. జనవరి నుంచి కొత్తకార్డులు, సభ్యుల చేర్పులు ప్రారంభమైనప్పటికీ జూన్ నెల తదుపరి కొత్తగా కార్డులు తీసుకున్నవారు, యూనిట్లలో లబ్ధిదారులు మూడు నెలల బియ్యాన్ని పొందలేకపోయారు ఈ వ్యవధిలో పెరిగిన కార్డులకనుగుణంగా బియ్యం కోటాను పెంచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నంచి పదేళ్ళుగా రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ కార్డుల జారీ తెర తీసింది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు,పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల ఆదాయం ఉన్న వారే అర్హులుగా నిర్ణయించింది.ఈ మేరకు అన్నింటినీ పరిశీలించి కార్డులు మంజూరు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా డీలర్లకు ఈనెల 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు బియ్యం చేరిన తర్వాత వచ్చేనెల మొదటి వారంలో కోటా పంపిణీ ప్రారంభమవుతుంది. మెదక్ జిల్లాలో కొత్తకార్డులు 15,863 కాగా కొత్తగా పాతకార్డులలో చేరిన కుటుంబసభ్యులు 33,354 మంది. వీరికి 327.210 మె.ట బియ్యం అందించాల్సి ఉంటుంది.మొత్తం కార్డులు 2,32,579 ఉండగా, 7.65,244సభ్యులు ఉన్నారు.వీరికి 4,850.008 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని మెదక్ అధికారులు గుర్తించారు. కామారెడ్డి జిల్లాలో జిల్లా వ్యాప్తంగా 26,521 కొత్త కార్డులు పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 4,66,552 రేషన్ కార్డులున్నాయి.రాష్ట్రరాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో లక్ష కుటుంబాలకు కొత్తగా లబ్ది కలగబోతున్నది. నగరంలో 60లక్షల మంది లబ్దిదారులు ఉన్నారు.ఆదిలాబాద్ జిల్లాలో కొత్తకార్డు దారులకు వచ్చే నెలనుంచి 255మె.ట బియ్యంఅదనంగా కేటాయించాలని నిర్ణయించారు. ఖమ్మంజిల్లాలో 4,11,143 కార్డులు గతంలో ఉండగాకొత్తగా 452758కి పెరిగింది. బియ్యం కోటా 7,273.164 మె.ట నుంచి 8145.723 మె.ట బియ్యం కోటాను పెపంచారు. కొత్తగా872.559 మె.టబియ్యం కోటా అదనంగా విడుదలచేశారు. ఇలా ప్రతి జిల్లాలో మదింపు చేసి కొత్తగా అదనపు స్టాక్ విడుదలచేశారు. మండల స్థాయిలో పేర్ల నమోదు, తొలగించే ప్రక్రియలో రెవెన్యూ అధికారులు తమ చుట్టూ తిప్పుకొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# పంట రుణాల్లో నాబార్డు కోత

### లక్ష్యాలకే కేటాయింపులు పరిమితం

### సాగు పెరుగుతున్నా మంజూరు అంతంతే

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** పంట రుణాల విషయంలో జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) ఎంచుకున్న లక్ష్యాలు క్షేత్ర స్థాయిలో అందుకోవడం లేదు. ఇదే సమయంలో రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు కొన్నేళ్లుగా గణనీయంగా పెరుగుతుండగా, అందుకు అనుగుణంగా రైతుకు ఇచ్చే రుణాల విషయంలో మాత్రం బ్యాంకులు లక్ష్యాలకు దూరంగానే ఉంటున్నాయి. 2025-26 సంవత్సరానికిగాను తెలంగాణలో 3.86 లక్షల కోట్ల రూపాయలను రుణాలగా ఇవ్వగలనే లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఇందులో కేవలం పంటలకు సంబంధించి పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ నిమిత్తం 87,149 కోట్ల రూపాయలను మాత్రమే కేటయింపులు జరిపింది. ఈ మొత్తం 2024-25లో పెట్టుకున్న రూ.90,794 కోట్ల లక్ష్యం కంటే 3,645 కోట్ల రూపాయలు తక్కువ కావడం విశేషం. ఇక పంటలకు సంబంధించి ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్‌కు 2024-25 లక్ష్యాని కన్నా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 3,645 కోట్ల రూపాయలను తక్కువగా రుణ అంచనాగా కేటాయింపులు జరిపినట్లు వెల్లడించినప్పటికీ నాబార్డ్ అంతకుముందు మూడేళ్ల కూడా పంటలకు ఇచ్చే రుణాల విషయంలో లక్ష్యాలను చేరుకోలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 73,437 కోట్ల రూపాయల మేర రుణ లక్ష్యం విధించుకోగా 64,939 కోట్ల రూపాయల చొప్పున మాత్రమే రుణాలను మంజూరు చేశాయి. అంటే 8,500 కోట్ల రూపాయలు తక్కువ ఇచ్చింది. అలాగే 2024-25లో 90,794 కోట్ల రూపాయల లక్ష్యంగా పెట్టుకోగా, ఇందులో 70శాతం మాత్ర మే రుణాలు మంజూరయ్యాయి.2021-22లో పంట రుణాల కింద 59,440 కోట్ల రూపాయలు లక్ష్యంగా నిర్ణయించుకొని కేవలం 42,854 కోట్లు రూపాయలను మాత్రమే మంజూరు చేసింది. 2022-23లో 67,764 కోట్ల రూపాయల

# మరోసారి అధికారం కోసం ఓట్లను తగ్గించారు

### పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు




ఓటు బచావో ర్యాలీ నిర్వహించి అనంతరం జరిగిన సభలో మాట్లాడుతున్న వి.హనుమంతరావు, చిత్రంలో డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** దేశంలో మరోసారి అధికారంలోకి రావాలనే కుట్రలో భాగంగా 65 లక్షల ఓట్లను తగ్గించారని పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు.నేడు ఓటు హక్కును కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు, అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్ సి.రోహిన్‌రెడ్డితో కలిసి శనివారం నగరంలో ఓటు బచావో ర్యాలీ నిర్వహించారు.అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తా నుండి పటేల్‌నగర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం జరిగిన సభలో విహెచ్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ మూడుసార్లు ప్రధాని కాగా మరో మారు ప్రధాని కావాలని దొంగ ఓట్లకు తెరతీశారని ఆరోపించారు. నరేంద్ర మోడీ మరోసారి పీఎం కావడం కాదు, ప్రజల మద్దతుతో ప్రజల ఓటు వేసుకోవడం గొప్పతనమన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాని కావడానికి కేవలం 25 సీట్లు మాత్రమే తక్కువగా ఉందన్నారు.నేడు దేశంలో మోడీ, అమిత్ షా కలిసి 65 లక్షల ఓట్లను తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారికి పాదయాత్ర చేపట్టి ప్రజల మన్ననలు పొందిన గొప్ప నాయకుడని కొనియాడారు. న్యాయం కోసం పోరాడితే రాహుల్ గాంధీని అరెస్టు చేస్తామని బెదిరించడం సరికాదని హెచ్చరించారు. దేశంలో ఇప్పటికైనా దొంగ ఓట్లను గుర్తించి నిజమైన నాయకుడిని గెలిపిస్తే బాగుపడుతుందని వీహెచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపీసీసీ ఉపాధ్యక్షులు ముజాహిద్ ఖాన్ అఫ్సర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆర్.లక్ష్మణ్ యాదవ్,శంభుల శ్రీకాంత్‌గౌడ్,పులి జగన్, దిండి రాంబాబు, గరిగంటి రమేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

## గణేశ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

### సెప్టెంబర్ 6న నిమజ్జనం

### భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి



**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** భాగ్యనగర్ గణేష్‌ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నగరంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశీధర్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఉపాధ్యక్షులు వైకుంఠం గోవింద్ రాఠి, కార్యదర్శి మహేందర్, కోశాధికారి శ్రీరామ్మో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్లో ఈ సారి 46వ సామూహిక గణేశ్ ఉత్సవాలు జరుగుతున్నాయని, సుమారు 1.40లక్షల గణపతి విగ్రహాలను ప్రతిష్ఠి స్తున్నారని తెలిపారు. నవరాత్రి ఉత్సవాల నుంచి నిమజ్జనం వరకు గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 18 ప్రభుత్వ విభాగాలను సమన్వయ పరుస్తూ నిర్వహిస్తున్నామని తెలిపారు. భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని చాటే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని మండపాల నిర్వహకులను సూచించామని, స్వదేశీ ఉత్పత్తులను వాడాలని అవగాహన కల్పిస్తామన్నారు. సెప్టెంబర్ 6న నిమజ్జనం నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

### బ్లేడ్‌లను మింగిన ఆటో డ్రైవర్

## ప్రాణాలు కాపాడిన గాంధీ వైద్యులు

**సికింద్రాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** మౌలాలికి చెందిన ఆటోడ్రైవర్ రియాజుద్దీన్ మానసిక స్థితి సరిగా లేక మింగిన బ్లేడ్‌లను గాంధీ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా తొలగించారు. ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న రియాజుద్దీన్ ఈ నెల 16న మింగాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. రియాజుద్దీన్ ను పరీక్షించిన జనరల్ సర్జరీ విభాగం వైద్యులు ఆహారం ఇవ్వకుండా కేవలం మందులు ఫ్లూయిడ్స్ ఇస్తూ వచ్చారు. ముందుగా ఎండోస్కోపీ ద్వారా బ్లేడ్లను బయటకు తీయాలనుకున్నా, వాటిని తొలగించే క్రమంలో కడుపులో అన్నవాహిక, జీర్ణాశయం, పేగులకు గాయాలయ్యే ప్రమాదం ఉండే వీలుందని భావించిన వైద్యులు అబ్జర్వేషన్లో ఉంచి వైద్యం చేశారు. అయితే అదృష్టశాత్తు జీర్ణాశయంలో ఎటువంటి గాయాలు కాలేదు. చివరికి మలద్వారం ద్వారా రియాజుద్దీన్ మిగిన 7 బ్లేడ్లు పడిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో క్లిష్టమైన ఈ సమస్యకు అరుదైన వైద్యం అందించి రోగి ప్రాణాలను కాపాడిన వైద్యులు అభినందనలు అందుకున్నారు.

## 24, 25 తేదీల్లో దోస్త్ ఇంట్రా కాలేజ్ ఫేజ్-2

### 26న సీట్ల కేటాయింపు,దోస్త్ కన్వీనర్ ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 23:**తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ఇంట్రా కాలేజ్ ఫేజ్-2కి అవకాశం కల్పించారు. ఈ నెల 24, 25 తేదీల్లో విద్యార్థులకి ఇంట్రా కాలేజ్ ఫేజ్-2 ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించినట్టు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జులై 9, 10తేదిల్లో ఇంట్రా కాలేజ్ ఫేజ్-1కి అవకాశం కల్పించగా.. జులై 11న సీట్ల కేటాయింపు చేశారు. ఇప్పుడు దోస్త్ స్పెషల్ ఫేజ్ ముగిసిన తరువాత ఇప్పుడు ఇంట్రా కాలేజ్ ఫేజ్-2కి అవకాశం కల్పించారు. ఇప్పటివరకు మొదటి, రెండు, మూడు విడతలతో పాటు స్పెషల్ ఫేజ్‌లోనూ కాలేజీల్లో చేరిన విద్యార్థులు ఇంట్రా కాలేజ్ ఫేజ్-2లో ఆప్షన్లు ఇవ్వడానికి అర్హులని పేర్కొన్నారు.

## రాష్ట్రాభివృద్ధిలో బిజెపి ఎంపిల సహకారం ఎప్పుడూ ఉంటుంది

### మంత్రి పొంగులేటితో బిజెపి ఎంపి ఈటల రాజేందర్ సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భారతీయ జనతా పార్టీ ఎంపిల సహకారం ఎప్పటికీ ఉంటుందని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. యూరియా కొరతపై రాజకీయం చేయకుండా రైతులకు అందించే ప్రయత్నం చేయాలన్నారు. అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమస్యలన్నింటిని రెండు నెలల్లో పరిష్కరించాలన్నారు. శనివారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఎంపి ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పలు వినతి పత్రాలు మంత్రికి అందజేశారు. ఈ సమావేశం అనంతరం సచివాలయ మీడియాపాయింట్‌లో ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు విసిరి వేసినట్టు ఎక్కడో దూరంగా ఉన్నాయని, కేటాయింపులు సరిగాజరగలేదన్నారు. కరెంటు సౌకర్యం, రోడ్ల సౌకర్యం, డ్రైనేజీలు, లిఫ్టు సరిగా లేవని, ఈ సమస్యలు పరిష్కారం కాకుండా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాస ఉండటం కష్టంగా ఉందన్నారు. రెండునెలల్లో పరిష్కారం చూపించాలని కోరడం జరిగిందన్నారు. దీనికి మంత్రి సుముకత వ్యక్తం చేశారు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశ అభివృద్ధి ముడిపడి ఉంది అనేది మన ప్రధాని నరేంద్ర మోడీ, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతమన్నారు.

## ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం మార్పు?: కోలేటి దామోదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు23:** యూరియా కోసం రైతులు మళ్లీ రోడ్డెక్కి ధర్నాలు చేసే దుస్థితి కల్పించడమే కాంగ్రెస్ తెచ్చిన మార్పు అంటూ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ ఎద్దేవా చేశారు. కెసిఆర్ ప్రభుత్వంలో యూరియాకు ఈ గోస లేదని, కాంగ్రెస్ వచ్చాక నీళ్లు లేవు, యూరియా లేదు అంటూ రైతులు వాపోతున్నారని శనివారం ఓ ప్రకటనలోతెలిపారు. వర్షాలు మొదలైనప్పటికీ ఇంతవరకు యూరియా అందుబాటులో లేకపోవడంతో ఎరువుల దుకాణం వద్ద పడిగాపులు కాస్తున్న రైతుల ఆగ్రహం నానాటి పెరుగుతూనే ఉందని తెలిపారు. ఓటిపి విధానంతీసివేయాలనిడిమాండ్ చేస్తున్నప్పటికీ ఓటిపి పేరిట రైతులనువేదిస్తున్న అసమర్థప్రభుత్వమని ఆయన ధ్వజమెత్తారు.

## నవంబర్ 7న మాలల రణభేరి సభ: జి.చెన్నయ్య

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు గైడ్‌లైన్ పాటించకుండా రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాలల గొంతుకోసిదని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య విమర్శించారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ నవంబర్2లోగా రోస్టర్ పాయింట్లను సవరించి ప్రభుత్వం మాలలకు న్యాయంచేయకపోతే నవంబర్ 7న లక్షలాదిమందితో మాలల రణభేరి సభను నిర్వహించి హైదరాబాద్‌ను స్థంబింపజేస్తామని చెన్నయ్య హెచ్చరించారు.

# 'కెవిఎన్ ప్రొడక్షన్స్ చిరు బాబీ-2 ప్రాజెక్ట్'



మెగాస్టార్ చిరంజీవి, మోస్ట్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లి, ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ కెవిఎన్ ప్రొడక్షన్స్, 2 మ్యాసీవ్ కాన్సెప్ట్ పోస్టర్‌తో అఫీషియల్ అనౌన్స్‌మెంట్.

బ్లాక్‌బస్టర్ కాంబో మెగాస్టార్ చిరంజీవి - బాబీ కొల్లి రీయూనియన్‌కి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఈ రోజు మెగాస్టార్ బర్త్‌డే సందర్భంగా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను గ్రాండ్‌గా అనౌన్స్ చేశారు.

ప్రతిష్టాత్మక కెవిఎన్ సంస్థ ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మించనుంది. మెగాస్టార్ వింటేజ్ మాస్ స్పెక్టాకిల్‌తో రికార్డులు బద్దలు కొట్టిన వాల్తేరు వీరయ్య తర్వాత ఇది మరో సెన్సేషనల్ కాంబినేషన్‌గా నిలవనుంది. చిరంజీవి లార్జర్‌దెన్‌లైఫ్ పర్సోనాను అద్భుతంగా స్క్రీన్‌పై చూపించగల డైరెక్టర్‌గా పేరొందిన బాబీ, ఈసారి రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్‌తోనే మ్యాసీవ్ ఎక్సైట్‌మెంట్ క్రియేట్ చేశారు. గోడను బలంగా కొడుతున్న గొడ్డలి, దాని క్రింద అనే ట్యాగ్‌లైన్ రాబోయే సినిమా ఎంత పవర్ ఫుల్, ఇంటెన్స్‌గా ఉండబోతోందో ప్రజెంట్ చేస్తోంది.

చిరంజీవిని ఎప్పుడూ చూడని కొత్త క్యారెక్టర్‌లో ప్రెజెంట్ చేయడానికి బాబీ పవర్‌ఫుల్ స్క్రిప్ట్ రెడీ చేశారు. పోస్టర్, ట్యాగ్‌లైన్ చూస్తేనే ఈ సినిమా ఇండస్ట్రీలో కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేయబోతుందని ప్రామిస్ చేస్తోంది.

తమిళంలో విజయ్ జననాయకన్, టాక్సిక్, బాలన్ వంటి వరుస బ్లాక్‌బస్టర్లతో దూసుకుపోతున్న కెవిఎన్ ప్రొడక్షన్స్, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో తొలిసారి తెలుగు సినీ రంగంలోకి అడుగుపెడుతోంది.

ప్రస్తుతం ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో అత్యంత యాక్టివ్ డైనమిక్ ప్రొడక్షన్ హౌస్‌గా నిలిచిన కెవిఎన్, మెగాస్టార్‌తో ఈ మాస్ ఎంటర్‌టైనర్‌ని మ్యాసీవ్ స్కేల్ లో రూపొందిస్తోంది. ఈ ఏడాది చివర్లో సినిమా షూటింగ్ మొదలుకానుండగా అభిమానుల్లో ఇప్పటికే అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి .సినిమా సంబంధిత మరిన్ని అప్‌డేట్స్‌ను మేకర్స్ త్వరలో అనౌన్స్ చేస్తారు.

# మైత్రీ మూవీ మేకర్స్ పాన్ ఇండియన్ ఫిల్మ్ 'డ్యూడ్'



రక్షిత్ అట్లూరి, ప్రదీప్ రంగనాథన్, మమిత బైజూ, కీర్తిశ్వరన్, మైత్రి మూవీ మేకర్స్ పాన్ ఇండియా ఫిల్మ్ 'డ్యూడ్' ఫస్ట్ సింగిల్ బూమ్ బూమ్ ఆగస్ట్ 28న రిలీజ్ వరుస విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రం'డ్యూడ్'లో నటిస్తున్నారు. కీర్తిశ్వరన్ దర్శకత్వంలో ఈ చిత్రం యువతకు నచ్చే ఎంటర్టైనర్‌గా ఉండనుంది. ప్రదీప్‌కు జోడీగా "ప్రేమలు"ఫేమ్‌మమిత బైజూ కథానాయికగానటిస్తుండగా, సీనియర్ నటుడు శరత్‌కుమార్ కీలక పాత్రలోకనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రదీప్ రంగనాథన్, మమిత బైజూకుఎ స్ట్‌లుక్‌పోస్టర్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.

ఈ రోజు మేకర్స్ ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు.'డ్యూడ్' ఫస్ట్ సింగిల్ బూమ్ బూమ్ ఆగస్ట్ 28న రిలీజ్ కానుంది. సాంగ్ ఎనౌన్స్ మెంట్ పోస్టర్ లో ప్రదీప్ రంగనాథన్, మమిత బైజూ ట్రెండీ అండ్ స్టయిలీష్ లుక్ లో ఆకట్టుకున్నారు.ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. యంగ్ సెన్సేషన్ సాయి అభ్యాంకర్ మ్యూజిక్ అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. లతా నాయుడు ప్రొడక్షన్ డిజైనర్‌గా, భరత్ విక్రమన్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. దీపావళికి ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో విడుదల కానుంది.తారాగణం: ప్రదీప్ రంగనాథన్, శరత్ కుమార్, మమిత బైజు, హృదు హారూన్, ద్రవిడ్ సెల్వం. సాంకేతిక సిబ్బంది:రచన,దర్శకత్వం: కీర్తిశ్వరన్,నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్,: చెర్రీఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనిల్ యెర్నేని సంగీతం: సాయి అభ్యంకర్, సినిమాటోగ్రాఫర్: నికేత్ బొమ్మి,ప్రొడక్షన్ డిజైనర్: లతా నాయుడు,కాస్ట్యూమ్ డిజైనర్: పూర్ణిమా రామస్వామి,ఎడిటర్: బరత్ విక్రమన్,పీఆర్వో: వంశీశేఖర్మార్కెటింగ్: ఫస్ట్ షో.

# నా కెరీర్‌లో 'ఘాటి' ఐకాన్ రోల్

విక్రమ్ ప్రభు మేల్ లీడ్‌గా నటించిన ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్‌క్రిష్ జాగర్లమూడిదర్శకత్వం వహించారు. యువిక్రియేషన్స్ సమర్పణలోఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఈ చిత్రంలో చైతన్య రావు కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమా హ్యూజ్ బజ్ క్రియేట్‌చేసింది. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో యాక్టర్ చైతన్యరావు విలేకరలు సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.



చైతన్యరావు

**ఘాటిలోమీక్యారెక్టర్ ఎలా ఉండబోతుంది? ఈ ప్రాజెక్టులోకి ఎలా ఎంటరయ్యారు?**

-ప్రొడ్యూసర్ రాజీవ్‌కాల్ చేసి క్రిష్‌ని కలవమన్నారు. క్రిష్ కథ చెప్పారు. అద్భుతంగా ఉంది. తర్వాత నా క్యారెక్టర్ గురించి చెప్పారు. అసలుఆక్యారెక్టర్‌లోనన్ను ఎలా ఊహించుకున్నారో అర్థం కాలేదు. ఫైనల్‌గా ఈ లుక్‌ని ఫైనల్ చేసాము.

**విలన్‌గా చేస్తున్నారు కదా ఎలా అనిపించింది?**

ఈ సినిమాలో నాది రోల్ చాలా కీలకంగా ఉంటుంది. గుర్తుండిపోయే క్యారెక్టర్. ఇదొక ఐకానిక్ క్యారెక్టర్ అవుతుందనే నమ్మకం ఉంది.క్యారెక్టర్ చాలా అద్భుతంగా వచ్చింది.

**ఘాట్స్‌లో షూట్ చేయడం ఎలా అనిపించింది?** ఈ సినిమాని ఈస్టర్న్ ఘాట్స్‌లో షూట్ చేసాము. అక్కడ షూట్ చేయడం చాలా చాలెంజింగ్. అనుష్క చాలా రిస్క్‌తో ఆ సీక్వెన్స్ చేశారు. అది మీరు చూసినప్పుడు చాలా థ్రిల్ అవుతారు.

**ఫస్ట్ టైం విలన్ రోల్ చేయడం ఎలా అనిపించింది?**

-ఈ రోజుల్లో విలన్ హీరో అన్నీ రోల్స్‌ని ఆడియన్స్ సమానంగా ఆదరిస్తున్నారు. యాక్టర్‌గా అన్ని క్యారెక్టర్లు చేయాలని ఉంటుంది.

**అనుష్కతో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

వెరీ స్వీట్‌పర్సన్. అనుష్కతో వర్క్ చేయడం వండర్‌ఫుల్ ఎక్స్పీరియన్స్.అనుష్కని లైఫ్‌లో ఒకసారి చూస్తే చాలు అనుకున్నాను. అలాంటిది కలిసి నటించడం అనేది వెరీ మెమొరబుల్.

**కొత్తగా ప్రాజెక్ట్స్ సైన్ చేసారా?**

మయసభకి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఘాటి ఇప్పుడు రిలీజ్ కాబోతుంది. ఈ రెండు కూడా నా కెరీర్‌లో బిగ్గెస్ట్ పిల్లర్స్ లాంటిప్రాజెక్ట్స్ దీంతోపాటుఇంకొన్ని కథలు కూడారెడీగా ఉన్నాయి. త్వరలోనే వాటికి సంబంధించినఅనౌన్స్‌మెంట్స్ వస్తాయి.

# 19న 'బ్యూటీ' టీజర్ రిలీజ్

మంచి యూత్ ఫుల్ లవ్ స్టోరీకి, ఫాదర్ ఎమోషన్, మిడిల్ క్లాస్ టచ్ ఇస్తే ఎలా ఉంటుంద 'బ్యూటీ' సినిమా చూపించబోతోంది. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా వానరా సెల్యూలాయిడ్, మారుతీ టీం ప్రొడక్ట్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రర 'బ్యూటీ'. గీతా సుబ్రమణ్యం, హాలో వరల్డ్, భలే ఉన్నాడే ఫేమ్ జె.ఎస్.ఎస్. వర్ధన్ మాటలు, దర్శకత్వం వహించిన 'బ్యూటీ' చిత్రాన్ని అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కుమార్ బన్సాల్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లేని ఆర్.వి. సుబ్రహ్మణ్యం అందించారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు ఇలా అన్నీ కూడా అంచనాలు పెంచేశాయి.

తాజాగా ఈ మూవీకి సంబంధించిన టీజర్‌ను విడుదల చేశారు. కన్నా మన పేరెంట్స్‌కి మన మీద ప్రపంచాన్నే కొనిచ్చేయాలన్నంత ప్రేమ ఉంటుంద్థి అనే డైలాగ్‌తో ఆరంభించిన



టీజర్ ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది. 'బ్యూటీ' ని కన్నావ్ అమ్మా నువ్వు అంటూ హీరోయిన్ పరిచయం, ఆ బైక్ ఎంత ఉంటుందంటావ్?.. మన కారు సంవత్సరం ఈఎంఐ ఎంత ఉంటుందో ఆ బైక్ అంత ఉంటుంది అనే డైలాగ్‌తో మిడిల్ క్లాస్ కలల్ని, కష్టాల్ని చూపించారు.అలేఖ్య కనిపించడం లేదండ్థి అనే డైలాగ్, ఆ తరువాత వచ్చిన సీన్లతో కథలోని ఇంటెన్స్, సంఘర్షణను చూపించారు. కూతురు అడిగింది కొనిచ్చేప్పుడు వచ్చే కిక్కు ఓ మధ్య తరగతి తండ్రికే తెలుస్తుంది.. తన కోసం కొంచెం కష్టపడాలి.. పడతానుఅంటూ టీజర్ చివర్లో వచ్చిన ఎమోషనల్ డైలాగ్ ఈ మూవీ కథ ఏంటో చెప్పేస్తుంది. ఇక ఈ ఎమోషనల్ టీజర్ ఆడియెన్స్‌ను కదిలించేలా ఉంది. ఇక ఈ టీజర్‌లో విజయ్ బుల్గానిన్ ఆర్ఆర్ అందరినీ కదిలించేలా ఉంది. శ్రీ సాయి కుమార్ దారా ఇచ్చిన విజువల్స్ ఎంతో బ్యూటీఫుల్‌గా ఉన్నాయి.ఆయ్, మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం వంటి హిట్ చిత్రాల్లో తనదైన మార్క్ క్రియేట్ చేసుకున్న అంకిత్ కొయ్య 'బ్యూటీ' చిత్రంతో ఆకట్టుకునేలా ఉన్నారు. చూస్తుంటే చాలా ఇంటెన్స్ ఉన్న పాత్రను పోషించినట్టుగా కనిపిస్తోంది. ఇక ఈ చిత్రంలో నరేష్, వాసుకి, నంద గోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీ గౌడ్, ప్రసాద్ బెహరా వంటి వారు పోషించిన పాత్రలకు మంచి ఇంపార్టెన్స్ ఉందని అర్థం అవుతోంది.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్‌గా శ్రీ సాయికుమార్ దారా పని చేశారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్షన్: బేబీ సురేష్ భీమగాని, ఎడిటింగ్: ఎస్‌బి ఉద్ధవ్. ఈ ఏడాదిలో రాబోతోన్న క్రేజీ ప్రాజెక్టుల్లో 'బ్యూటీ' కూడా ఒకటి కానుంది. ఈ సినిమాకు బి.ఎస్. రావు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 19న ఈ మూవీని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.తారాగణం: అంకిత్ కొయ్య, నీలఖి పాత్ర, నరేష్, వాసుకి, నంద గోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీ గౌడ్, ప్రసాద్ బెహరా తదితరలు.సాంకేతిక సిబ్బంది స్క్రీన్ ప్లే, డైలాగ్స్, దర్శకత్వం: జె.ఎస్.ఎస్. వర్ధన్నిర్మాతలు: అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కుమార్ బన్సాల్బ్యానర్లు: వానరా సెల్యులాయిడ్, జీ స్టూడియోస్, మారుతీ టీమ్ ప్రొడక్ట్‌కథ, స్క్రీన్ ప్లే: ఆర్.వి. సుబ్రహ్మణ్యం.

# ఓటిటిలో సెన్సేషన్ సెట్ చేసిన మయసభ




ఇటీవల ఓటిటిలో రిలీజ్ కి వచ్చి మంచి రెస్పాన్స్ ని అందుకున్న అనేక వెబ్ సిరీస్ లు కనిపిస్తాయి. మరి ఇలా వచ్చిన సిరీస్ లలో మన తెలుగు నుంచి వచ్చిన సిరీస్ లు కూడా ఉన్నాయి. అయితే వీటిలో ఓ సిరీస్ మాత్రం ఇండియన్ ఓటిటిలో సెన్సేషనల్ రెస్పాన్స్ ని అందుకున్నట్టుగా ఇపుడు కన్ఫర్మ్ అయ్యింది. ఇద్దరు రాజకీయ శక్తులు అంతకు మించిన ప్రాణ స్నేహితుల కల్పిత కథగా దర్శకుడు దేవా కట్ట తెరకెక్కించిన తన మార్క్ వెబ్ సిరీస్ నే 'మయసభ".

చైతన్య రావు అలాగే ఆది పినిశెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సాలిడ్ పొలిటికల్ థ్రిల్లర్ సిరీస్ ఈ ఆగష్టు 7న సోనీ లివ్ లో పాన్ ఇండియా భాషల్లో స్ట్రీమింగ్ కి వచ్చింది. మరి అందులో సూపర్ హిట్ అయ్యిన ఈ సిరీస్ ఇండియా లోనే టాప్ 5 షోస్ లో ఒకటిగా నిలిచినట్టు సోని లివ్ వారు అనౌన్స్ చేశారు. అంతే కాకుండా ఈ ఫీట్ ని అందుకున్న మొదటి తెలుగు సిరీస్ గా మయసభ నిలిచినట్టు తెలిపారు. మొత్తానికి మాత్రం ఓటిటిలో ఈ సిరీస్ దుమ్ము లేపుతుంది అని చెప్పాలి.

# 'మదరాసి' ఆడియో లాంచ్



మురుగదాస్, అనిరుధ్ రవిచందర్, శ్రీలక్ష్మి మూవీస్ 'మదరాసి' ఆగస్టు ట్రైలర్ ఆడియో లాంచ్ శివకార్తికేయన్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్టైనర్'మదరాసి' యాక్షన్ ప్యాక్డ్ టీజర్, చార్ట్ టాపింగ్ ఫస్ట్ సింగిల్ సెలవికాతో మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు టీం ఎక్సయిట్మెంట్ ని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్లడానికి రెడీ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్, ఆడియో లాంచ్ ఆగస్టు 24న జరిగింది. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ఆయనకు క్రూషియల్ కమ్ బ్యాక్ ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. ఇందులో శివకార్తికేయన్‌ని ఫుల్ మాస్, ఫియర్స్ లుక్‌లో చూపించనున్నారు.ట్రైలర్ పోస్టర్‌లో శివకార్తికేయన్‌తో పాటు విద్యూత్ జమ్వాల్, బిజు మెనన్, విక్రాంత్‌లను కూడా ఇంటెన్స్ లుక్‌లో ప్రజెంట్ చేశారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ సెలవికా, లవ్ ఫెయిల్యూర్ ఆంథమ్‌గా మారి మంచి హిట్ సాధించింది. రుక్మిణి వసంత్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆమె ప్రెజెన్స్ కమర్షియల్ స్పేస్‌కి కొత్తదనం తీసుకురానుంది. శ్రీలక్ష్మీమూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమాను గ్రాండ్ స్కేల్‌లో నిర్మిస్తున్నారు. ఇందులో హై ఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు ఎమోషనల్ డెప్త్ కూడా ఉండబోతోంది. సినిమాటోగ్రఫీని సుదీప్ ఎలామోన్ హ్యాండిల్ చేస్తున్నారు.రెండు రోజుల్లో ట్రైలర్, ఆడియో రిలీజ్ అవుతున్న నేపథ్యంలో 'మదరాసి' పై అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ సినిమా సెప్టెంబర్ 5న థియేట్రికల్ రిలీజ్ కానుంది.



# పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పాన్‌ఇండియా ఫిల్మ్ "మిరాయ్"

సూపర్ హీరో తేజ సజ్జా, కార్తీక్ ఘట్టమనేని, టిజి విశ్వప్రసాద్, కృతిప్రసాద్, తేజ సజ్జా బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ హనుమాన్ సంచలన విజయంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న సూపర్ హీరో తేజ సజ్జా, ఇప్పుడు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'మిరాయ్'లో సూపర్ యోధగా అలరించనున్నారు.

ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న మిరాయ్ ఈ సంవత్సరం బిగ్గెస్ట్ సినిమాటిక్ ఈవెంట్‌లలో ఒకటిగా మారనుంది.తేజ సజ్జ బర్త్‌డే సందర్భంగా మిరాయ్ మూవీ మేకర్స్ ఓ కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. అందులో తేజ సూపర్ యోధ అవతార్‌ని అదిరిపోయేలా చూపించారు. కూలిపోతున్న వంతెన మీద చేతిలో కేవలం ఒక స్టిక్ తో నిలబడి పోరాడుతున్న తేజ లుక్ అదిరిపోయింది. ఆ పోస్టర్ ఆయన పాత్రలో ఉన్న పట్టుదల, ధైర్యం, మిరాయి లో ఉన్న హై వోల్టేజ్ డ్రామాని రిప్రజెంట్ చేస్తుంది.మిరాయ్ మైండ్‌బ్లోయింగ్ టీజర్ నేషనల్ వైడ్ గా సెన్సేషన్ హిట్ అయ్యింది. ఫస్ట్ సాంగ్ వైబ్ ఉంది చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది.

ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా, మంచు మనోజ్ విలన్‌గా, శ్రీయా శరన్, జయరాం, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

నార్త్ రిలీజ్ కి బూస్ట్ ఇస్తూ బాలీవుడ్ టాప్ ఫిల్మ్‌మేకర్ కరణ్ జోహార్ ఆయన ప్రెస్టీజియస్ బ్యానర్ ధర్మ ప్రొడక్షన్స్ మిరాయ్ హిందీ థియేట్రికల్ రైట్స్‌ని సొంతం చేస్తున్నారు.

దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మిరాయ్ దర్శకత్వం వహించడమే కాకుండా, సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. అలాగే స్క్రీన్‌ప్లేను కార్తీక్ స్వయంగా రూపొందించారు. మణిబాబు కరణం రచన, సంభాషణలకు కీలకంగా పని చేశారు. గౌర హరి సంగీతం, ఆర్ట్ డైరెక్టర్‌గా శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సుజిత్ కుమార్ కొల్లి పని చేస్తున్నారు.మిరాయ్ 2డి, 3డి ఫార్మాట్‌లలో ఎనిమిది భాషల్లో సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇది ట్రూ పాన్‌ఇండియన్ విజువల్ వండర్‌గా ఉండబోతుంది.

తారాగణం: సూపర్ హీరో తేజ సజ్జ, మనోజ్ మంచు, రితికా నాయక్, శ్రియ శరణ్, జయరామ్, జగపతి బాబు.సాంకేతిక సిబ్బంది: దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని,

నిర్మాతలు: టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి, సంగీతం: గౌర హరి, ఆర్ట్ డైరెక్టర్: శ్రీ నాగేంద్ర తంగాల, రైటర్: మణిబాబు కరణం,పిఆర్ఓ: వంశీశేఖర్, మార్కెటింగ్: హాష్‌ట్యాగ్ మీడియా .

# అన్నివర్గాలవారిని ఆకట్టుకునేలా ఉంటుంది

మోహన్ శ్రీవత్స



స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మించినచిత్రంత్రిబాణధారి బార్బరిక్. ఈసినిమాకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. ఈ మూవీలో సత్య రాజ్, ఉదయభాను, వశిష్ట ఎన్ సింహా, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ వంటి వారు ప్రముఖ పాత్రలను పోషించారు. ఈ మూవీ ఆగస్ట్ 29న ఆడియెన్స్ ముందుకు రానుంది. ఈక్రమంలో రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్‌లు ఇప్పటికే అందరిలోనూ అంచనాలు పెంచేశాయి. ఈ మేరకు దర్శకుడు మోహన్ శ్రీవత్స చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. ఆయన చెప్పిన సంగతులివే.

**ఇండస్ట్రీలోకి ఎలా వచ్చారు? ఇంతకు ముందు ఏం నేర్చుకున్నారు?.**

. నేను సంగీతాన్ని నేర్చుకున్నా కూడా.. నాకు సినిమాలోకి రావాలని, దర్శకుడు కావాలన్నదే నా కల. ఎన్నో ఈవెంట్లలో పాటలు కూడా పాడేవాడిని. అదే నాకు ఇన్ని రోజులు తిండి పెట్టింది.

**బార్బరిక్ కథ ఎలా ఓకే అయింది?..**

నేను కథల్ని బాగా చెప్పగలను. అద్భుతంగా నెరేషన్ ఇవ్వగలను. ఈ 'బార్బరిక్' కథను నిర్మాతకు చెప్పిన వెంటనే నచ్చింది. మారుతి నా కథను విని ఆశ్చర్యపోయారు. నా నెరేషన్‌తోనే ఆయన నన్ను నమ్మేశారు.

**. సత్య రాజ్ పాత్ర, ఆయన సహకారం ఎలా ఉండేది?..**

బార్బరికుడు త్రిబాణంతో కురుక్షేత్రంను ఆపగలరు. అలాంటి బార్బరికుడిని కృష్ణుడు ఓ వరం అడిగి యుద్ధాన్ని జరిగేలా చేస్తారు. నార్త్‌లో బార్బరికుడు ఫాలోయింగ్ చాలా ఉంటుంది. సత్య రాజ్ బార్బరికుడిలా కొన్ని చోట్ల కనిపిస్తారు. మేకప్ విషయంలో ఆయనను చాలా కష్టపెట్టాను.

**'బార్బరిక్' చూసిన తరువాత మారుతి ఏమైనా సలహాలు ఇచ్చారా?..**

రాజా సాబ్‌షూటింగ్‌లో మారుతి బిజీగా ఉన్నా కూడా మా 'బార్బరిక్' మూవీ కోసం చాలా పని చేశారు. మాకు ఎన్నో ఇన్ పుట్స్ ఇచ్చారు.

**'బార్బరిక్' కోసం ఇన్ ఫ్యూజన్ బ్యాండ్‌ను ఎందుకు తీసుకున్నారు?.**

.కు మ్యూజిక్ మీద టచ్ ఉంది. ఆ విషయంలో ఆడియెన్స్ పల్స్ నాకు తెలుసు. ఇన్ ఫ్యూజన్ బ్యాండ్‌తో నాకు మంచి బంధం ఉంది. మాకు అద్భుతమైన పాటలు ఇచ్చారు. ఆర్ఆర్ కూడా అదిరిపోతుంది. కొత్తగా ఉండాలనే ఇలా బ్యాండ్‌ని తీసుకున్నాను.

# పుట్టగొడుగులతో కోట్ల వ్యాపారం

**స్కాలర్‌షిప్‌తో లండన్‌లో మాస్టర్స్ చదివే అవకాశం ఓవైపు... అధిక ప్యాకేజీతో ఉద్యోగం ఆఫర్ చేసిన బహుళజాతి సంస్థ తిరిగి... దాని కోసం నిదానంగా ఉందామె. అంకుర సంస్థ ఏర్పాటుకు మిత్రుడు ఇచ్చిన సద్వినియోగం చేసుకుని భారత దేశంలో తొలిసారిగా మైసీలియమ్ ఆధారిత ప్యాకేజింగ్‌ను ఆవిష్కరించడంలో తనవంతు సహకారాన్ని అందించారు. గొండు వాగ్దేవి.**

మా స్వస్థలం శ్రీకాకుళం. నాన్న విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్ ఉద్యోగి కావడంతో అక్కడే స్థిరపడ్డాం. 2019లో కెమికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశా. కర్ణాటకలోని ఓ ఫార్మా కంపెనీలో రిసెర్చ్ ల్యాబ్‌లో ఏడాది, గోవాలోని ఓ బహుళజాతి సంస్థ (ఎమ్ఎన్‌సి)లో ఏడాదిన్నర పాటు పనిచేశాను లండన్‌లో మాస్టర్స్ చేయాలనే ఉద్దేశంతో ఉద్యోగానికి రాజీనామా చేశాను. అదే సమయంలో గోవాలో పనిచేసిన ఎంఎన్‌సి నుంచే మరో మంచి ఆఫర్ వచ్చింది. అప్పుడే నా స్నేహితుడు ఆదిత్య శ్రీనివాస్ మైసీలియమ్ ఆధారిత ప్యాకేజింగ్ ప్రాజెక్టు గురించి చెప్పాడు. ఇప్పటికే తనతో చిన్నచిన్న ప్రాజెక్టుల్లో పనిచేసి ఉండటంతో ఈ ప్రాజెక్టులో పాల్గొనాలని కోరాడు. రిఫ్రిజరేటర్, వాషింగ్ మెషీన్ వంటి వస్తువులను కింగ్ చేయడానికి వాడే థర్మకోల్, స్టైరోఫార్మ్‌కు ప్రత్యామ్నాయమే ఈ మైసీలియమ్ ఆధారిత ప్యాకేజింగ్. పుట్టగొడుగు నుంచి వచ్చే మైసీలియంతో వ్యవసాయ వ్యర్థాలైన గడ్డి, చెరకు పిప్పి, మొక్కజొన్న వ్యర్థాలు, కొబ్బరి పీచు, అరటినార... ఎండుగడ్డి కలిపి తయారుచేస్తాం. పర్యావరణానికి హాని లేకపోవడం, ఘనవ్యర్థాలు లేకపోవడం ఈ ప్రాజెక్టు ప్రధానాంశంగా ఉండటంతో వెంటనే అంగీకరించా. అలా 'రోహా బయోటెక్' సహ వ్యవస్థాపకు రాలిగా మారాను.





**ఓపికతో సాధించాం...** మైసీలియం ఆధారిత ప్యాకేజింగ్ ప్రాజెక్టు కోసం చెన్నైలోని ఐఐటీ మద్రాస్‌లో ల్యాబ్ను ఉపయోగించు కున్నాం. ఇది పూర్తిగా కొత్త ప్రాజెక్టు పరికరాలను స్వయంగా డిజైన్ చేసుకోవాల్సి వచ్చింది. ప్రాజెక్టుకు అవసరమైన వ్యవసాయ వ్యర్థాలను చెన్నై సమీప ప్రాంతాల రైతుల నుంచి నేరుగా సేకరించాం. ఈ ప్రాజెక్టు కోసం ఉదయం నుంచి రాత్రి వరకు ల్యాబ్‌లోనే గడిపిన సందర్భాలు ఉన్నాయి. వాతావరణం, వాతావరణంలో చిన్నపాటి మార్పులు చోటుచేసుకున్నా ప్రయోగంలో ఆశించిన ఫలితాలు వచ్చేవి కావు. దీంతో మళ్లీ ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది. అలా ఓపికతో చేసిన ప్రయోగాలతో ఏడాది తర్వాత మా ప్యాకేజింగ్‌కు తుదిరూపం వచ్చింది. భారతదేశంలో తొలి మైసీలియం ఆధారిత ప్యాకేజింగ్‌ను ఆవిష్కరించిన ఘనత మాకు దక్కింది. థర్మకోల్, స్టైరోపార్కులకు త్వరగా మండే గుణం ఉండగా... నవంబర్ 700800 డిగ్రీల వేడినీ తట్టుకోవడం మా ప్యాకేజింగ్ ప్రత్యేకాంశం. వాస్తవానికి ఇలాంటి ప్రాజెక్టుకు తుదిరూపం తీసుకురావడానికి మూడేళ్లు పడుతుంది. కానీ, పట్టుదల, ఓపికతో దీన్ని చాలా త్వరగా సాధించవచ్చు. ప్రాజెక్టు విజయవంతం కావడంతో వ్యాపార అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఉత్పాదక పనితీరు పెంచే చర్యల్లో భాగంగా ఏడాది తర్వాత ఐదుగురు నిపుణులకు ఉద్యోగావకాశం కల్పించాం. వండలూరులో ఉత్పాదక వసతిని కల్పించుకున్నాం. ప్రస్తుతం నెలకు 4 టన్నులు ఉత్పత్తి చేస్తున్నాం. భవిష్యత్తులో దీన్ని 50 టన్నులకు పెంచడానికి కృషి చేస్తున్నాను. ఈ ఏడాది మా ఆదాయం రూ.1.2 కోట్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నాం. □

# తెలుగు మహిళకు బ్రిటన్ అత్యున్నత పురస్కారం

**దేశం కానీ దేశం వెళ్తే... అక్కడ మనం నిలదొక్కుకోవడమే కష్టం! అలాంటి చోట తన సేవాపథంతో చెరగని ముద్ర వేశారామె. గత నాలుగు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేశారు. బ్రిటన్ అత్యున్నతపౌర పురస్కారాలలో ఒకటైన సీబీఐ అవార్డును అందుకున్నారు తెలుగు మహిళ పూర్ణిమ తణుకు.**



. మా కుటుంబంలో తాతగారితో సహా చాలామందే ప్రజాసేవలో ఉన్నారు. ఆ ప్రభావమే నామీద ఉండటంతో నేనూ సేవాబాటలో నడిచా. మా స్వస్థలం ఉమ్మడి తూర్పుగోదావరి కొత్తపేట సొంతూరిలోనే ప్రాథమిక విద్య పూర్తయ్యాక... అమలాపురంలోని ఎస్‌కేబీఆర్ కాలేజీలో డిగ్రీ చదివా. ఆపై ఆంధ్రా యూనివర్సిటీ లో పీజీ చేశా. నాన్న విశ్వేశ్వరయ్య, టైపు ఇన్‌స్టిట్యూట్ నడిపేవారు. అమ్మ రత్నాంబ, గృహిణి. లండన్‌లో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ వెంకట నారాయణతో పెళ్లవడంతోఇక్కడ స్థిరపడ్డా. మొదట ఇంజినీరింగ్ కంపెనీలో కెరియర్ ఆరంభించా. తర్వాత యువత, పిల్లల కోసం పనిచేసే 'రీజనరేషన్ ట్రస్ట్'కి మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించా. ఆపై జైళ్లలో ఉన్నవారికి విద్యను కృషి చేసిన తొలి ఆసియా మహిళగానూ గుర్తింపు దక్కించుకున్నా.



**కళలపై ఇష్టంతో....** వృత్తిపరమైన ఈ ప్రయాణానికి భిన్నంగా... మరో పక్క నా ఆసక్తులకూ ప్రాధాన్యత ఇచ్చా. చిన్నప్పుడు నృత్యంపై ఉన్న ఇష్టంతో గురువులు శ్రీమతి అద్దంకి స్వరాజ్యం, శ్రీ నల్ల సత్యనారాయణల వద్ద భరతనాట్యం నేర్చుకున్నారు. ఇక్కడకి వచ్చాక మా పాప శాస్త్రీయ నృత్యాన్ని నేర్చుకోవాలన్న ఆసక్తి చూపించడంతో తిరిగి దానిపై దృష్టిపెట్టా. కర్ణాటకకు చెందిన డా.గీతతో కలిసి 25 ఏళ్ల క్రితం సౌత్ ఏషియన్ అకాడమీ పేరుతో కళాపరిషత్ ఏర్పాటుచేశా. దీనికి 20 ఏళ్ల పాటు బోర్డు చైర్పర్సన్‌గా పనిచేశా. వివిధ రాజకీయ పార్టీలతో ఎర్లీ ఎడ్యుకేషన్ పాలసీలపై కలిసి పని చేస్తున్నా.

**అవార్డులెన్నో...** ప్రస్తుతం నేషనల్ డే నర్సరీస్ అసోసియేషన్ (ఎన్డీఎన్ఏ)కు ఎగ్జిక్యూటివ్ చైర్పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది యూకేలో బాలల సంరక్షణ, హక్కుల కోసం పనిచేసే అతిపెద్ద ఛారిటీమెంబర్‌షిప్ అసోసియేషన్. 2004లో ఈ సంస్థలో చేరా. అప్పటికి 20 మంది సిబ్బందితో చిన్నగా ఉండేది. ఇప్పుడు మూడు శాఖలతో 100మందికిపైగా ఉద్యోగులతో శక్తిమంతమైన స్వచ్ఛంద సంస్థను మార్చగలిగారు. యూకేలోని 15000 డే నర్సరీల హక్కుల కోసం పోరాడా. దాదాపు పదిలక్షల మందికిపైగా చిన్నారులు, వారి కుటుంబాలకు అత్యున్నత సంరక్షణ విధానాలు అమలయ్యేలా చేయగలిగారు. ఇంగ్లండ్ సహా 22 దేశాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇలా 20 ఏళ్ల పాటు ఎన్‌డిఎన్ఏకు నాయకత్వం వహిస్తూ బాలల విద్యకు చేయూత అందించినందుకు గానూ పలు పురస్కారాలు దక్కాయి. 2011లో బ్రిటన్ పౌర పురస్కారాల్లో ఒకటైన ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్ (ఓబీఇ)ను కింగ్ చార్లెస్ చేతుల మీదుగా తీసుకున్నా. తాజాగా కమాండర్ ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్ (సీబీఈ)ని చార్లెస్ సోదరి ప్రిన్సెస్ అనీ అందించారు. ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్, నోబెల్ గ్రహీత హెరాల్డ్ పింటర్, రగ్బీ ఆటగాడు జోనాథన్ పీటర్ విల్కిన్సన్‌తోపాటు మనదేశం నుంచి ఈ గౌరవాన్ని పొందినవారిలో లీనా నాయర్ ఒకరు. ఈ అవార్డు అందుకున్న తొలి తెలుగు మహిళను నేనే కావడం గర్వంగా ఉంది. □

# చర్మ నిగారింపునకు కాఫీ మాస్క్



ఫేస్ మాస్క్‌ను వేయడానికి కాఫీ గ్రౌండ్‌లను పెరుగు లేదా పాలతో కలపాలి. దీన్ని ముఖానికి అప్లయ్ చేసి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచి చర్మాన్ని ప్రకాశంతంగా మార్చుకోవచ్చు.

కాఫీ తాగగానే మంచి ఫీల్ వస్తుంది. ఇందులోని కెఫిన్ ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. అదే కాఫీ పొడిని ముఖానికి అప్లయ్ చేసి చూడండి. ముఖ చర్మం ఎంత నిగారింపుతో మెరుస్తుందో..

**కాఫీ స్క్రబ్...** స్క్రబ్ చేయడానికి కొబ్బరి నూనె లేదా తేనెతో కాఫీ గ్రౌండ్‌ఖ్స కలపండి. మృత చర్మ కణాలను ఎక్స్‌ఫోలియేట్ చేయడానికి, కణాలను తొలగించడానికి చర్మంపై సున్నితంగా మసాజ్ చేయాలి.

**కాఫీ ఫేస్ మాస్క్...** ఫేస్ మాస్క్‌ను వేయడానికి కాఫీ గ్రౌండ్‌లను పెరుగు లేదా పాలతో కలపాలి. దీన్ని ముఖానికి అప్లయ్ చేసి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచి, చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చుకోవచ్చు. చర్మం మరింత శుభ్రంగా కూడా మారుతుంది. □

# రోజంతా తాజాగా..

లడ్డూల తయారీలో పచ్చ కర్పూరాన్ని వాడటం తెలిసిందే. దీనివల్ల ఆహార పదార్థాల రుచీ, వాసనా పెరుగుతుంది. ఇది సుమాసనను మాత్రమే కాకుండా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది.



కీళ్లు, కండరాల నొప్పుల నివారణకు తోడ్పడుతుంది. కొబ్బరి నూనెను వెడిచేసి పచ్చకర్పూరం కలిపి నొప్పి ఉన్న చోట రాస్తే ఉపశమనం లభిస్తుంది.

★ స్నానం చేసే నీటిలో కాస్త పచ్చకర్పూరం కలపడం వల్ల చర్మం తాజాగా ఉండటంతోపాటు సువాసనలూ వెదజల్లుతుంది.

★ పంటి నొప్పిని కూడా దీంతో తగ్గించుకోవచ్చు. కొబ్బరి నూనెలో కర్పూరాన్ని కరిగించి.. దూది ముంచి పంటి నొప్పి ఉన్న చోట పెడితే ఫలితం ఉంటుందంటారు.

★ గంధంలో పచ్చ కర్పూరం, కొన్ని నీళ్లూ కలిపి ఆ మిశ్రమాన్ని నుదిటికి రాస్తే జ్వర తీవ్రత తగ్గుతుంది.

★ దీని వాసనను పీల్చడం ద్వారా శ్వాస సంబంధిత సమస్యల నుంచీ ఉపశమనం పొందొచ్చు.

★. జీర్ణసంబంధిత ఇబ్బందులనూ ఇది నియంత్రిస్తుంది. □

# మనం యేసుక్రీస్తు స్నేహితులం..



'అప్పుడు యెహోవా నేను చేయబోవు కార్యము అబ్రాహామునకు దాచెదనా? అబ్రాహాము నిశ్చయముగా బలముగల గొప్ప జనమగును. అతని మూలముగా భూమిలోని సమస్త జనములును ఆశీర్వదించబడును' (ఆదికాండం 18: 17,18), 'నా స్నేహితుడైన అబ్రాహాము సంతానామా' (యెషయా 41:8), 'దేవుని స్నేహితుడని అతనికి పేరుకలిగెను' (యాకోబు 2:23). ఈ మూడు వచనాలు అబ్రాహాము యెహోవా దేవుడి స్నేహితుడిగా పిలువబడ్డాడు. ఎందుకు అంతగా దేవుడు అతడిని ప్రేమించాడు? కారణం అబ్రాహాము విధేయత గల జీవితం. దేవుడు మనల్ని కూడా తనకు స్నేహితులుగా మారాలని కోరుతున్నాడు. 'ఇక మిమ్మును దాసులని పిలువక స్నేహితులని పిలుచుచున్నాను' (యోహాను 15:15). తన మరణం ద్వారా యేసుక్రీస్తు మనల్ని తన స్నేహితులుగా చేసుకున్నాడు. స్నేహితులు అంటే ఇద్దరు ఒకరిపై ఒకరికి ప్రేమ ఉన్నప్పుడే స్నేహితులు అని అంటాం. ఏ ఒక్కరికే ప్రేమ ఉంటే అది స్నేహం అనిపించుకోదు. అంతేకాదు స్నేహితులు ఎప్పుడు ఒకరి క్షేమం కోసం మరొకరు తపిస్తుంటారు. తమ స్నేహం కలకాలం పదిలంగా ఉండాలని భావిస్తారు. నొప్పించని విధంగా మెలుగుతారు. స్నేహితులు తమకు ఇష్టం లేని పనులు చేయరు. తప్పు చేస్తే గద్దిస్తాడు, మంచిపని చేస్తే మెచ్చుకుంటాడు. దేవుడు కూడా మనల్ని ఈవిధంగానే ప్రేమిస్తున్నాడు. అందుకే ఆయన తనకు ఇష్టం లేని పనులు చేసినప్పుడు మనల్ని గద్దిస్తుంటాడు. మంచి చేస్తే మెచ్చుకుంటాడు, ఆశీర్వదిస్తాడు. మనం ఏదో కాసేపు దేవుడి సన్నిధిలో గడపడం కాదు దేవుడు కోరేది. నిత్యం మనం ఆయనతోనే మన జీవితం పెనవేసుకుని ఉండాలి. కష్టాలు వచ్చినప్పుడు 'దేవా' అనడం, ఆనందం కలిగినప్పుడు దేవుడిని మర్చిపోవడం కాదు. నిత్యం మన భావాలు, అంతర్గత కోరికలు అవి మంచైనా సరే..చెడు అయినా సరే దేవుడితో పంచుకోవడం. ఆయనకు ఇష్టం లేని పనులు చేయకుండా దూరంగా ఉండడం. మనం దేవుడికి ఇష్టమైన పనులు చేసినప్పుడే ఆయనకు స్నేహితులుగా ఉండగలం. లేకపోతే దేవుడు మనల్ని శత్రువులుగా భావించి, మన నుంచి దూరమైపోతాడు. కాబట్టి అబ్రాహాము దేవుడు చెప్పిన పనులనే చేశాడు. తద్వారా మనకు ఆయన ఓ ఆదర్శవంతుడిగా ఉన్నాడు. మనం కూడా అబ్రాహాము లాగా దేవుడికి ఇష్టంగా జీవిస్తే, మనం కూడా దేవుడి స్నేహితులుగా ఉంటాం.

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# మనసు దోచే రుచులు

**పండుగలు మొదలయ్యింది కదా! మీ పాకశాస్త్ర నైపుణ్యం చూపించడానికి ఇదే మంచి అవకాశం అనుకుంటున్నారా? అయితే రుచికరమైన స్టార్టర్లతో శుభారంభం చేయండి. ఇంటిల్లపాదీ మనసు దోచేయండి..**

## చికెన్ పాప్‌కార్న్



**కావాల్సినవి :** బోన్‌లెస్ చికెన్-500గ్రా మారినేషన్ కోసం : అల్లంవెల్లుల్లి పేస్ట్-చెంచా, ఉప్పు-తగినంత, కారం-చెంచాన్నర, పసుపు-పావుచెంచా, ధనియాలపొడి-అరచెంచా, వెనిగర్-చెంచా, కొత్తిమీర తరుగు-చెంచాన్నర, గుడ్డు-1, మొక్కజొన్నపిండి-చెంచాన్నర, కోటింగ్ కోసం: బ్రెడ్‌క్రంబ్స్-ముప్పావుకప్పు, కార్న్ ఫ్లేక్స్ పొడి-కప్పులో మూడోవంతు, ఉప్పు-అరచెంచా, కారం-చెంచా, నూనె- వేయించడానికి సరిపడ.

**తయారీ :** ఒక పాత్రలో చికెన్ వేసుకుని మారినేషన్ చేయడానికి కావాల్సిన పదార్థాలన్నీ బాగా కలిపి ఫ్రిజ్‌లో రెండు గంటపాటు ఉంచాలి. మరొక పాత్ర తీసుకుని దీనిలో కోటింగ్ కోసం మొక్కజొన్నపిండి, బ్రెడ్‌క్రంబ్స్, కార్న్‌ఫ్లేక్స్ పొడి, ఉప్పు, కారం అన్నీ బాగా కలపాలి. మారినేట్ చేసి సిద్ధంగా పెట్టుకుననన చికెన్ ముక్కలని ఈ కోటింగ్ పొడిలో వేసి దొర్లించుకోవాలి. వీటిని నూనెలో ఎర్రగా వేయించుకుంటే చికెన్ పాప్‌కార్న్ సిద్ధం. వెజ్, నాన్‌వెజ్ ఏ స్టార్టర్‌లు చేసినా.. పదార్థాల్ని ఒకటి రెండు గంటలు మారినేట్ చేసి పెట్టుకుంటే ఆ రుచి ప్రత్యేకంగా ఉంటుంది.

## మష్రూమ్ 65..



**కావాల్సినవి :** పెరుగు-అర కప్పు, అల్లంవెల్లుల్లి పేస్ట్-చెంచా, ఎర్రని కశ్మీరి కారం-రెండు చెంచాలు, జీలకర్ర- చెంచా, ధనియాల పొడి-రెండు చెంచాలు, గరం మసాలా- చెంచా, కరివేపాకు-రెబ్బ, కార్న్‌ఫ్లోర్-రెండు చెంచాలు, మైదా-4 చెంచాలు, నిమ్మరసం-అరచెంచా, ఉప్పు-తగినంత, పుట్టగొడుగులు-200 గ్రా, నూనె-వేయించడానికి సరిపడ, ఉల్లికాడ-ఒకటి, బియ్యప్పిండి-రెండు చెంచాలు.

**తయారీ :** ముందుగా పుట్టగొడుగులని శుభ్రం చేసుకుని నిలువుగా తరిగి పెట్టుకోవాలి. ఒక పాత్రలో పెరుగుని క్రీంలా అయ్యేలా చిలికి పెట్టుకోవాలి. దీనికి అల్లం, వెల్లుల్లిపేస్ట్, గరంమసాలా, కారం, జీలకర్ర పొడి, ధనియాలపొడి, సన్నగా తరిగిన కరివేపాకు, మొక్కజొన్న పిండి, మైదా, బియ్యప్పిండి, ఉప్పు చివరిగా నిమ్మరసం వేసుకోవాలి. స్టౌ వెలిగించి కడాయి పెట్టుకుని నూనె పోసి వేడెక్కాక.. అప్పుడు మొక్కజొన్నపిండి మిశ్రమంలో మష్రూమ్స్‌ని వేసుకోవాలి. ముందే వేసుకుంటే వాటి నుంచి నీళ్లు ఊరి పిండి పలచబడుతుంది. వీలైనంత వరకూ పిండి పలచగా లేకుండా జాగ్రత్తపడాలి. లేదంటే కాస్త వియ్యప్పిండి వేసుకోవాలి. పిండిలో ముంచి మష్రూమ్స్‌ని నూనెలో దోరగా వేయించుకోవడమే. ఉల్లికాడల్ని సన్నగా తరిగి వడ్డించుకుంటే సరి.

## చట్‌పటా ఆలూ..



**కావాల్సినవి :** బేబీ ఆలూ (చిన్న బంగాళాదుంపలు)-15 (ఆలూ ముక్కలు కూడా తీసుకోవచ్చు), ధనియాల పొడి-రెండు చెంచాలు, కారం-చెంచా, ఆమ్‌చూర్ పొడి-రెండు చెంచాలు, గరంమసాలా- చెంచా, వేయించిన నువ్వులు-రెండు చెంచాలు, సోంపు పొడి-చెంచా, ఉప్పు-రుచికి తగినంత, నూనె-తగినంత, కరివేపాకు-రెబ్బ.

**తయారీ :** బంగాళా దుంపల్ని ఉడికించి పొట్టు తీసి పక్కన పెట్టుకోవాలి. వీటిని నూనెలో ఎర్రగా వేయించుకోవాలి. స్టౌ వెలిగించి మరొంక కడాయి పెట్టుకుని కొద్దిగా నూనె పోసుకుని వేడెక్కాక అందులో కరివేపాకు, వేయించిన ఆలూ,పైన చెప్పుకొన్న మసాలా పొడులు వేసి రెండు నిమిషాలు వేయించుకుంటే చట్‌పటా ఆలూ సిద్ధం.

## ప్రాన్ 65 ..



**కావాల్సినవి :** రొయ్యలు-250 గ్రా, పసుపు-పావుచెంచా, మిరియాలపొడి-పావుచెంచా, జీలకర్రపొడి-అరచెంచా, ఉప్పు-తగినం, ధనియాల పొడి-చెంచా, కారం-చెంచా, మొక్కజొన్న పిండి-చెంచా, సెనగపిండి-చెంచా, బియ్యప్పిండి-చెంచా, కరివేపాకు-రెబ్బ, నిమ్మరసం-చెంచా, నూనె తగినంత.

**తయారీ :** పసుపు వేసి రొయ్యల్ని శుభ్రం చేసుకోవాలి. గిన్నెలో రొయ్యలు, మసాలా పొడులు, పిండ్లు వేసి రొయ్యలకు బాగా పట్టించాలి. చివరిగా నిమ్మరసం, ఉప్పువేసి మరో కలపాలి. ఈ మసాలా పట్టించిన రొయ్యలని ఒక్కోటిగా నూనెలో వేయించుకుంటే ప్రాన్ 65 సిద్ధం.

## క్రిస్పీ కార్న్..



**కావాల్సినవి :** స్వీట్‌కార్న్-కప్పు, మైదా-రెండు చెంచాలు, మిరియాలపొడి-అరచెంచా, వెల్లుల్లి పలుకులు-అరచెంచా, ఉప్పు-తగినంత, నూనె-వేయించడానికి సరిపడ, టాంపరింగ్ కోసం: నూనె-రెండు చెంచాలు, వెల్లుల్లి రెబ్బలు-మూడు, పచ్చిమిర్చి-రెండు, ఉల్లికాడల తరుగు-పావుకప్పు, టొమాటోసాస్-పావుకప్పు, చిల్లీసాస్-చెంచా, సన్నగా తరిగిన క్యాప్సికమ్ ముక్కలు-పావు కప్పు, వెనిగర్-చెంచా, సోయాసాస్-చెంచా, ఉప్పు-తగినంత.

**తయారీ :** ఒక పాత్రలో మొక్కజొన్నపిండి, మైదా, ఉప్పు, మిరియాలపొడి చెంచాన్నర నీళ్లు పోసి కలిపి అందులో మొక్కజొన్న గింజల్ని కలిపి.. డిప్ ఫ్రై చేసుకోవాలి. ఎక్కువగా ఉన్న నూనె పీల్చుకొనేందుకు ఒక టిష్యూ పేపర్‌పై వేసుకోవాలి. వేరే కడాయిలో.. కొద్దిగా నూనె పోసుకుని వెల్లుల్లి పలుకులు, పచ్చిమిర్చి వేయించుకోవాలి. తర్వాత ఉల్లికాడలు. వీటిని సన్నగా తరిగి ఒక నిమిషం వేయించుకుని.. క్యాప్సికమ్ ముక్కలని వేయించుకోవాలి. ఇందులో టొమాటో సాస్, చిల్లీసాస్, సోయాసాస్, వెనిగర్ వేశాక డీప్‌ఫ్రై చేసి పెట్టుకున్న కార్న్ గింజలు, ఉప్పు వేసి వేయించుకుంటే క్రిస్పీకార్న్ సిద్ధం. □

# నీళ్లు చిందవిక !



ని చిన్న చిన్న గిన్నెలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేస్తాం. లేదంటే సింక్ చుట్టూ పేరుకుపోయి వికారంగా కనిపిస్తాయి. కడిగే పని తేలిగ్గానే అయిపోతుంది. కానీ.. చుట్టూ నీళ్లు చిందడం, దుస్తులు తడవటమే చిరాకు తెప్పి స్తుంది. ఆ బాధ నుంచి తప్పించేందుకు 'స్ప్లాష్ గార్నడ బోర్డ్' వచ్చేసింది. దీనినన సింక్ కు అమర్చితే.. ఇక నీళ్లు చిందవు. నాణ్యమైన మెటీరియల్‌తో తయారై నదున ఎక్కువ కాలం మన్నుతుంది. ఇదెంత మెత్తగా ఉంటుందంటే అమర్చేటప్పుడు, తీసి శుభ్రం చేసేటప్పుడు చేతులకు ఇబ్బంది ఉండదు. స్టీలు, చెక్క కాదు కనుక తుప్పుపట్టదు. అరిటాకు లాంటి ఈ సాధనం వంటింటి అందాన్నీ పెంచుతుంది. □

### అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్‌లో

## కార్తీక్, రవీనా, తేజస్‌కు స్వర్ణాలు



**న్యూఢిల్లీ:** జాతీయ అంతర్‌రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మూడో రోజున కేరళకు చెందిన కార్తీక్ ఉన్నికృష్ణన్ పురుషుల ట్రిపుల్ జంప్‌లో సీజన్‌లో అత్యుత్తమంగా 16.44 మీటర్ల జంప్‌తో అబ్దుల్లా అబూబకర్, జాతీయ రికార్డు హోల్డర్ ప్రవీణ్ చిత్రవేల్‌లను అధిగమించి స్వర్ణం సాధించాడు. అబూబకర్ 16.37 మీటర్లతో రెండవ స్థానంలో రజతం, చిత్రవేల్ 16.35 మీటర్లతో కాంస్యంతో సరిపెట్టుకున్నారు. కార్తీక్ ఇటీవల భువనేశ్వర్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ కాంస్య ఈవెంట్‌లో రజతం గెలుచుకోవడమే కాకుండా జాతీయ పోటీలో తన ఫామ్‌ను కొనసాగించాడు. అలాగే రేస్‌వాకింగ్‌లో కేరళకు చెందిన 20 ఏళ్ల బిలిన్ జార్జ్ పురుషుల 20 కి.మీ ఈవెంట్‌ను 1:29:35.12 సమయంలో గెలుచుకున్నాడు. మహిళల 20 కి.మీ. ఈవెంట్‌లో రవీనా 1:35:13.49 సమయంతో మీట్ రికార్డును బద్దలు కొట్టింది. మహారాష్ట్రకు చెందిన తేజస్ షిర్సే తన అద్భుతమైన పరుగును కొనసాగించి, పురుషుల 110 మీటర్ల హార్డిల్స్‌ను 13.60 సెకన్ల సమయంతో ముగింపు రేఖను దాటి, సీనియర్ జాతీయ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సాధించాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మోమిత మోండల్ 13.22 సెకన్లలో వ్యక్తిగత అత్యుత్తమ స్కోరు నమోదు చేసి మహిళల 100 మీటర్ల హార్డిల్స్‌లో స్వర్ణం సాధించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభిషేక్ పాల్ 15:00.83 సెకన్లలో పురుషుల 5000 మీటర్ల టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. కర్ణాటక మిక్స్‌డ్ 4+400 మీటర్ల రిలేలో స్వర్ణం సాధించింది.

### ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో

## పురుషుల టీమ్‌కు వరల్డ్ టైటిల్స్

### రెండు స్వర్ణాలతో భారత్ అద్భుత ప్రదర్శన



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్–2025లో భారత పురుషుల కాంపౌండ్ జట్లు రెండు స్వర్ణాలు గెలుచుకున్నాయి. భారత కాంపౌండ్ అండర్ 18, అండర్ 21 జట్లు ప్రపంచ టైటిళ్లను గెలుచుకున్నాయి. కెనడాలోని విన్నిపెగ్‌లో శనివారం జరిగిన వరల్డ్ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్‌లో భారత కాంపౌండ్ పురుషుల అండర్ 21 జట్టు తమ తొలి జూనియర్ ప్రపంచ టైటిల్‌ను కైవసం చేసుకుంది. స్వర్ణ పతక పోటీలో ఇరు జట్లు 233 పాయింట్లతో సమంగా నిలిచిన తర్వాత, కుశాల్ దలాల్, మిహిర్ అపార్ మరియు గణేష్ మణి రత్నంలతో కూడిన భారత త్రయం షూటాఫ్‌లో జర్మనీని ఓడించింది. మరో విభాగంలో భారత ఆర్చర్లు మోహిత్ డాగర్, యోగేష్ జోషి మరియు దేవాన్ష్ సింగ్‌లతో కూడిన కాంపౌండ్ పురుషుల అండర్ 18 జట్టు ఫైనల్‌లో యుఎస్‌ఎను 224–222 తేడాతో ఓడించి క్యాడెట్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. మరోవైపు గాథా ఖడ్కే, జియానా కుమార్, శార్వరి షెండేలతో కూడిన భారత మహిళల అండర్ 18 రికర్వ్ జట్టు కాంస్య పతక పోరులో యుఎస్‌ఎ పై 6 –0 తేడాతో విజయం సాధించి క్యాడెట్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

### ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

## అర్జున్, ఎలావెనిల్ జోడీకి స్వర్ణం

### భారత్ ఖాతాలో 21 స్వర్ణ, 8 రజత, 10 కాంస్యాలు

**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్–2025లో భారత్ షూటర్స్ అద్భుతమైన ప్రదర్శన చేశారు. శనివారం కజకిస్తాన్‌లోని షిమ్కెంట్‌లో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అర్జున్ బాబుటా–ఎలావెనిల్ వలరివన్ బంగారు పతకాన్ని సాధించారు. ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో ఈ భారత జంట చైనాకు చెందిన డింగ్కే లు–జిన్లు పెంగ్ లను 17–11 తేడాతో ఓడించింది. ప్రారంభ రౌండ్లలో వెనుకబడినా తర్వాత మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ప్రారంభంలో 9.5, 10.1 స్కోర్‌లతో భారత్ ద్వయం ఉన్నా, తదుపరి దశలలో పుంజుకుని ఖచ్చితమైన షూటింగ్ లో దోషరహిత ప్రదర్శనను ప్రదర్శించి విజయాన్ని సాధించారు.



అంతకు ముందు జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఈవెంట్‌లో విజయం సాధించిన తర్వాత, ఎలావెనిల్ ఈ ఛాంపియన్‌షిప్‌లో ఆమెకు ఇది రెండవ బంగారు పతకం. ఆ పోటీలో, ఆమె 253.6 పాయింట్లు సాధించి, చైనాకు చెందిన పెంగ్ జిన్లు (253.0) మరియు కొరియాకు చెందిన క్వాన్ యుంజి (231.2) లను తృటిలో ఓడించి, మొదటిసారి ఖండాంతర ఛాంపియన్‌గా నిలిచింది. టోక్యో 2020 మరియు పారిస్ 2024 ఒలింపిక్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన ఎలావెనిల్, ఒత్తిడిలో కూడా తన ప్రతిభను ప్రదర్శించి, ఆసియాలో అగ్రశ్రేణి షూటర్లలో ఒకరిగా తన హోదాను సుస్థిరం చేసుకుంది. ఇక ప్రస్తుత షిమ్కెంట్‌లో జరిగిన ఈవెంట్లఓ భారత్ ఆధిపత్యం ఎలావెనిల్–బాబుటాకే పరిమితం కాలేదు. ఛాంపియన్‌షిప్‌లో ముందుగా, అర్జున్ బాబుటా, రుద్రాంక్ష్ పాటిల్, కిరణ్ జాదవ్‌లతో కూడిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌లలో భారత్ బలాన్ని ప్రదర్శించి స్వర్ణాన్ని గెలుచుకుంది. ఇదే సమయంలో మహిళల జట్టు పోటీలో ఎలావెనిల్ మెహులి ఘోష్–అనన్య నాయుడులతో జతకట్టి తృటిలో రజత పతకాన్ని కోల్పోయి, కాంస్యాన్ని గెలుచుకుంది, మెహులి ఘోష్ మహిళల వ్యక్తిగత 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్‌లో కూడా పోటీపడి ప్రశంసనీయమైన నాల్గవ స్థానంలో నిలిచింది.

కాగా చివరి లెక్కింపు ప్రకారం భారత్ 21 స్వర్ణాలు, 8 రజతాలు, 10 కాంస్య పతకాలతో పతకాల పట్టికలో సునాయాసంగా అగ్రస్థానంలో ఉంది. చైనా తొమ్మిది స్వర్ణాలు మరియు మొత్తం 19 పతకాలతో రెండవ స్థానంలో ఉంది.



## వన్డే కెప్టెన్సీకి పోటీ

### రోహిత్ ప్లేస్‌లో గిల్, శ్రేయస్స్

**న్యూఢిల్లీ:** వన్డేల్లో టీమిండియా కెప్టెన్సీ మార్పుపై బిసిసిఐ దృష్టిసారించింది. ప్రస్తుతం వన్డే కెప్టెన్‌గా ఉన్న రోహిత్ శర్మ స్థానంలో వేరొకరిని నియమించే యత్నాలు జరుగుతున్నాయి. ఈ రేస్‌లో టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్‌తో పాటు, శ్రేయస్ అయ్యర్ మధ్యే పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ రేసులో శ్రేయస్ వెనుకబడి ఉన్నట్లు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు వెల్లడిస్తున్నాయి. వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న ఆసియాకప్ 2025 కోసం భారత జట్టును ఇటీవల ఎంపిక చేశారు. ఆ జట్టు ఎంపిక తరువాత టీమ్‌ఇండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ గురించే చర్చ నడుస్తోంది. దేశవాళీతో పాటు ఐపీఎల్‌లో రాణించి మంచి ఫాలో ఉన్నప్పటికి కూడా శ్రేయస్‌కు ఆసియా కప్ టీమ్‌లో చోటు దొరకలేదు. ఇక ఇదే సమయంలో వన్డేల్లో శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా పరిశీలిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ వయసు 38 సంవత్సరాలు. ఇప్పటికే టెస్టులు, టీ20ల నుంచి రిటైర్ అయ్యాడు. 2027 వన్డే ప్రపంచ కప్ నాటికి అతనికి 40 సంవత్సరాలు నిండుతాయి. ఇటువంటి పరిస్థితిలో వన్డే ప్రపంచ కప్ కోసం భారత్ క్రికెట్ బోర్డు ఒక యువ ఆటగాడికి కమాండ్‌ను అప్పగించే ఆలోచన చేస్తోంది. రోహిత్ స్థానానికి సంబంధించిన రేసులో శుభమాన్, శ్రేయస్ మధ్యే పోటీ నెలకొంది. గత వన్డే ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీలలో అయ్యర్ అద్భుతంగా రాణించాడు. అయినప్పటికీ, కెప్టెన్సీ రేసులో అతను చాలా వెనుకబడి ఉన్నాడని భావిస్తున్నారు. ప్రస్తుతం గిల్‌కు టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించారు. అంతే కాకుండా అతను ఆసియా కప్‌కు పోటీ పడే టీ20కి కూడా వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యాడు. అతను ఇప్పటికే వన్డేలకూ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఈ నేపథ్యంలో గిల్ మూడు ఫార్మాట్లలోనూ జట్టుకు కెప్టెన్‌గా మారే అవకాశం ఎక్కువగా ఉంది. వన్డే కెప్టెన్సీకి కూడా ప్రస్తుత భారత టెస్ట్ కెప్టెన్ గిల్ సహజ ఎంపిక అని నివేదికలు వెల్లడిస్తున్నాయి. వన్డే క్రికెట్‌లో అతని సగటు 59. అయితే గిల్‌కు అయ్యర్ కంటే తక్కువ అనుభవం ఉంది. అలాగే ఐపీఎల్‌లో చాలా కాలం కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం శ్రేయస్‌కు ఉంది. కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలిపాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో పాటు పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్స్‌కు తీసుకెళ్లాడు. కానీ అనుభవంలో గిల్ అతని కంటే చాలా వెనుకబడి ఉన్నాడు. రోహిత్ శర్మ తర్వాత బీసీసీఐ వన్డేల్లో ఎవరిని కెప్టెన్‌గా చేస్తుందో ఇప్పుడు చూడాలి.

## మహిళల టెస్ట్: 254 ఆధిక్యంలో భారత్

**న్యూఢిల్లీ:** ఏకైక అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో ఒక రోజు ఆట మిగిలి ఉండగా, భారత్ జట్టు ఆస్ట్రేలియా జట్టుపై భారీ ఆధిక్యాన్ని సాధించింది. బ్రిస్బేన్ అలన్ బోర్డర్ ఫీల్డ్‌లో నాలుగు రోజుల ఆటలో శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఆస్ట్రేలియా 254 పరుగుల ఆధిక్యాన్ని పెంచుకుంది. రాఘ్వీ బిస్ట్ 86, షఫాలీ వర్మ 52 పరుగులతో కీలక పాత్ర పోషించారు. జోషిత వీజే (9 నాటౌట్), టైటాస్ సాధు (2 నాటౌట్) క్రీజులో ఉండగా, ఇండియా 73 ఓవర్లలో 260/8తో రోజు ముగిసే సమయానికి స్కోరు చేసింది. అంతకుముందు, ఆస్ట్రేలియా 76.2 ఓవర్లలో 305 పరుగులకు ఆలౌటైంది, సీమ్ బౌలింగ. ఆల్ రౌండర్ సియానా జింజర్ పోరాడి 300 పరుగులు సాధించాడు. అయితే ఈ మ్యాచ్ డ్రా అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ఆస్ట్రేలియా 158/5 వద్ద 24 పరుగులతో నాటౌట్‌గా తిరిగి ఆట ప్రారంభించిన సియానా, నికోల్ ఫాల్టమ్ (54) తో కలిసి 102 పరుగుల భాగస్వామ్యంతో ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. జోషిత చేతిలో నికోల్ అవుట్ అయిన తర్వాత, సియానా మైట్లాన్ బ్రౌన్ (22) తో కలిసి మరో 44 పరుగులు జోడించి, తన 138 బంతుల్లో



12 ఫోర్లతో కూడిన ఏకైక సిక్స్‌తో సెంచరీని నమోదు చేసింది. 103 పరుగుల వద్ద సైమా ఠాకూర్ బౌలింగ్ లో క్యాచ్ ఇచ్చి ఔటైన చివరి బ్యాట్స్‌మెన్ ఆమె. ఆ తర్వాత ఆతిథ్య జట్టు ఇండియా ఎ తొలి ఇన్నింగ్స్ లో 299 పరుగుల కంటే కేవలం ఆరు పరుగులు ముందు నిలిచింది. సియానా కూడా బంతితో తొలి ప్రభావం చూపింది, ఓపెనర్ నందిని కశ్యప్‌ను 12 పరుగులకే ఎల్బీడబ్ల్యూగా ట్రాప్ చేసి ఆస్ట్రేలియాకు తొలి బ్రేక్‌త్రూ అందించింది. కానీ షఫాలి 58 బంతుల్లో 52 పరుగులు చేసి, రెండు సిక్సర్లు కొట్టి, అమీ ఎడ్గార్‌కు బౌలింగ్ వేసింది. ఆమె ధరా గుజ్జర్ (20)ను కూడా అవుట్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 93 పరుగులు చేసిన రాఘ్వీ 119 బంతుల్లో 86 పరుగులు చేసి 13 బౌండరీలు బాది ఇండియా ఆధిక్యాన్ని 200 దాటించింది. రోజు చివరిలో ఎడ్గార్ బౌలింగ్‌లో ఆమె అవుట్ కావడంతో పర్యాటక జట్టు ఎనిమిది పరుగులు చేసింది. సంక్షిప్త స్కోర్లు: భారత్ 73 ఓవర్లలో 299, 260/8 (రాఘవి బిస్త్ 86, షఫాలీ వర్మ 52; అమీ ఎడ్గర్ 453, జార్జియా ప్రెస్‌విడ్జ్ 242), ఆస్ట్రేలియా 76.2 ఓవర్లలో 305. (సియాన్నా జింజర్ థాక్యుమ్ 103, నిమాకోలే 103 331, రాధా యాదవ్ 268) భారత్ ఆధిక్యం 254 పరుగులు.

## ప్రభుత్వ బ్యాంకుల్లో కొత్త స్కీమ్‌లు!




**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** కొంత కాలంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)రెపో రేట్లను తగ్గిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బ్యాంకులు లోన్,ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను క్రమక్రమంగా తగ్గుతున్నాయి. ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకులు రెగ్యులర్ డిపాజిట్లతో పోలిస్తే అధిక వడ్డీ అందిస్తూ ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల్ని ప్రారంభిస్తున్నాయి. ఎస్బీఐ సహా ఇతర ప్రభుత్వ బ్యాంకులు చాలానే ఉన్నాయి. కేవలం 444 రోజుల వ్యవధితో ప్రత్యేక డిపాజిట్ పథకాల్ని ఏర్పాటుచేస్తున్నాయి.ఎస్బీఐ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 444 రోజుల వ్యవధితో అమృత్ వృష్టి పథకం ఇటీవల ప్రారంభం కాగా...రూ. లక్ష పొదుపుతో సాధారణ ప్రజలకు 6.60 శాతం (రూ. 8,288), సీనియర్ సిటిజెన్లకు 7.10 శాతం (రూ. 8,931) వడ్డీ అందిస్తోంది. ఇక్కడ రూ. రూ. 1,08,288 వస్తుంది. సీనియర్ సిటిజెన్లకు రూ. 8,931 వడ్డీ వస్తుంది. సూపర్ సీనియర్ సిటిజెన్లకు 7.20 శాతం చొప్పున రూ. 9061 వడ్డీ అందుతుంది.ఇక

బ్యాంక్ ఆఫ్ బరోడాలో బీఓబీ స్క్వేర్ డ్రైవ్ డిపాజిట్ స్కీమ్‌తో ఎస్బీఐ మాదిరిగానే వడ్డీ రేట్లు ఉన్నాయి. రిటర్న్లు కూడా అలాగే ఉంటాయని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు.అదేవిధంగా

ఇండియన్ బ్యాంకులో ఇండ్ సెక్యూర్ ప్రొడక్ట్ ఎఫ్‌డీ స్కీమ్ తీసుకొచ్చింది. సాధారణ ప్రజలకు అత్యధికంగా 6.70 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.20 శాతం, సూపర్ సీనియర్ సిటిజెన్లకు 7.45 శాతం వడ్డీ అందిస్తోంది. ఇక్కడ రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసిన వారికి మెచ్యూరిటీకి వరుసగా రూ. 8418, రూ. 9061, రూ. 9,387 గా ఉంది.ఐడీబీఐ బ్యాంక్ ఈ బ్యాంకు ఉత్సవ్ ఎఫ్‌డీ స్పెషల్ డిపాజిట్ స్కీమ్‌తో సాధారణ ప్రజలకు, సీనియర్ సిటిజెన్లకు ఇండియన్ బ్యాంకు మాదిరిగానే వడ్డీ రేట్లు ఉన్నాయి. రిటర్న్లు అలాగే ఉంటాయి. సూపర్ సీనియర్ సిటిజెన్లకు మాత్రం 7.35 శాతం వడ్డీ రేటుతో రూ. 9257గా ఉన్నాయి.

## ఎయిర్‌టెల్ ఆరు నెలలు ఉచితం!




**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ మరోసారి ఆఫర్లను ప్రకటించింది, రీఛార్జ్‌తో కాల్స్, డేటాతో పాటుగా అదనపు బెనిఫిట్స్ కల్పిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. యాపిల్ భాగస్వామ్య ప్రయోజనాన్ని ఇప్పుడు ప్రీపెయిడ్ కస్టమర్లకు సైతం ఉంటుంది. పోస్ట్‌పెయిడ్ కస్టమర్లకు అందించే ఈ బెనిఫిట్స్ ప్రీపెయిడ్ కస్టమర్లు ఉచితంగా పొందవచ్చు. ఐదు నెలల ఫ్రీ ట్రయల్ పూర్తయిన తర్వాత మీరు డీయాక్టివేట్ చేసుకోవాలి. లేదంటే నెలకు రూ. 119 చొప్పు ఆటోరెన్యూవల్ అవుతుందని వెల్లడించింది. యాపిల్ మ్యూజిక్ వ్యక్తిగత ప్లాన్‌కు ధర ఒక నెలకు రూ. 99 ఉండగా.. ఫ్యామిలీ ప్లాన్ అయితే రూ. 149, స్టూడెంట్స్ ప్లాన్ రూ. 59గా నిర్ణయించారు. ఎయిర్‌టెల్ కొత్త ఆఫర్ ద్వారా ప్రీపెయిడ్ యూజర్లు ఆరు నెలల వరకు ఉచితంగా పొందవచ్చు. దీంతో సుమారు రూ. 600 వరకు ఆదా చేసిన వారు అవుతారు. యాపిల్ ప్రీమియం మ్యూజిక్ క్లెయిమ్ చేసుకుంటే యాడ్‌ఫ్రీ మ్యూజిక్, ప్రత్యేక ప్లేలిస్టులు,ఆఫ్‌లైన్ డౌన్ లోడ్స్, హైక్వాలిటీ సౌండ్స్ వంటి ప్రయోజనాలు పొందవచ్చు.సుమారు రూ. 17000 విలువైన పర్లెక్సిటీ ఏఐ ఏడాది ఉచితం ఉంది.అలాగే యాపిల్ టీవీ ప్లస్, రూ. 279 ప్రీపెయిడ్ ప్లాన్‌తో ద్వారా నెట్ ఫ్లిక్స్ బేసిక్, జీ5, ఎక్స్‌స్ట్రీమ్ ప్లే ప్రీమియం, డిస్నీ+ హాట్‌స్టార్, వంటివి నెల రోజులు ఉచితంగా ఉన్నాయి.

## మారుత్ నిఘా డ్రోన్‌కు డిజిసిఎ సర్టిఫికేట్




**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** హైదరా బాద్‌కు చెందిన మారుత్ డ్రోన్స్ సంస్థ రూపొం దించిన నిఘా డ్రోన్లు అయిన 'దస్సెస్వి ఫ్ట్56కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఏ) సర్టిఫికేట్ లభించింది. నిఘా, హై–ప్రెసిషన్ మాపింగ్, ఫీల్డ్ ట్రైనింగ్ అవసరాలకు ఈ క్వాడ్‌కాప్టర్–క్లాస్ రోటోక్రాఫ్ట్ ఉపయోగపడుతుందని కంపెనీ వెల్లడించింది.

ఎఫ్‌పిఏ కెమెరా, 24ఎంపి మ్యాపింగ్ కెమెరా, 4కే సర్వేలెన్స్ కెమెరా, థర్మల్ ఇమేజింగ్ పరికరాలతో పాటు పలు పేలోడ్ కాన్ఫిగరేషన్లతో అభివృద్ధి చేసినట్లు వివరించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచేందుకు వీలుగా ఉంటుందని సీఈవో, సహ వ్యవస్థాపకుడు ప్రేమ్‌కుమార్ విస్లావత్ తెలిపారు

## ఆన్‌లైన్ మనీగేమ్‌లు నిలిపివేత

**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** బెట్టింగ్‌యాప్‌లతో ఎందరో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రమాదకరమైన ఆన్‌లైన్ గేమింగ్‌ల నిషేదం ఎట్టకేలకు చట్టబద్దత ఏర్పడింది. పార్లమెంట్, రాష్ట్రపతి ఆమోదించడంతో చట్టం అమలుపై ఏ క్లాజులు ముందుగా ఉంటాయనేది కేంద్ర ఐటీ కార్యదర్శి ఎస్.కృష్ణన్ వివరించారు. ప్రతిపాదత నిబంధనలపై ఐటీశాఖ నిర్వర్తిస్తుందని, ఇస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషియల్ గేమ్స్ ప్రోత్సాహం, నియంత్రణ విషయంలో వ్యవస్థ ఏర్పాటుకానుంది. అదేవిధంగా ప్రమోషన్, రెగ్యులేజేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్–2025లో పేర్కొన్న



నియంత్రణ సంస్థ ఉంటుందన్నారు. ఈ చట్టంతో దేశంలో అన్నిరకాల ఆన్‌లైన్ మనీగేమ్స్‌పై నిషేదం విధించగా, ఇప్పటికే సంస్థలు రియల్ మనీగేమ్‌లను నిలిపివేశాయి. ఇస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషియల్ గేమింగ్‌ను ప్రోత్సాహించాడానికి ఈ బిల్లును తీసుకవచ్చారు. సొంతంగా నిలబడగలిగే చట్టం కాదిదన్నారు. బిల్లులోని ఇతర సెక్షన్లకు ముందే నిషేదాన్ని అమలులోకి తీసుకవచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు వివరించారు. దీనికి సంబంధించిన నిర్దిష్ట నిబంధనలే లేవని వెల్లడించారు.

**అమల్లోకి రాగానే 'నజార్హా పతనం..**

నజారా టెక్నాలజీస్ షేర్ల పతనం కొనసాగుతుంది. గత మూడు రోజుల్లో 17.52శాతం విలువను కోల్పోయ్యాయి. అసోసియేట్ సంస్థ మూన్‌షైన్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్న 'పోకర్‌బాజ్లీ తన రియల్ మనీ ఆన్‌లైన్ గేమ్స్ నిషేదం కారణం. ప్రమోషన్, రెగ్యులేజేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్–2025తో కార్యాకలాపాలను ఆపేస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది, అయితే నజారాకు ఈ కంపెనీలో 46.07శాతం వాటా ఉంది.

## టోల్‌ప్లాజా ఆపరేటర్లకు ఎన్‌హెచ్‌ఎఐ పరిహారం



**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** జాతీయ రహదారుల టోల్‌ప్లాజా ఆపరేటర్లకు భారత జాతీయ రహదారుల ప్రాధికర సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) మూడు నెలల పరిహారం అందించనుంది. ప్రైవేటు వాణిజ్యేతర వాహనాలకు ఆగస్టు 15నుంచి అమల్లోకి వచ్చిన ఫాస్టాగ్ వార్షికపాస్ నేపథ్యంలో వినియోగదారు ఫీజుల వసూళ్లలో వచ్చిన అంతరాయాన్ని భర్తిచేయనుంది. అయితే సింగిల్ పరిహార వ్యవస్థ తీసుకరావాలని నిర్ణయించినట్లు సర్క్యూలర్‌లో వెల్లడించింది. 2024–25 ఏడాదిలో టోల్‌ద్వారా రూ.72,931 కోట్లను ఎన్‌హెచ్‌ఐఏ వసూలు చేసింది. ఈ మెకానిజం ప్రస్తుత కాంటాక్ట్ ఒప్పందాలతో పాటు, వచ్చే మూడు నెలల్లో ఆహ్వానించే బిడ్‌లకు వర్తిస్తుంది. తర్వాత ప్రతి టోల్‌ప్లాజా వద్ద వార్షిక పాస్ వినియోగంతో గణాంకాలను తెలుపనున్నట్లు స్పష్టం చేసింది. రూ.3వేలు ఒకేసారి ఫీజు కడితే జాతీయ రహదారులపై 200 టోల్‌ప్లాజాల పరిధిలో ఒక్కోదానికి రూ.15 మాత్రమే అవుతుందని వివరించింది.

## 20 యేళ్లకు పైబడిన వాహనాలక్కు ఆర్‌స్సి రుసుం పెంపు



**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** ఇరవై ఏళ్లకు పైబడిన వాహనాలపై ఆర్‌సి రెన్యూవల్ రుసుంను ప్రభుత్వం పెంచింది. ఇప్పటి వరకు మోటర్ వాహనాల నిబంధనల్లో 81 ప్రకారం కొత్తగా 4సి క్లాజ్‌ను చేర్చి వాటికి అవకాశం కల్పించింది. దీనిపై జిఎస్‌టి అదనంగా ఉంటుందని ఉత్తర్వులో పేర్కొంది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 20ఏళ్లకు పైబడిన మోటర్ వాహనాలకు రెన్యూవల్ ఫీజ్‌ను రూ.2వేలు, మూడు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.5వేలు పెంచారు. దిగుమతి చేసుకున్న బైక్, త్రిచక్ర వాహనాలకు రూ.20వేలు కాగా నాలుగు, ఆపై చక్రాల వాహనాలకు 80వేలుగా నిర్ధారించినట్లు వివరించింది.

**వాణిజ్యం**

## వచ్చే యేడాదిలో ఎలక్ట్రిక్ 'రాయల్ ఎన్‌ఫీల్డ్



**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ మరో విద్యుత్తు బైక్ మార్కెట్లోకి తీసుకవస్తుంది. వచ్చే ఏడాదిలో ఆ అనుబంధ సంస్థ ఫ్లయింగ్ ఫ్లీ విడుదల చేయనుంది. ఈ మేరకు ఫ్లయింగ్ ఫ్లీ సి6 మోడల్‌ను హైదరాబాద్‌లో ప్రదర్శన ఏర్పాటు చేసింది. నగరాల్లో సులభంగా నడిపేందుకు వీలుగా, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఆధారిత ఆవిష్కరణలతో రూపొందించినట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో ఉపయోగించిన ఫ్లయింగ్ ఫ్లీ మోటర్ సైకిల్ నుంచి స్ఫూర్తి పొంది ఏర్పాటు చేసినట్లు వివరించారు. దాదాపు 200మందికి పైగా ఇంజనీర్లు రూపకల్పనకు శ్రమించారన్నారు.40కి పైగా పేటేంట్ దరఖాస్తులు చేసినట్లు చెప్పారు. ఒకే సీటుతో 19 అంగుళాల అలాయ్‌వీల్స్‌తో రానుంది. స్మార్ట్‌ఫోన్‌తో కనెక్ట్ అయ్యే 3.5అంగుళాల టచ్‌స్క్రీన్ టీఎఫ్‌టి ఇనుస్ట్రుమెంట్ క్లసర్ ఉందని పేర్కొన్నారు. గూగూల్‌మ్యాప్స్‌తో పాటు అన్ని అప్లికేషన్లు ఉన్నాయి. రిమోట్‌లాక్, అన్‌లాక్, వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్‌చార్జర్, ఐదురకాల రైడింగ్ పద్దతులు తదితర సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నాం. ఒక చార్జింగ్‌తో కిలోమీటర్ల దూరమనేది త్వరలో చెప్తామని, సుమారు 100, 150 కిలోమీటర్ల సామార్థ్యమే ఉంటుందని ప్రతినిధులు వివరించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.